ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 133 పేజీలు: 8+16 వెల: 6.50

నేటి నుంచి ఇ-సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం 3లో

ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం 5లో

## డిఎ పెంపు 3.64 శాతం

### 2023 జనవరి 1 నుంచి వర్తింపు, ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్13:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. ఉద్యోగుల కరవు భత్యాన్ని (డిఎ) 3.64 శాతం పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ఈ డిఎ 2023 జనవరి 1వతేదీనుంచే వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొంత కాలంగా డిఎ పెంపు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుంది. తాజాగా పెంచిన 3.64 శాతం డిఎతో ఉద్యోగుల మూల వేతనంపై అదనపు భత్యం కలవనుంది. కాగా ఇటీవల కేబినెట్ సమావేశంలో రెండు డిఎలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం ఒక >>2

## ఓటుకు నోటు కేసులో సిఎంకు ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్13:** రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు పై శుక్రవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తనకు మినహాయింపు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి చేసిన అభ్యర్థనను కోర్టు పరిగణలోకి తీసుకుంది. ఈ కేసులో సిఎం రేవంత్ రెడ్డితో పాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహా, వేం కృష్ణ కీర్తన్‌ల హాజరుకు కోర్టు మినహాయింపు ఇచ్చింది. కాగా ఇదే కేసులో మత్తయ్య, సండ్ర వెంకట వీరయ్య శుక్రవారం హాజరయ్యారు. విచారణ వేగంగా జరిపి కేసును తేల్చాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌దృష్ట్యా వాయిదా వేయాలని నిందితుల తరఫున న్యాయవాదులు కోరగా, హైకోర్టులో స్టే పొందాలి >>2



శుక్రవారం అహ్మదాబాద్ విమానాశ్రయంవద్ద ప్రమాదం జరిగిన ప్రదేశాన్నిపరిశీలిస్తున్న ప్రధాని మోడీ

## ఇది ఊహించని పెను విషాదం

### బోయింగ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రధాని మోడీ

### గాయపడిన మెడికోలకు పరామర్శ

**అహ్మదాబాద్, జూన్ 13:** గుజరాత్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాద స్థలాన్ని ప్రధానిమోడీ శుక్రవారం సందర్శించారు. ప్రమాద వివరాలను అధికారులనుంచి అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదంనుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమానప్రయాణీకుడు రమేష్ విశ్వాస్‌కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోల >>2

## దొరికిన బ్లాక్ బాక్స్




**అహ్మదాబాద్, జూన్ 13:** అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కీలకంగా మారిన బ్లాక్ బాక్సు లభ్యమైంది. విమానం కూలిన బిల్డింగ్ పైకప్పుపై బ్లాక్ బాక్సును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన 27 గంటల తర్వాత ఈ బ్లాక్ బాక్సు లభ్యమైంది. దర్యాప్తు బృందం ఈ బ్లాక్ బాక్సు విశ్లేషణను ప్రారంభించింది. ప్రమాదానికి గల కారణాలు >>2

### బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన 2లో

### గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి



శుక్రవారం విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

## హైస్కూలు స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ

### ఈ యేడాది మరో 571 పాఠశాలలు ప్రారంభం

### విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

### పిల్లలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చి దిద్దాలి

### విద్యాశాఖ సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్13:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమలక్ష్యమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని, ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సిఎం స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సిఎం వెల్లడించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సిఎం ఆదేశించారు. ఈ క్రమంలో బోధన ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సిఎం సూచించారు.

హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని సిఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్‌ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సిఎం ఆదేశించారు. నాణ్యమైన భోజనం,యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు >>2

## రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా హెచ్చింపు?

### ఒఆర్ఆర్, త్రిబులార్‌పై అధిక శాతం పెంచే దిశగా ప్రణాళిక

**హైదరాబాద్ జూన్ 13 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ మార్కెట్ ధరలు పెంచడానికి సిద్ధమవుతోన్నట్లు తెలిసింది. హైదరాబాద్ ఓఆర్ఆర్, త్రిబులార్ మధ్య ప్రాంతాలపై ఈ పెంపు ప్రధానంగా ఉంటుందని సమాచారం. అపార్ట్‌మెంట్లపై 30 శాతం, ఖాళీ స్థలాలపై వంద శాతం లేదా అంతకంటే ఎక్కువ పెరుగుదల ఉండవచ్చు. ఇది ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతుంది.. కానీ గృహ కొనుగోలుదారులకు ఆర్థిక భారం అవుతుంది. ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

తెలంగాణ రాష్ట్రంలో ఆస్తి కొనుగోలుదారులకు, ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఫ్లాట్స్, అపార్ట్‌మెంట్‌లు, ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు చేయాలనుకునే వారికి మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రంలోని రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. అయితే ఇది రియల్ ఎస్టేట్ రంగంపై.. సామాన్యుల ఇంటి కలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. పెరుగుతున్న ఆర్థిక అవసరాలు.. సంక్షేమకార్యక్రమాలకు నిధులు సమీకరించడం వంటి లక్ష్యాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం.. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతాల్లో జరిగే భూముల లావాదేవీల రిజిస్ట్రేషన్ మార్కెట్ ధరలు పెంచనున్నారు. ఈ ప్రాంతాలు గత కొన్నేళ్లుగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మౌలిక సదుపాయాలు విస్తరిస్తున్నాయి.. పెట్టుబడులకు అనుకూలంగా మారాయి. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ విలువలు గణనీయంగా పెరిగాయి. దీనికి అనుగుణంగా మార్కెట్ ధరలు >>2

## 'సాగర్'పై ముదిరిన కలహాం

ప్రాజెక్టుపై పట్టుకోసం తెలంగాణ, ఎపి పోటాపోటీ ఎత్తులు

స్పెషల్ పోలీసు ఫోర్స్ మొహరింపునకు ఎపి సన్నాహాలు

తెలంగాణవైపు ఏప్రిల్‌లోనే సిఆర్‌పిఎఫ్ ఉపసంహారణ




**హైదరాబాద్,జూన్ 13,ప్రభాతవార్త:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుపై పట్టుకోసం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ పోటాపోటిగా ఎత్తులు వేస్తున్నాయి. ఎన్ఎస్‌పి కుడివైపు మొత్తం ఆంధ్రప్రదేశ్ ఆజమాయిషీలోనే ఉంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ పోలీస్ ఫోర్సును మోహరించేందుకు సన్నాహాలు చేస్తున్నది. జూన్‌నెలలో సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉపసంహరించుకోగానే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్‌పిఎఫ్ బలగాలు ఆనకట్ట భద్రతకు పంపించాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ డిజిపికి లేఖ రాసి కోరింది. ఆంధ్రప్రదేశ్ వైపు ఉండే ఆనకట్టను కుడికాల్వను ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ నిర్వహించుకునేందుకు సన్నద్దం అవుతోంది. కృష్ణాయాజమాన్య బోర్డు సమావేశంలో నాగార్జున సాగర్ ఆనకట్ట నుంచి సిఆర్‌పిఎఫ్ దళాలను ఉపసంహరించేందుకు నిర్ణయం తీసుకొంది.

ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం అవశేష ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకు అజమాయిషీహక్కు దఖలుచేశారు. నాగార్జునసాగర్ కొత్తగా ఏర్పాటైన తెలంగాణ అజమాయిషీలో ఆపరేషన్ మేంటనెన్స్ చేయాలని అధికారులు కట్టబెట్టారు. గత పదేళ్లుగా నాగార్జునసాగర్ విషయంలో ఇరు రాష్ట్రా నీటిపారుదలశాఖ అధికారులు గొడవపడుతూనే ఉన్నారు.

2023 నవంబర్ 30న ఎన్ఎస్‌పిపై ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖ అధికారులు పోలీసులతో కలిసి ఆదిపత్యం కోసం గొడవకు దిగడంతో సిఆర్‌పిఎఫ్ బలగాలు ఆనకట్టభద్రతకు మోహరించారు. కెఆర్ఎంబి సమావేశంలోని ఇరు రాష్ట్రాల నిర్ణయం మేరకు సిఆర్‌పిఎఫ్ దళాలను ఉపసంహరిస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ దళాలు ఉపసంహారణ జరుగగానే ఆనకట్టపై యాజమాన్య హక్కు రాష్ట్రవిభజన చట్టం ప్రకారం తెలంగాణకు దఖలుపడుతోంది. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ ఫోర్స్‌తో ఆనకట్టపై భద్రత కల్పించాల్సి ఉంటుంది. ఎపి వైపు ఉన్న కుడికాలువ కూడా అజమాయిషీ తెలంగాణ స్పెషల్ పోలీసులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం ఎన్ఎస్‌పిపై తన హక్కును వదులుకోవడానికి సిద్ధంగా లేదని తాజాగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ డిజిపి >>2



## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడి

### రివల్యూషనరీ గార్డ్ చీఫ్ ముస్సేన్ సలామీ సహా పలువురు కీలక అధికారులు మృతి

### యురేనియం శుద్ధి కేంద్రాలపై జెట్ దాడులు, టెహ్రాన్‌లో ఎమర్జెన్సీ.. ఇరాన్ గగనతలం మూసివేత

**జెరూసలెం, జూన్ 13:** పశ్చిమాసియా మళ్లీ రగులుతోంది. ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడింది. ఈ భీకర దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ సహా పలువురు కీలక వ్యక్తులు మరణించారు. ఈ మేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. 'ఐఆర్‌జిసి హెడ్‌క్వార్టర్స్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఈ దళం అధిపతి మేజర్ జనరల్ హొస్సేన్ సలామీ మరణించారు'అని కథనాలు పేర్కొన్నాయి. ఈయనతోపాటు రెవల్యూషనరీ గార్డ్‌లోని ఇతర టాప్‌అధికారులు, ఇద్దరు అణుశాస్త్రవేత్తలుకూడా మరణించినట్లు తెలిపాయి.

ఇరాన్ కాలమానం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ తొలుత దాడులు చేసింది. ఆ తర్వాత శుక్రవారం ఉదయం రెండో దశ దాడులు ప్రారంభించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ విరుచుకుపడుతోంది.

యురేనియం శుద్ధి కేంద్రంపై ఇజ్రాయెల్‌కు చెందిన జెట్లు పలుమార్లు దాడులు చేసినట్లు ఆ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రాంతంలోని భారీ ఎత్తున పొగ కమ్ముకున్న దృశ్యాలు బయటికొచ్చాయి. ఇక, నతాంజ్ ప్రాంతంలోని అణుకేంద్రం వద్దతాజాగా మరోసారిపేలుళ్ల సంభవించినట్లు తెలుస్తోంది.ఉద్రిక్తతల దృష్ట్యా ఇరాన్ >>2



## కెటిఆర్‌కు మళ్లీ ఎసిబి నోటీసులు

### 16న విచారణకు రావాలని ఆదేశం

### 'ఫార్ములా కారు' రగడ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనంరేపిన ఫార్ములా ఈకార్ రేసుకు సంబంధించి ఎసిబి విచారణ మళ్లీ మొదలయ్యింది. ఈ కేసుకు సంబంధించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఎసిబి మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16వ తేదీన విచారణకు రావాలని కోరింది. ఇదే కేసుకు సంబంధించి గత నెల 26వ తేదీన ఎసిబి అధికారులు కెటిఆర్‌ను నోటీసులు జారీ చేసి, 28వ తేదీన విచారణకు రావాలని కోరడం తెలిసిందే. అయితే అమెరికా పర్యటన కారణంగా తాను ఈ విచారణను రాలేనని మరోతేదీన హాజరవుతానని కెటిఆర్ చెప్పడం విదితమే. ఇందులో భాగంగా >>2

## ట్యాపింగ్ పాపం ప్రభాకర్‌రావుదే!

### సిట్ విచారణలో మరోసారి స్పష్టం చేసిన ప్రణీత్‌రావు

### మూడు గంటలు ప్రశ్నించిన అధికారులు

### నేడు ప్రభాకర్, ప్రణీత్‌లను కలిపి విచారణ జరిపే అవకాశం



ప్రణీత్‌రావు



ప్రభాకర్ రావు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయి పదినెలల పాటు జైల్లో వుండి బెయిలుపై విడుదలైన ఎస్ఐబి మాజీ డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావును సిట్ అధికారులు శుక్రవారం నాడు మూడు గంటల పాటు విచారించారు. అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌కు ప్రణీత్ రావు బాస్‌గా వుండే వారు. ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు ఆయన అజమాయిషీలో ఈ ట్యాపింగ్ యూనిట్ పనిచేసేదని ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మొదట అరెస్టయ్యింది ప్రణీత్ రావే కావడం గమనార్హం. మొదట పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫోన్ ట్యాపింగ్‌పై గత ఏడాది మార్చి పదవ తేదీన కేసు నమోదు కాగా ఆ సమయంలో సిరిసిల్ల డిఎస్‌పిగా వున్న ప్రణీత్‌రావును విచారణ పేరిట హైదరాబాద్‌కు పిలిపించి అరెస్టు చేయడం విదితమే.

దీని తరువాత వరుసగా భూపాలపల్లి అదనపు ఎస్‌పి భుజంగరావు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు డిసిపి తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డి రాధాకిషన్ రావు అరెస్టయ్యారు. వీరంతా పదినెలలపాటు చంచల్‌గూడజైల్లో రిమాండులో వుండి బెయిలుపై విడుదలయ్యారు. >>2

## నేడు నీట్-2025 ఫలితాలు 2లో




విమాన ప్రమాదంలో మరణించిన మాజీ సిఎం రూపానీ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన ప్రధాని మోడీ. ఆసుపత్రిలో ఓ క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ప్రధాని మోడీ

# మాజీ సిఎం రూపానీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని మోడీ

**అహ్మదాబాద్,జూన్13:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంపరామర్శించారు. భర్త మరణవార్త తెలుసుకున్న లండన్‌లో ఉన్న విజయ్ రూపానీ భార్య అంజలి రూపానీ శుక్రవారం ఉదయం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ప్రధాని మోడీ.. రూపానీ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లండన్‌లో ఉన్న కూతుర్ని కలిసేందుకు గుజరాత్ మాజీ సిఎం డ్రీమ్‌లైనర్ విమానం ఎక్కారు. గతవారమే ఆయన భార్య అంజలి రూపానీ లండన్ బయల్దేరి వెళ్లారు. అయితే కొన్ని పనుల కారణంగా విజయ్ రూపానీ ఇండియాలోనే ఉండాల్సి వచ్చింది. పనులు ముగించుకొని విజయ్ రూపానీ కూడా గురువారం లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఎక్కారు. విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే అది కూలిపోయింది. ఈ ఘటనలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కుటుంబాన్ని కలిసేందుకని విమానం ఎక్కిన విజయ్‌రూపానీని మృత్యువు ఒక్కసారిగా కబళించడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు గుజరాత్ సీఎంగా రూపానీ బాధ్యతలు నిర్వర్తించారు.

# పెను విషాదం

>> తోనూ మోడీ మాట్లాడి వారిలో ధైర్యం నింపారు. ఆయన వెంట గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రహోంమంత్రి హర్షసంఘవి తదితరులు ఉన్నారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థంచేసుకోగలనంటూ విచారం వ్యక్తంచేసారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం వెంటాడుతుందని, ఆ వేదనను మాటల్లో చెప్పలేమన్నారు. విషాద సమయంలో తన ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలగురించేనన్నారు. ఆ తర్వాత అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో మోడీ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. ఇదేరోజు ఎయిరిండియా ఎండి సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్‌కూడా ప్రమాదస్థలాన్ని సందర్శించి ప్రమాదం తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా అహ్మదాబాద్‌కు చేరుకుని సమీక్షచేసారు. మరోవైపు ప్రమాదస్థలంలో జాగిలాల సాయంతో మృతదేహాలను గుర్తించి వెలికితీసేపనిలో సిబ్బంది నిమగ్నం అయ్యారు.

**ఎలా బతికానోకూడా తెలియదు..మోడీకి బాధితుడి వివరణ**

కాగా చికిత్స పొందుతున్న విశ్వాస్‌కుమార్‌తో మోడీ మాట్లాడారు. నమ్మలేకుండా ఉందని, ఎలా బతికానో కూడా తెలియడంలేదని చెప్పాడు. విమానంలో 11ఎ సీటులోక ఊర్చున్న రమేష్ ఎమర్జెన్సీ విండోనుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారంటూ తొలుత పోలీసులు చెప్పారు. ఆతని సోదరుడు ధీరేంద్ర సోమ్‌భాయ్‌కూడా అదే స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రమేష్ మాత్రం జరిగింది అదికాదని స్పష్టత ఇచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని, తమ విమానం నేలకూలుతుందన్న విషయం తనకు అర్థమయిందని, ఆవెంటనే విమానం కిందకువచ్చి ముక్కలయి పేలిపోయిందని ప్రమాదక్షణాలు గుర్తుచేసుకున్నాడు. 38 ఏళ్ల బ్రిటిష్ ఇండియన్ అయిన రమేష్ అద్భుతం జరిగిందని ప్రమాద సమయంలో విమానం రెండుముక్కలయిందని, తన సీటు ఎగిరి కొంచెం దూరంలోపడిపోయిందని ఈక్రమంలోనే తనకు గాయాలయ్యాయని చివరకు ప్రాణాలతో బయటపడ్డానని రమేష్ ప్రధానిమోడీకి వివరించారు.

# 3.64 శాతం

>> డిఎ ఇచ్చిన ప్రభుత్వం మరో ఆరు నెలల తర్వాత మరో డిఏను అందించనుంది. కాగా, ఉద్యోగులకు ప్రకటించిన ఒక డిఏ చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి నెలా సగటున సుమారు రూ.200 కోట్లు.. ఏడాదికి దాదాపు 2,400 కోట్ల అదనపు భారం ఖజానాపై పడనుందని ఆర్థిక శాఖ వర్గాలు లెక్కలు తీశాయి. ఓవైపు పెద్ద ఎత్తున అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలకు నిధుల కొరత రాకుండా చూస్తూనే మరోవైపు ఎంప్లాయిస్ సంక్షేమానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగా ఇప్పటి నుంచి ప్రతి నెలా రూ.700 కోట్లనను రిటైర్డ్ ఎంప్లాయిస్ బెనిఫిట్స్ కోసం ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం ఐదు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఒకటి ఇవ్వడానికి సిద్దమవ్వగా మరో నాలుగు పెండింగ్‌లో ఉండనున్నాయి.

# సిఎంకు ఊరట

>> లేదా ఇక్కడవిచారణ కొనసాగించాలని నాంపల్లికోర్టు పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను జూలై 25వ తేదీకి వాయిదా వేసింది.

**రేవంత్ రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన ఒక పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైనకేసును కొట్టివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం గోపన్‌పల్లిలోని వివాదాస్పదభూమిలో ఉన్నసొసైటీ గదిని జేసీబీతో కూల్చివేశారని, కులంపేరుతో దూషించారని రేవంత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మణ్‌పై పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదుచేశారు. ఈకేసును కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్‌వేశారు. దీనిపై పెద్దిరాజుకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది.

# బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భద్రతా సమీక్ష జరిపేంత వరకూ బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానాలను తాత్కాలికంగా నిలిపివేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందు కోసం భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. అహ్మదాబాద్ దుర్ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నందున అది పూర్తి కాగానే 7878 విమాన సేవలు కొనసాగించాలా, వద్దా? అనే దానిపై కేంద్రం ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ 7878 విమానం కుప్పకూలిన ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికుల్లో 241 మంది మృతిచెందగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటలకు టేకాఫ్ అయిన వెంటనే అనూహ్యంగా బీజే మెడికల్‌కాలేజీ డాక్టర్ల రెజిడెన్షియల్ క్వార్టర్డ్‌లోకి విమానం దూసుకుపోయింది. ఆ తర్వాత మంటల్లో చిక్కుకుంది. ఇంజన్లలో ముందుకు లాగే శక్తి కోల్పోవడం, పక్షి ఢీకొనడం వంటివి విమానం కూలి పోవడానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానం అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థలు కలిగి ఉండి ఇంధనాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకుంటుందనే పేరుంది. 2011 అక్టోబర్‌లో ఈ డ్రైమ్‌లైనర్ సేవలు మొదలైనప్పటి నుంచి గత 14 ఏళ్లలో 100 కోట్ల మంది ప్రయాణికులను సురక్షితంగా చేరవేసిందని, ఏవియేషన్ చరిత్రలో ఏ డ్రీమ్‌లైనర్ కూడా ఇంత వేగంగా రికార్డు సాధించలేదని బోయింగ్ వెబ్‌సైట్ చెబుతోంది. ఈ మోడల్ ప్రవేశపెట్టినప్పటి నుంచి 2,500 వరకూ 787 ల అమ్మకాలను బోయింగ్ జరుపగా, ఎయిర్ ఇండియా 47 విమానాలను కొనుగోలుచేసింది. కాగా, అహ్మదాబాద్‌లో విమానంకుప్పకూలిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశించినట్టు పౌరవిమానయానమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడి

>> ముందుజాగ్రత్త చర్యగా తమ గగనతలాన్ని మూసివేసింది. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను నిలిపివేసింది. అటు టెహ్రాన్‌లో అత్యయిక స్థితిని ప్రకటించారు.

తాజా పరిణమాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ స్పందించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ దాడులు ప్రారంభించినట్లు తెలిపారు. 'ప్రతిచర్యకు మరో సందర్భం కోసం మేం ఎదురుచూడలేం. ఇక సమయం వచ్చింది. మాకు మరో అవకాశం లేకుండా పోయింది. మమ్మల్ని నాశనం చేయాలనుకునే వారి ముందు మేం తలవంచే ప్రసక్తే లేదు. మా అస్థిత్వాన్ని రక్షించుకునేందుకు పోరాడుతూనే ఉంటాం' అని జమీర్ స్పష్టం చేశారు.

ఇజ్రాయెల్ శుక్రవారం తెల్లవారుజామున చేసిన దాడులతో ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరీ కూడా ఈ దాడిలో మృతి చెందినట్లు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ప్రకటించింది. దీనిని ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్ఎన్ఎన్ ధ్రువీకరించింది. ఇక ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటికే ఇరాన్ టాప్ అణుశాస్త్రవేత్తలు కూడా మరణించారు. వీరితోపాటు సైన్యంలోని సీనియర్ జనరల్స్ కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐఆర్‌జిసి చీఫ్ హొస్సేన్ సలామీ కూడా ప్రాణాలు కోల్పోయారు. బాఘేరీ టెహ్రాన్‌లో జన్మించారు. ఆయన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌లో చాలాకాలం పని చేశారు. 2016లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.

# ట్యాపింగ్ పాపం ప్రభాకర్‌రావుదే!

>> వీరి అరెస్టు సమయంలోనే ప్రభాకర్ రావును భారత్‌కు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. చివరకు పోలీసుల ప్రయత్నాలు ఫలించి ప్రభాకర్ రావు అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల విచారణకు హాజరవుతున్న తరువాత ఆయన వెల్లడించిన సమాచారాన్ని రూఢీ చేసుకునేందుకు అప్పట్లో ఎస్ఐబి డిఎస్‌పిగా వున్న ప్రణీత్ రావును తాజాగా విచారణకు పిలిచారు. ఫోన్ ట్యాపింగ్ అంతా నాటి ఎస్ఐబి బాస్‌గా వున్న ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగిందని ప్రణీత్ రావుతో పాటు మిగతా నిందితులు వెల్లడించగా ఇదంతా అబద్ధం తాను ఎ వరికీ ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేదు...ఒకవేళ ఏమైనా ఆధారాలు వుంటే చూపమనండి.. అని ప్రభాకర్ రావు సిట్ అధికారులను ఎదురు ప్రశ్నించడం తెలిసిందే. ఇదే సమయంలో ఏమైనా ఫోన్ ట్యాపింగ్ జరిగివుంటేపై అధికారుల ఆదేశాలు.. సూచనల మేరకే జరిగాయని, ఇందులో తాను సొంతంగా చేసిందేమి లేదని ప్రభాకర్ రావు చెప్పడంతో ఇందులోని నిజానిజాలను బయటకు తీసేందుకు శుక్రవారం నాడు ప్రణీత్‌రావును సిట్ అధికారులు విచారించారు. అప్పట్లో ఫోన్ ట్యా పింగ్‌కు సంబంధించిన కంప్యూటర్లను, హార్డ్ డిస్క్‌లను ప్రణీత్ రావు ధ్వంసం చేయడం, వీటిని మూసీ నదిలో పడవేయడం తెలిసిందే. రాష్ట్రంలో బిఆర్ఎస్ సర్కారు అధికారం కోల్పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మూడు రోజులకు బేగంపేట్‌లోని ఎస్ఐబి కార్యాలయంలో ఈ డ్రామా జరిగింది. ఈ సమయంలో ఎస్ఐబి కార్యాలయంలో సిసి టివిలను ఆఫ్ చేయడంతో పాటు కార్యాలయంలో పనిచేసే సిబ్బంది అనేక మందిని ముందుగానే ఇళ్లకు పంపించి వేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా ఈ కేసులో ప్రణీత్ రావును అరెస్టు చేసి విచారించిన తరువాత ధ్వంసమైన హార్డ్ డిస్క్‌లలో కొన్నింటిని మూసీనది నుంచి వెలికితీసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. కాగా నాటి ఘటనలపై సిట్ అధికారులు ప్రణీత్ రావును మరోసారి విచారించినట్లు తెలిసింది. దీంతో పాటు ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావుతో వున్న సంబంధాలపైనా సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లో తనకు సంబంధంలేదని ప్రభాకర్ రావు వె ల్లడించిన విషయాన్ని సిట్ అధికారులు ప్రణీత్ రావుతో ప్రస్తావించగా ఇదంతా అబద్ధమని ఆయన ఆదేశాల మేరకే అప్పట్లో తనతో పాటు ఇతర సిబ్బంది పని చేశారని చెప్పినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ యూనిట్ అంతా ప్రభాకర్ రావు అజమాయిషీలో ఆయన ఆదేశాల మేరకే పనిచేసేదని, తామంతా నిమిత్తమాత్రు లమని ప్రణీత్ రావు సిట్ అధికారులకు చెప్పారని తెలిసింది. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో ఈ విచారణ జరిగింది.

**నేడు సిట్ విచారణకు హాజరుకానున్న ప్రభాకర్ రావు**

కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావును సిట్ అధికారులు శనివారం నాడు విచారించనున్నారు. ఇప్పటికే రెండుసార్లు ఆయనను విచారించడం తెలిసిందే. మూడవసారి శనివారం నాడు ఆయనను విచారించనున్నారు. తాజా విచారణలో ప్రణీత్ రావుతో కలిపి ప్రభాకర్ రావును విచారించే వీ లుందని సమాచారం. ఇద్దరు అధికారులను ఎదురెదురుగా వుంచి ఫోన్ ట్యాపింగ్‌పై విచారించాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్ రావును మొదటిసారి ఎనిమిది గంటలు, రెండవసారి తొమ్మిది గంటల పాటు విచారించడం తెలిసిందే. శనివారం నాడు కూడా సుదీర్ఘంగా విచారించే వీలుంది.

# నేడు నీట్-2025 ఫలితాలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబిబిఎస్‌తోపాటు బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2025 యూజీ కోర్సు పరీక్ష ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. నీట్ పరీక్షకు దేశ వ్యాప్తంగా సుమారు 22.7 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా ..వారిలో 22 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. నీట్ పరీక్షల కోసం 5453 కేంద్రాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి 72,507 మంది దరఖాస్తు చేసుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రం గత యేడాదికంటే కష్టంగా ఉన్నట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు, విద్యారంగ నిపుణులు చెప్పారు. గతయేడాదికంటే ఈయేడాది కటాఫ్ మార్కులు తగ్గేఅవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# బ్లాక్ బాక్స్

>> ఇప్పటి వరకూ తెలియరాలేదు. దీనిపై అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు బ్లాక్ బాక్స్ లభ్యం కావడంతో ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు తెలిసే అవకాశం ఉంది. విమాన ప్రమాదాల్లో బ్లాక్ బాక్స్ కీలకం అవుతుంది. ఇది ఆరెంజ్ కలర్‌లో ఉంటుంది. విమానం, హెలికాప్టర్ల ప్రమాదం జరిగేకంటే కనీసం రెండు గంటల ముందు ఏం జరిగిందన్న వివరాలను ఈ బ్లాక్‌బాక్స్ స్టోర్ చేసుకుంటుంది. విమానాలు క్రాష్ అయినా ఇందులోని సమాచారం తొలగిపోదు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు.

# గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 171 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మందితో పాటు, విమానంకూలిన ప్రదేశంలోని నివాస భవనాల్లో ఉన్న ఐదుగురు పౌరులుకూడా మరణించారు. ఈ విషాద ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. భారత్‌కు ఈ క్లిష్ట సమయంలో అండగా నిలుస్తామని, అవసరమైన సహాయం అందించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.విమాన శకలాలు, కాలిపోయిన వస్తువులు ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇప్పటికే జిజె వైద్యకళాశాల హాస్టల్‌భవనంపై పడటంతో సీనియర్‌డాక్టర్లు, రెసిడెంట్ డాక్టర్లు పలువురు మృతిచెందారు. ముందురోజు 20 మందికి పైగా మృతిచెందగా శుక్రవారం తాజాగా మరో ఐదుగురు మృతిచెందారని అధికారులు ధృవీకరించారు.

## వారం - వర్జ్యం

తేది : 14-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
తదియ మ.3.44
ఉత్తరాషాఢ రా.12.20
వర్జ్యం తె.4.26-7.15
దు.ఆ.5.35-7.15
శుభసమయం :ఉ.5.15-5.45
రాహుకాలం - ఉ.9.00-10.30

## వారాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావనవుంటుంది.

**వృషభం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు పొందుతారు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** కళా, రాజకీయ రంగాల వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**కన్య :** దీర్ఘకాలిక కోర్టుకేసుల నుండి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖులతో ముఖ్య విషయాలపై ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. అనుకోని విధంగా డబ్బు చేతికందుతుంది.

**వృశ్చికం:** సోదరుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు నిదానంగా ఫలిస్తాయి.


**ధనుస్సు:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. రుణవత్తిడులు తొలుగుతాయి.

**మకరం:** ఆర్థికపరమైన ఇబ్బందులు తొలుగుతాయి. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశం మీ చెంతకువస్తుంది.

**కుంభం:** అన్ని పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగుతాయి.

**మీనం :** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురై చికాకులు పెడతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో దెబ్బతిన్న మెడికోల హాస్టల్ క్యాంటిన్

# ఛార్జీలు భారీగా పెంపు?

>> లేవని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం ప్రతిపాదించిన పెంపుదల శాతం వివరాల్లోకి వెళ్తే.. అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్స్.. వీటిపై 30 శాతం వరకు మార్కెట్ ధరలు పెంచే అవకాశం ఉంది. ఓపెన్ ప్లాట్స్ (ఖాళీ స్థలాలు).. వీటిపై వంద శాతం లేదా అంతకంటే ఎక్కువ శాతం పెంపుదల ఉండవచ్చని తెలుస్తోంది. అయితే.. ఈ పెంపుదల మార్కెట్ విలువల మార్గదర్శకాలకు అనుగుణంగా, వాస్తవ మార్కెట్ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉండేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇది కేవలం ఆదాయ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవడం కాకుండా.. భూముల అక్రమ లావాదేవీలను తగ్గించడం, బ్లాక్ మనీ చలామణిని నియంత్రించడం వంటి లక్ష్యాలను కూడా కలిగి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ ధరల పెంపుదల కొనుగోలుదారులు, అమ్మకందారులు, రియల్ ఎస్టేట్ రంగంపై పలు రకాలుగా ప్రభావం చూపుతుంది. ఆస్తి కొనుగోలువ్యయం.. దానిపై చెల్లించాల్సి న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు గణనీయంగా పెరుగుతాయి. ఇది ఇల్లు లేదా స్థలం కొనుగోలు చేయాలనుకునే సామాన్యుల కలలను మరింత కష్టతరం చేయవచ్చు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలకు, గృహ రుణం ద్వారా ఇల్లు కొనుగోలు చేసే వారికి నెలవారీ నిఈఐ మరింత పెరుగుతుంది. ధరల పెంపు తాత్కాలికంగా కొనుగోళ్లను తగ్గించవచ్చు.. డిమాండ్‌ను ప్రభావితం చేయవచ్చు. డెవలపర్లు తమ ప్రాజెక్టుల ధరలను సర్దుబాటు చేయాల్సి రావచ్చు.. ఇది కొత్త ప్రాజెక్టుల ప్రారంభంపై ప్రభావం చూపుతుంది. అయితే, దీర్ఘకాలంలో ఇది రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకురావచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు.

అంతే కాకుండా.. ఈ పెంపుదల ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుంది. ఈ నిధులను రాష్ట్రంలోని సంక్షేమ పథకాల అమలుకు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. గతంలో కూడా రిజిస్ట్రేషన్ ధరలు పెంచినప్పటికీ.. ప్రస్తుత పెంపుదల శాతం (ముఖ్యంగా ఓపెన్ ప్లాట్స్) చాలా ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేసేటప్పుడు.. మార్కెట్ పరిస్థితులను, కొనుగోలుదారుల ఆర్థిక స్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని రియల్ ఎస్టేట్ నిపుణులు, పౌర సంఘాలు కోరుతున్నాయి. పెంపుదల సానుకూలంగా ఉంటే.. ఇది మార్కెట్‌కు పారదర్శకతను తెస్తుంది. అయితే.. ఇది మార్కెట్‌లో మందగమనాన్ని సృష్టించకుండా చూసుకోవడం ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలు మారుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ప్రమాదస్థలంలో చెక్కుచెదరని 'భగవద్గీత' పుస్తకం లభ్యం!



**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లో ఏవియేషన్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా జరిగిన బోయింగ్ ప్రమాదంలో మొత్తం భస్మీపటలం అయినప్పటికీ ఆ ప్రమాద స్థలంలో ఒక భగవద్గీత పుస్తకం మాత్రం చెక్కుచెదర కుండా నిలిచింది. ఈ పవిత్ర గ్రంథం చెక్కు చెదరకుండా ఉండడం, లోపలి పేజీలుకూడా కాలిపోకుండా సురక్షితంగా నిలవడంపై అందరూ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విస్తృతంగా ఈ దృశ్యం వైరల్ అవుతోంది. ప్రమాదస్థలంలో గాలిస్తున్న సిబ్బంది ఒకరు గీత పుస్తకం పేజీలను తిప్పి చూపిస్తున్నారు. ఈసంఘటన గీత సందేశం యొక్క శాశ్వత పవిత్రతను సూచిస్తున్నదని, కష్టసమయాల్లో అర్థంచేసుకునేందుకు కష్టాల్లో ఉన్న వారు గీత పారాయణం చేస్తారని నెటిజన్లు విస్తృతంగా స్పందించారు. హిందూ తత్వశాస్త్రంలో భగవద్గీతకు కేంద్రస్థానం ఉంది. విధి నైతికత జీవితం మరణం యొక్క స్వభావంపై ప్రతిబింబాలను అందిస్తుంది. ప్రమాదం సందర్భంలో కొంతమంది ఈ పుస్తకాన్ని చదువుకుని ఉంటారని తెలుస్తోంది. ఈవిడియో ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌పై షేర్‌చేసిన కొన్నినిమిషాలకే 5.77 లక్షలమంది చూసారు.

# 'సాగర్'పై ముదిరిన కలహాం

>> రాసిన లేఖతో వెల్లడైనది.తెలంగాణ వైపు సిఆర్పీఎఫ్ బలగాలు డ్యాం భద్రతను ఉపసంహరించుకొని ఏప్రిల్‌లో వెనక్కు వెళ్లిపోయాయి. ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణాయాజమాన్య బోర్డు సమక్షంలో గతంలో జరిగిన సమావేశంలో బలగాల ఉపసంహరణ చేయాలని ఒ అండ్ ఎంకు ఇబ్బంది కలుగుతోందని ఫిర్యాదు చేశాయి. ఎపి వైపు ఉన్న సిఆర్పీఎఫ్ బలగాలు జూన్ నెలాఖరులోగా ఉపసంహరణ చేయనున్నారు. వాస్తవంగా సిఆర్పీఎఫ్ బలగాలు వెళ్లిపోగానే సాగర్ డ్యాం మొత్తం తెలంగాణకు చెందిన ప్రత్యేక రక్షణ దళం పర్యవేక్షణలోకి పోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఎన్ఎస్‌పి కుడివైపు ఆనకట్టపై తన ఆదిపత్యం నిలుపుకోవాలని ఆరాటపడుతోన్నది. ఇదే అంశంపై మళ్లీ ఇరు రాష్ట్రాలు గొడవపడే అవకాశం ఉంది. నాగార్జునసాగర్ నుంచి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన వాటానీటికంటే అత్యధికంగా నీటిని తరలించుకుని పోయిందని తెలంగాణ ఆరోపిస్తున్నది. నాగార్జునసాగర్ నుంచి బేసిన్ బయటకు నీటిని తరలిస్తున్నారని బేసిన్‌లో ఉన్న తెలంగాణకు సాగు,తాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని పలు పర్యాయాలు తెలంగాణ ఆరోపణలు చేస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా తమకు కేటాయించిన నీటి వాటా కంటే కూడా తక్కువ నీటిని వాడుకొన్నామని దుర్భిక్షపరిస్థితులు ఎదురైతే ఆవాటాతో కలిపి ఎక్కువ నీటిని వాడుకోవడానికి అవకాశం కల్పించాలని తెలంగాణ డిమాండ్ చేస్తోన్నది.

# హైస్కూలు స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ

>> అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్ కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం అన్నారు. సిఎం వద్ద జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణా ఆధిత్య, కళాశాల విద్య,సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# కెటిఆర్‌కు మళ్లీ ఎసిబి నోటీసులు

>> ఎసిబి అధికారులు శుక్రవారం నాడు కెటిఆర్‌కు నోటీసులు జారీ చేశారు. కాగా ఈ కేసులో గత జనవరి తొమ్మిదవ తేదీన ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ఒకసారి విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఫార్ములా ఈ కార్ రేసు కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఎ1గా కెటిఆర్, ఎ2గా సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఎ3గా హెచ్ఎండిఎ మాజీ ఇంజనీర్ బిఎల్ఎన్ రెడ్డిల పేర్లు వున్నాయి. ఇదే కేసులో ఈ ఏడాది జనవరి ఎని మిదవ తేదీన అర్వింద్ కుమార్‌ను మరుసటి రోజున కెటిఆర్‌ను ఈ నెల తొమ్మిదవ తేదీన బిఎల్ఎన్ రెడ్డిని జనవరి 18వ తేదీన గ్రీన్ కో ఏఎస్ నెక్స్ జెన్ ఎండి చలమశెట్టి అనిల్ కుమార్‌తో పాటు ఆ సంస్థ ప్రతినిధులను, సీఈఓను ఎసిబి విచారించింది. ఇందులో అనిల్ కుమార్ ఆ సంస్థ ప్రతినిధులు లండన్‌లో వుండగా వర్చువల్ పద్దతిలో విచారించారు. ఈ కేసులో మొదటి దఫా విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా కెటిఆర్‌ను మరోదఫా విచారించేందుకు ఎసిబి నిర్ణయించినట్లుతెలిసింది. ఈ కేసులో గతంలో కొందరిని క్రాస్ వెరిఫికేషన్ కూడా చేయడం ద్వారా ఎసిబి కొంత సమాచారం సేకరించింది. గతంలో కెటి ఆర్ ఇచ్చిన వాంగ్మూలంలోని కొన్ని అంశాలను మిగతావారు తోసిపుచ్చినట్లుగా సమాచారం. ఇప్పుడు వీటి ఆధారంగా కెటిఆర్‌ను ఎసిబి విచారించనుంది. కెటి ఆర్‌ను విచారించిన తరువాత ఇతర నిందితులను కూడా ఇంకోసారి విచారించి కేసు దర్యాప్తును ముగించాలని ఎసిబి భావిస్తున్నట్లుగా సమాచారం. దీని తరువాత కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసే వీలుంది.

## దమ్ముంటే లై డిటెక్టర్ టెస్టుకు రా: సిఎంకు కెటిఆర్ సవాల్

### ప్రభుత్వం నడపలేక ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ఫార్ములాఈ కేసులో తనకు ఏసీబీ నుంచి నోటీసులు అందాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దమ్ముంటే ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షకు హాజరవుదామని సవాల్ విసిరారు. ప్రభుత్వం నడపడం చేతకాక, ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ సర్కస్‌లు చేస్తోందని ఆయన ఆరోపించారు.

ఫార్ములాఈ కేసులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనను ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో రూ. 44 కోట్లు బ్యాంకు నుంచి బ్యాంకుకు బదిలీ అయ్యాయని, ఆ మొత్తం ఫార్ములాఈ సంస్థ ఖాతాలోనే భద్రంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

చట్టాన్ని గౌరవించే పౌరుడిగా తాను సోమవారం ఏసీబీ అధికారుల ముందు హాజరై, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల క్రితం నల్ల సంచి నిండా డబ్బులతో దొరికిపోయిన వ్యక్తి ఎవరో ఎవరైనా గుర్తు చేయగలరా?" అంటూ పరోక్షంగా ఓటుకు నోటు కేసును ప్రస్తావించారు. "మిస్టర్ రేవంత్ రెడ్డి, మనమిద్దరం ఏసీబీ దర్యాప్తును ఎదుర్కొంటున్నాం కదా. అలాంటప్పుడు ఒక న్యాయమూర్తి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష తీసుకుందాం. దానిని టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేద్దాం. తెలంగాణ ప్రజలే ఎవరు దోషో నిర్ణయిస్తారు.

నాతో పాటు ఈ పరీక్షకు వచ్చే ధైర్యం మీకుందా?" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రతిరోజూ చెబుతున్న మీరు, పదేపదే విచారణలు, ప్రచారాలతో ప్రజాధనాన్ని ఎందుకు వృథా చేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ప్రభుత్వం నడపడం చేతకాకపోతే, ప్రజలను సర్కస్‌లు, ఇతర పరధ్యానాలతో బిజీగా ఉంచుతారు! కాంగ్రెస్, వారి ముఖ్యమంత్రి చేసే విన్యాసాలు మమ్మల్ని నిరోధించలేవు" అని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ఫార్ములాఈ కారు రేస్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా హైదరాబాద్ కీర్తిని పెంచే ప్రయత్నం చేస్తే, దానిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిధులన్నీ పక్కాగా ఖాతాలోనే ఉన్నప్పుడు, ఈ విచారణల పేరిట రాద్ధాంతం ఎందుకని ఆయన నిలదీశారు.

## ఎఐజి ఆస్పత్రిలో మాజీ సిఎం కెసిఆర్‌కు వైద్యపరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శుక్రవారం గచ్చిబౌలిలో ఉన్న ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ ఆరోగ్య తనిఖీల్లో భాగంగా ఆయన ఆస్పత్రికి వెళ్లారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు కొన్ని వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల కోసం ఆయన మధ్యాహ్నం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆయన తిరిగి ఎర్రవెల్లికి వెళ్లిపోయారు.

## బోయింగ్ లోపాలు ఎత్తిచూపిన మాజీ ఉద్యోగి అనుమానాస్పద మృతి

**సౌత్‌కరోలినా, (యుఎస్), జూన్ 13:** అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కొద్దినిమిషాలకే కుప్పకూలిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానంలో ఉన్న లోపాలను గతంలోనే ఆ సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసిన ఉద్యోగి జాన్ బార్నెట్ వెలికితీసారు. ఆయన బోయింగ్‌పై తీవ్ర ఆరోపణలు కూడా చేసారు. అయితే తర్వాత 2024లో సౌత్ కరోలినా చార్లెస్టర్‌కౌంటీలోని తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలోమృతిచెందారు. 62 ఏళ్ల బార్నెట్ అనారోగ్య కారణాలతో 2017లో రిటైర్ అయ్యారు.బోయింగ్ సంస్థలో



30 ఏళ్లకుపైగా పనిచేసారు. బోయింగ్‌పై ఆరోపణలుచేయడంతోపాటు చట్టపరమైన చర్యలు కూడాప్రారంభించారు. 2010నుంచి 787 డ్రీమ్‌లైనర్‌ను తయారుచేస్తున్న నార్త్ చార్లెస్టన్‌ప్లాంట్‌లో క్వాలిటీమేనేజర్‌గాపనిచేసిన ఆయన బోయింగ్‌పై 2019లోనే బిబిసి ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఫ్యాక్టరీలో సరిగాలేని లోపాలున్న భాగాలను ఉద్దేశ్యపూర్వకంగా విమానాలో అమర్చారన్నారు. ఆక్సిజన్ వ్యవస్థలోని కొన్ని తీవ్రమైన సమస్యలున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో ప్రతి నాలుగు ఆక్సిజన్‌మాస్కుల్లో ఒకటి పనిచేయదన్నారు. బోయింగ్ అత్యాధుఇనక 787 డ్రీమ్‌లైనర్ క్యాబిన్ డికంప్రెషన్ సమయంలో ప్రయాణీకులు మాస్కులు లేకుండా ఉండవచ్చున్నారు. ఆక్సిజన్ వ్యవస్థల్లో తప్పులున్నాయని, అవసర సమయాల్లో పనిచేయకపోవచ్చని బార్నెట్ అన్నారు. ఆక్సిజన్ వ్యవస్థలపై పరీక్షల్లో డ్రీమ్‌లైనర్ 25శాతం వైఫల్యం చూపించిందన్నారు. కర్మాగారంలో వివిధ భాగాలు ట్రాక్‌చేయడంలో వైఫల్యం ఉందని ఉత్పత్తి లైన్‌లో జాప్యం నివారించే హడావిడిలో స్క్రాప్‌బిన్‌లనుంచి తక్కువ ప్రామాణిక భాగాలను ఉపయోగించిందని వాటిని విమానాలకు అమర్చారని, నిర్వాహకులకు తెలిపినా చర్యలు తీసుకోలేదని ఆనాడేచెప్పారు. 2017లో యుఎస్ రెగ్యులేటర్, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ బార్నెట్ ఆరోపణలను సమర్థించింది. అయితే బోయింగ్ మాత్రం ఖండించింది. 2024 మార్చి9న దక్షిణ కరోలినాలోని చార్లెస్టన్‌లోని ఒక హోటల్ వెలుపల తన పికప్‌ట్రక్కులో బార్నెట్ శవమై కనిపించాడు. బోయింగ్‌పైకేసులో తన సాక్ష్యం చెప్పేందుకు సిద్ధం అవుతున్నపుడు మరణించాడు. పోలీసుల విచారణలో తలపై తుపాకీ గాయం ఉందని, ఆతడి కుడిచేతిలో ఒక హ్యాండ్‌గన్ ఉందని, ఇది ఆత్మత్య అని ఫోరెన్సిక్ ఆధారాలు నిర్ణయించాయని చేతితో రాసిన నోట్ ఉందని అందులోనేను ఇకపై ఇలా చేయలేను. ఫక్ బోయింగ్ బోయింగ్‌మూల్యం చెల్లించాలని నేను ప్రార్థిస్తున్నానని రాసి ఉంది.

## ఎయిరిండియా బోయింగ్‌ల తనిఖీలు పెంచాలి: డిజిసిఎ




**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787/8/9 డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతా తనిఖీని పెంచాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఆదేశించింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా నిర్వహించే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లోని పలు వ్యవస్థలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, టేకాఫ్ నిబంధనలను సమీక్షించాలని సూచించింది. క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, అనుబంధ వ్యవస్థల తనిఖీ, ఎలక్ట్రానిక్ ఇంజిన్ కంట్రోల్ సిస్టమ్ టెస్ట్, ఇంజిన్ ఇంధనంతో నడిచే యాక్చుయేటర్,ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్ తనిఖీలను చేపట్టాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది.ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల న్నింటినీ పరిశీలించాలని సూచించింది. కాగా, గుజరాత్‌లోని అహ్మదా బాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రమాదంలో అందులోని ప్రయాణికులు, సిబ్బందితో సహా 241 మంది మరణించారు. ఈ నేపథ్యంలో బోయింగ్ డ్రీమ్ లైనర్ 7878 విమానాల గ్రౌండింగ్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. పాత కాలం నాటి బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878/9 విమా నాలను నిలిపివేసే విషయంలో భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య చర్చలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. అయితే ఎయిర్ ఇండియా విమానాల నిర్వహణ, ఆపరేటింగ్ విధానాలను కూడా లోతుగా పరిశీలించిన తర్వాతే బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878 విమానాల గ్రౌండింగ్‌పై తుది నిర్ణయం తీసు కునే అవకాశమున్నట్లు వివరించాయి. కొత్త తని ఖీలను సంబంధిత డిజిసిఎ ప్రాంతీయ కార్యాలయాలతో కలిసి నిర్వహించాలని తనిఖీల నివేదికలు కూడా తక్షణమే ఇవ్వాలని డిజిసిఎ ఆదేశాలు జారీచేసింది.

## ప్రేమ విఫలమైందంటూ పంట పొలాల్లో చిందులు వేసిన యువతి

### ఆమెతో సహా అక్కడున్న వారిని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** తప్పతాగిన స్థితిలో కృష్ణా జిల్లాలో ఒక యువతి నానా హంగామా చేసింది.తన ప్రేమ విఫలమైందంటూ పంటపొలాల్లో చిందులు వేస్తూ కేకలు వేసింది.అతి ప్రయాస మీద ఆమెను ఒక యువకుడు పోలీసులకు తద్వారా తల్లిదండ్రులకు అప్పగించాడు.పామర్రు నియోజకవర్గానికి చెందిన ఒక యువతి రోజూ స్వగ్రామం నుంచి బస్సులో గుడ్లవల్లేరు వస్తూ అక్కడ ఒక కాలేజీలో చదువుతోంది. నాలుగు రోజుల క్రితం మచిలీపట్నం చిలకలపూడి బీచ్‌లో నిర్వహించిన మసులా ఫెస్టివల్‌కు వెళ్ళింది.ఆమెకు అక్కడ గుడివాడ మండలానికి చెందిన ఒక యువకుడి పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలేజీ ముగిసిన తర్వాత సదరు విద్యార్థిని ఆ యువకుడికి ఫోన్ చేసింది. తన లవ్ బ్రేకప్ అయ్యిందని, బాధగా ఉందని, మందు తాగాలని ఉంది తీసుకు రావాలంటూ అతడిని కోరింది. ఆ యువకుడు మద్యం బాటిల్ తీసుకుని వచ్చాడు. అనంతరం ఇద్దరూ కలిసి అతడి బండిపై గుడ్లవల్లేరు- గుడివాడ మార్గంలో ఉన్న డొంకదారిలోకి వెళ్లారు. రైల్వేట్రాక్ దాటిన తరువాత ఒక పొలం గట్టున కూర్చొని మద్యం తాగారు. ఆ యువతి ఎక్కువగా మద్యం తాగి మత్తులో కూరుకుపోయింది. పొలాల్లో నుంచి లేచి నడవ లేని పరిస్థితికి వచ్చింది. దీంతో ఆ యువకుడు తన స్నేహితులకు సమాచారం ఇచ్చారు. మరో ఇద్దరు యువకులు అక్కడికి వచ్చారు. ఆమె బండిపై కూర్చోలేని స్థితిలో ఉండటంతో, ఇదంతా తనకెందుకని ఒక యువకుడు పారిపోయాడు. దీంతో మిగిలిన ఇద్దరూ ఆమెను తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. అదే సమయంలో గుడ్లవల్లేరుకు చెందిన ఒక యువకుడు అటువైపుగా వెళుతూ వీరిద్దరినీ గమనించి ఆ విద్యార్థినిపై అఘాయిత్యం జరుగుతుందేమోనని భయపడి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అంతే కాకుండా ఫోన్‌లో వీడియో తీస్తుండగా, అతడిని అడ్డుకుని సెల్‌ఫోన్‌ను పడేశారు. పోలీసులు మహిళా హోంగార్డులతో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు.

## త్వరలో మహిళా వర్సిటీ విభజన పూర్తి!

### ఆప్షన్లకు అవకాశం కల్పించిన ఉస్మానియా వర్సిటీ
### ఆ తర్వాత బోధన, బోధనేతర సిబ్బందిపై స్పష్టత
### అనంతరం పూర్తిస్థాయి యూనివర్సిటీగా ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి త్వరలోనే పూర్తిస్థాయి వర్సిటీగా ఏర్పడనుంది. ప్రస్తుతానికి యూని వర్సిటీ కేవలం ఇన్‌ఛార్జ్ ఉపకులపతి(విసి)ని మాత్రమే ప్రభుత్వం నియమించింది. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కోఠి మహిళా కాలేజీని మహిళా విశ్వవిద్యాలయంగా మార్చిన నేపథ్యం లో.. అక్కడ పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బైఫర్‌కేషన్ కావల్సిన పరిస్థితి ఏర్పడింది. పైగా ఈఏడాది 2025-26లో మహిళా యూనివర్సిటీలో యుజి కోర్సులతోపాటు పిజి కోర్సుల్లోనూ అడ్మిషన్లను తీసుకోనున్నారు. ఇప్పటికే దోస్త్2025 ద్వారా డిగ్రీ(యుజి) అడ్మిషన్లను తీసుకుంటున్నారు. ఆగస్టులో నిర్వహించే సిపిగెట్-2025లో భాగంగా పిజి కోర్సుల్లోనూ అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహిళా యూనివర్సిటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న కోఠి మహిళా కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బంది నుంచి ఆప్షన్లను తీసుకుంటున్నట్టు తెలిసింది.

వారితోపాటు ఉస్మా నియా యూనివర్సిటీ పరిధిలోని బోధన, బోధనేతర సిబ్బంది ఎవరైనా మహిళా యూనివర్సిటీలో పనిచేయడానికి సుముఖంగా ఉంటే వారికి కూడా అవకాశం కల్పించేలా ఓయూ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిసింది. మరికొద్ది రోజుల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయాలని ఓయూ అధికారులు భావిస్తున్నారు. ఇది పూర్తయితే మహిళా యూనివర్సిటీకి పూర్తిస్థాయిలో సిబ్బంది ఏర్పాటయ్యే అవకాశం ఉంటుంది. బోధన, బోధనేతర సిబ్బంది ఏర్పాటైతే పూర్తిస్థాయిలో యూనివర్సిటీని ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లోగా పూర్తిస్థాయి యూనివర్సిటీ ఏర్పాటయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

## 'హంస' ఆఫీస్ బేరర్ల ధ్రువపత్రాలు గుర్తించొద్దు

### వైద్య ఆరోగ్య శాఖ ఆదేశం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణ బదిలీల్లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్(హంస) నుంచి ఆఫీస్ బేరర్లుగా పేర్కొంటూ అందచేసిన ధ్రువ పత్రాలను పరిగణనలోకి తీసు కోవద్దని వైద్య ఆరోగ్య శాఖ ఆదేశించింది. ప్రజారోగ్య శాఖ పరిధిలో ఉన్న ఈ సంఘం సభ్యత్వ నమోదు జాబితాలో ఉద్యోగ విరమణ చేసినవారు, పొరుగు సేవల సిబ్బంది, చనిపోయిన వారి పేర్లు ఉన్నాయి. సంస్థాగత ఎన్నికలు,ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో 'హంస' సంఘం గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేసి,లోతుగా విచారణ చేసేందుకు మరో కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మరోవైపు...ఈ సంఘం తరపున ఆఫీస్ బేరర్లుగా ఉన్నామంటూ ప్రజారోగ్య శాఖ ప్రధాన కార్యాలయం,26 జిల్లాల్లో కలిపి 249 మంది బదిలీల్లో భాగంగా అధికారులకు దృవపత్రాలు సమర్పించారు. ఈ బదిలీల వరకు గుర్తించొద్దని జిల్లాలకు ఆదేశాలు పంపినట్లు ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వెల్లడించారు.

## నేటి నుంచి ఇ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రారంభం

### 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించిన టిజి ఈ సెట్-2025 కౌన్సెలింగ్ నేటి(శనివారం) నుంచి ప్రారంభం కానుంది. అర్హత సాధించిన అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 25న సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఈ సెట్-2025లో 93.87 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ సెట్-2025 పరీక్ష మే 12న 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించగా.. ఫలితాలను మే 24న ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలోలో విడుదల చేశారు. ఈసెట్ ఫలితాల్లో 93.87 శాతం ఉత్తీర్ణత సాధించగా.. మెటలార్జికల్ ఇంజినీరింగ్, బీఎస్సీ మ్యాథ్స్, ఫార్మసీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సెట్-2025కి 19,672 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 18,928 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో 17,768 మంది ఉత్తీర్ణత సాధించారు.

## నేటి నుంచి డిఇఇసెట్-2025 క్వాలిఫైడ్ అభ్యర్థులకు వెబ్ఆప్షన్లు

### 20న సీట్ల కేటాయింపు.. 21 నుంచి 24 వరకు ఫీజు చెల్లించాలి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రెండేళ్ల కోర్సు అయిన డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈడి), డిప్లమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యు కేషన్ (డిపిఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన డిఈఈసెట్-2025 సర్టిఫికెట్ వెరిఫికేషన్ శుక్రవారంతో ముగిసింది. నేటి(శనివారం-జూన్ 14) నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 17 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 20న సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు డిఈఈసెట్-2025 కన్వీనర్ జి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 25న డిఈఈ సెట్ పరీక్షను రాష్ట్రంలోని 87 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. డిఈఈ సెట్‌కి 46,615 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 33,821 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షకి హాజరైన వారిలో 26,442 మంది అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 78.18 శాతం మంది అర్హత సాధించారు. 20న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారు ఫీజు చెల్లించడానికి ఈ నెల 21 నుంచి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ నెల 25న సీటు పొందిన వారు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి క్లాసులను ప్రారంభించనున్నారు.

## 25 లోపు రైతు భరోసా : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని రైతులకు ఈ నెల 25లోపు రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. భూ కమతాల ప్రకారం రైతు భరోసా ఇస్తామని అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పది ఎకరాలు లోపు వెసులుబాటు వస్తే రైతు భరోసా ఇస్తామని తెలిపారు. రైతు కూలీలకి కూడా త్వరలోనే ఇస్తామని చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎరువులు కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఎరువుల విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడా నన్నారు. అంతేకాకుండా లేఖ కూడా రాశానని తెలిపారు. యూరియా ఎక్కువగా వాడకూడదని, నేచురల్ ఫామింగ్ తోనే వ్యవసాయం చేయాల న్నారు. తమ తండ్రి హయాంలో పురుగుల మందులు కొట్టలేదని, అయితే రానురాను మార్పులు చోటు చేసుకుని ఇప్పుడు పురుగుల మందులు వాడకం పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో రైతులు వినియోగించే యూరి యాపై లక్షా 70 వేల కోట్ల సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. నకిలీవిత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్ట్ పెడతామని చెప్పారు. అదేవిధంగా పామా యిల్‌కి ఎంజీపీ పాలసీ త్వరలోనే అమలు చేసా _మని తెలిపారు. త్వరలోనే పిఎంను కలుస్తా మన్నారు. ఆరు రకాల వంగడాలను ఈ యేడాది విదేశాలు కొనుగోలు చేశాయని చెప్పారు.

## కృష్ణయ్య! బిసి సంఘాల నాయకుడివా? బిజెపి లీడర్‌వా?

### బిజెపి ఆఫీస్ ముందు ధర్నా చేపట్టాలి : ఈరవత్రి అనిల్

**హైదరాబాద్,జూన్ 13, ప్రభాతవార్త:** గాంధీ భవన్ ముందు ధర్నా చేయడం కాదు,బీజేపీ ఆపిస్ ముందు ధర్నా చేయాలని ఆర్ కృష్ణయ్య బిసి సంఘాల నాయకు డుగా మాట్లాడుతుండా లేక బీజేపీ నాయకుడిగా మాట్లాడుతున్నడో చెప్పాలని మినరల్ డెవలప్మెంట్ కారొనపరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ 74 యేళ్ల నుండి ఇప్పటి వరకు దేశంలో కులగణన చేయలేదని రాహుల్‌గాంధీ ఒత్తిడి తోనే కులగణన జరుగుతోందని ఆయన అన్నారు. బిసిలకోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని విమర్శించడం కృష్ణయ్యకు తగదని అన్నారు. రేవంత్ రెడ్డి 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పించినందుకు కృషిచేస్తుంటే కృష్ణయ్యకు కంటగింపుగా ఉందని ఆవేదన చెందారు. ట్రిపుల్ టెస్ట్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసి కులగణన పై సర్వే చేసిందని అన్నారు.ఆర్ కృష్ణయ్యకు రాజ్య సభ సీటు వస్తే సరిపోద్దా?బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు బిసి బిల్లును తమిళ నాడు తరహాలో 9వ షెడ్యూల్ లో పెట్టమని కేంద్రపై ఆర్ కృష్ణయ్య ఒత్తిడి తేవాలని ఆయన కోరారు. ఆర్ కృష్ణయ్య కు చిత్త శుద్ధి ఉంటే బిల్లు ను9వ షెడ్యూల్ లో పెట్టేవిధంగా బండి సంజయ్, అర విండ్, కిషన్‌రెడ్డిలతో కలిసి మోడీ ని ఒత్తిడి చేయండని అన్నారు.

## రఘువంశీ హత్యకు మూడుసార్లు విఫలయత్నం!





### నాలుగోసారి హత్యచేసి జలపాతంలోకి విసిరేసిన సోనమ్ గ్యాంగ్

**షిల్లాంగ్, జూన్ 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హానీమూన్ హత్య కేసులో రోజుకో షాకింగ్ విషయం వెలుగుచూస్తోంది. తాజాగా, నిందితురాలు సోనమ్, ఆమె నియమించుకున్న హంతకులు భర్త రాజా రఘువంశీని అంత మొందించేందుకు మూడుసార్లు విఫలయత్నం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎస్పీ వివేక్ సియామ్ ఈ వివరాలను స్వయంగా తెలిపారు. నాలు గో ప్రయత్నంలో హంతకులు తమ ప్లాన్‌ను విజయవంతంగా అమలుచేసి రాజా రఘువంశీని దారుణంగా హత్య చేశారని ఆయన తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హంతకులు రాజా రఘువంశీని హత్య చేయడానికి అనేక ప్రణాళికలు రచించారు. తొలిసారిగా గువాహటిలో హత్యచేసి, మృత దేహాన్ని ఎక్కడైనా పడేయాలని పథకం వేశారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ప్లాన్ వాయిదా పడింది. ఆ తర్వాత మేఘాలయలోని సోహ్రా ప్రాంతంలో రెండుసార్లు హత్యకు ప్రయత్నించినా అవి కూడా విఫలమయ్యాయి. మొదట నంగ్రిట్ వద్ద హత్య చేసి, మృతదేహాన్ని పార వేసేందుకు అనువైన ప్రదేశం దొరకకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

అనంతరం మవ్లాఖియట్, వెయిసావ్‌డోంగ్ వద్ద కూడా ప్రయత్నించారు. రఘువంశీ వాష్ రూమ్‌కు వెళ్లినప్పుడు హత్య చేయా లనుకున్నా అది కూడా సాధ్యపడలేదు. చివరకు, వెయిసావ్‌డోంగ్ జలపాతం వద్ద రఘువంశీపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశారని ఎస్పీ వివరించారు. సోనమ్, రఘువంశీల వివాహం మే 11న జరిగింది. వివాహం అనంతరం ఈ జంట గువాహటిలోని కామాఖ్య అమ్మవారి ఆలయంలో పూజలు చేసేం దుకు వెళ్లారు. అయితే, హంతకులు మే 19వ తేదీనే గువాహటి చేరుకుని సిద్ధంగా ఉన్నారు. అక్కడి నుంచి సోనమ్ షిల్లాంగ్, సోహ్రా వెళ్లాలని నిర్ణ యించుకోవడంతో, హంతకులు గువహటిలో తమ ప్రణాళికను రద్దు చేసు కుని, ఆమెను అనుసరించినట్లు ఎస్పీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహిస్తోంది. మే 20న నవదంపతులు హనీమూన్ కోసం మేఘాలయకు వెళ్లారు. ఆ తర్వాత వారు కనిపించకుండా పోయారు. రఘువంశీ అదృశ్యమైన 11 రోజుల తర్వాత, సోహ్రాలోని జలపాతం సమీపంలో ఒక లోతైన లోయలో ఆయన మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఆయన శరీరంపై కత్తిపోట్లు ఉండటంతో పోలీసులు దీనిని హత్యగా నిర్ధారించారు.

## ఆయిల్ ఫెడ్ ఎండిపై వేటు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఎండిపై బదిలీ వేటు వేస్తూ రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎండిగా పనిచేస్తున్న యాస్మిన్‌భాషాను ఆ బాధ్యతల నుండి తప్పించింది. ఆమె స్థానం లో కొత్తగా శంకరయ్యకు అవకాశం కల్పించింది. కాగా ఆయిల్ ఫెడ్ నిర్వహణపై పలు విమర్శలు ఉన్నాయి. సంస్థ పనితీరు సక్రమం గా లేదనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పలువురు అక్ర మాలకు పాల్పడుతున్నారనే ఆరో పణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఇటీవల ఆయిల్‌ఫెడ్ కార్యాలయాన్ని అకస్మి కంగా సందర్శించడం విశేషం.

## నాన్‌దోస్త్ ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఫీజులపై ఒయు ఆరా!

### వివరాలు ఇవ్వాలని కోరిన వర్సిటీ ఆడిట్ విభాగం
### ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో లేఖలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థలు తమ ఇష్టానుసారం ఫీజులను వసూలు చేస్తున్నాయనే విమర్శలున్నాయి. ప్రైవేటు స్కూల్స్ నుంచి డిగ్రీ కాలేజీల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో పీజులు లక్షల్లో ఉంటుంది. కొన్ని ప్రైవేటు స్కూల్స్, రెసిడెన్షియల్ విధానంలో కొనసాగే స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో కూడా ఇదే విధంగా లక్షల్లోన ఫీజులను వసూలు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు యూనివర్సిటీ వారీగా కోర్సుల వారీగా ఫీజులను ఇప్పటికే నిర్ణయించి ఉన్నారు. కానీ స్కూల్స్, జూనియర్ కాలేజీలకు అలా ఫీజులను నిర్ణయించక పోవడంతో వారు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. డిగ్రీ కాలేజీల్లో కూడా నాన్ దోస్త్ కాలేజీలు కొన్ని కొనసాగు తున్నా యి. అంటే రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం 2016 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) పేరుతో అడ్మిషన్లను ఆన్‌లైన్‌లోనే చేపడు తున్నారు. యూనివర్సిటీ వారీగా, కోర్సుల వారీగా ఫీజులను నిర్ణయించిన నేపథ్యంలో ఏ ప్రైవేటు కాలేజీలో సీటు వచ్చినా.. యూనివర్సిటీ నిర్ణయించిన ఫీజునే విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలు యూనివర్సిటీలు నిర్ణయించిన ఫీజులను వ్యతిరేకించి తాము దోస్త్ పరిధిలోకి రాబోమని చెప్పి.. తామే స్వతంత్రంగా అడ్మిషన్లను చేపడుతున్నాయి. వాటిలోన ఫీజులు ఎంత వసూలు చేస్తున్నాయనేది మాత్రం ఇటు ప్రభుత్వానికిగానీ, అటు యూనివర్సిటీకి గానీ తెలియని పరిస్థితి. పైగా ఒక్కో కాలేజీలో ఒక్కో కోర్సుకి ఒక్కోరంగా ఫీజులను వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు విద్యా ర్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉస్మానియా యూని వర్సిటీ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నాన్ దోస్త్‌లోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వాల్సిన ఉస్మానియా యూనివర్సిటీ తనిఖీలు నిర్వహిం చింది. తనిఖీలు నిర్వహించిన అనంతరం యూని వర్సిటీ అడిట్ డైరెక్టర్ ఫీజుల వివరాలను ఇవ్వాలని పేర్కొంటూ లేఖలు రాశారు. రెండు, మూడు రోజుల్లో వివరాలను ఇవ్వాలని లేఖల్లో పేర్కొన్నట్టు తెలుస్తోంది. కాలేజీలు అందించే వివరాలను పరిశీలించిన అనంతరం యూనివర్సిటీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

## చర్లపల్లి-తిరుపతి మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు జూలై వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే,జూన్ 13,ప్రభాతవార్త** సీమాంధ్ర మీదుగా చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య రెండు వేర్వేరు మార్గాలలో తిరుగుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణీకుల సౌకర్యార్థం జూలై ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07251ఎక్స్‌ప్రెస్‌ను జూలై 2నుంచి 30వరకు పొడిగించగా, తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07252ఎక్స్‌ప్రెస్‌ను జూలై 3నుంచి 31వరకు పొడిగించారు. ఈ రైళ్లు ఖాజీపేట,విజయవాడ,గూడూరు, రేణిగుంట మీదుగా తిరుగుతాయి. అలాగే ప్రతి శుక్ర,ఆదివారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07017ఎక్స్‌ప్రెస్ జూలై 4నుంచి 27వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి సోమ,శనివారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07018ఎక్స్‌ప్రెస్‌ను జూలై 5నుంచి 28వరకు వరకు పొడిగించారు. ఈ సర్వీసులు కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు,డోన్,గుత్తి,కడప,రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

వార్త

ప్రకృతి అంతా త్యాగంతో, ప్రేమతో మనల్ని సేవిస్తుండగా, మనం ప్రకృతి పట్ల, సాటి ప్రాణుల పట్ల, ఎలా ఉంటున్నామో ఆలోచించాలి.

-ఎమ్. షాగిన్యాన్

# మాటలకందని విషాదం

విమానయాన చరిత్రలోనే అత్యంత విషాదకరమైన దుర్ఘటనను తలచుకుంటేనే మనసును కలచివేస్తుంది. ఇంతటి విషాదాన్ని మునుపెన్నడూ మన దేశం ఎరుగదు. విమాన ప్రమాదానికి కారణాలేవైనా, కారణాలెన్నున్నా, దర్యాప్తుకు వీలైన అన్ని కోణాలు సాంకేతిక లోపమేనని ధృవీకరిస్తోంది. ఎన్నో విమానాలు నడిపి దాదాపు 8200కిలోమీటర్లు ప్రయాణించిన పైలెట్ సైతం ప్రమాదాన్ని తప్పించలేని పరిస్థితిలో అశువులు బాసాడు. విధి లిఖితం కాకపోతే మరేమిటి!? విమానంలో ఎంతో ఉత్సాహంతో విదేశంలో పని ముగించుకుని తమ గమ్యస్థానాలకు చేరుకుంటామని ఎదురు చూసే విదేశీ ప్రయాణికులకు మృత్యువు ఎదురొచ్చింది. స్వదేశం నుంచి విదేశాల్లో ఉన్న కుమార్తెను చూసి రావాలనుకున్న గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ రూపానీ వంటి వారిని అకాల మృత్యువు కబళించింది. విమానంలో ఉన్న వారంతా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. సిబ్బంది, పైలెట్లు ప్రయాణీకులు పరిసర జనావాసాల్లో వెరసి 269 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మసిబారిన మృతదేహాలను వారి అస్థికలను గుర్తించాలన్నా డిఎన్ఏ పరీక్షల వల్లనే సాధ్యం. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం ఎఐ 171 అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాంట్విక్ విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.38 నిమిషాలకు విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అదుపు తప్పి అహ్మదాబాద్‌లోని మేఘానీ నగర్‌లోని బిజె వైద్య హాస్టల్ భవనాల్లోకి చొచ్చుకునిపోయింది. అహ్మదాబాద్ విమానాశ్రయ చరిత్రలో ఇది రెండో పెద్ద ప్రమాదం. 1988 అక్టోబర్ 19 న ఇండియా ఎయిర్లైన్స్ విమానం విమానాశ్రయంలో లాండింగ్ అవుతుండగా కుప్పకూలి అందులోని 13 మంది ప్రయాణికులు బలయ్యారు. తాజా ప్రమాదంలో బ్రిటన్ పౌరుడు విశ్వాస్ కుమార్ రమేష్ మృత్యుంజయునిగా బతికి బయట పడ్డారు. 11ఎ. సీట్లో ఎమర్జెన్సీ డోర్ వద్దకూర్చోవడమే అతని అదృష్టం కావచ్చు. ఇంతటి విషాదంలో ఇదొక అద్భుతం. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థల నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్త విమాన ప్రమాదాల్లో 35శాతం టేకాఫ్ సమయంలో కానీ, ఆ వెంటనే కానీ జరుగుతుంటాయి. మిగిలిన సందర్భాల్లో ప్రమాదాలు బహు తక్కువే. చనిపోయిన వారిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 గురు పోర్చుగీసు వాసులు, ఒక కెనడియన్ ఉన్నారు. విమానం ఢీకొట్టిన బి జె వైద్యకళాశాల హాస్టల్ విద్యార్థులు సిబ్బంది 150మందికిపైగా ఉన్నారు. విమానం టేకాఫ్ అయిన 59 సెకన్లలోనే కుప్పకూలింది. విమానం అక్కడి నుంచే ప్రయాణం ప్రారంభించడంతో, సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన 1.25 లక్షల లీటర్ల ఇంధనం ట్యాంక్ నిండా ఉంది. అదేఇంత పెద్ద ప్రమాద విస్ఫోటానికి కారణమైంది. అసలు కారణంతెలియాలంటే బ్లాక్ బాక్స్ విశ్లేషణ జరగాల్సిందే. ప్రమాద సమయంలో వైద్య కళాశాల హాస్టల్ మెస్‌లో భోజనానికి ఉపక్రమించిన తరుణంలో 'రేపటి డాక్టర్ల' కల చెదిరిపోయింది. వారి కుటుంబాలన్నీ విషాదంలో మునిగిపోయాయి. వారిని ఓదార్చడం ఎవరివల్ల కావడం లేదు. అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో ఎంతో సురక్షితంగా భావించే బోయింగ్ క్రాఫ్ట్ కుప్పకూలడం ఆశ్చర్యమే మరి. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఇచ్చిన 'మేడే కాల్'కు స్పందించేలోగానే విమానం భస్మీపటలమయ్యింది. డ్రీమ్ లైనర్ అనగానే 290 మంది ప్రయాణికుల సామర్థ్యం కలది. ఏకబిగిన 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలదు. ఖండాంతర ప్రయాణానికి ఎంతో పటిష్టమైనదన్న అభిప్రాయం పైలెట్లందరిలోనూ వ్యక్తమౌతోంది. రెండు ఇంజన్లు పని చేయకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. నిర్దిష్ట పదజాలాన్ని ఉపయోగిం చి మాట్లాడే రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా ఈ ప్రమాదాల నుంచి కాపాడలేకపోవడం చెప్పుకోవాలి. టేకాఫ్ సజావుగానే జరిగింది. కానీ గేర్లను పైకి తీసుకునేలోపల రెండు ఇంజిన్లు క్రియా శీలకతను కోల్పోయి ఉండొచ్చునని మాజీ సీనియర్ పైలట్ కెప్టెన్ సౌరభ్ భట్నాగార్ ఈప్రమాదాన్ని విశ్లేషిస్తున్నారు. డివిఆర్ రికార్డర్, బ్లాక్ బాక్స్‌లే అసలు కారణాలను నిర్ధారించాలి. ప్రధాని నరేంద్రమోడీ విగత జీవుల మధ్య ఈ ప్రమాదస్థలిని చూసి చలించిపోయారు. దిగ్భ్రాంతి చెందిరు. ఊహించని ప్రమాదం జరగడంతో ప్రపంచవ్యాప్త నిపుణులు ప్రమాద కారణాలపై విశ్లేషణలు చేపట్టారు. కెప్టెన్ కూడా సుదీర్ఘదూరం విమానం నడిపిన అనుభవం ఉన్నవాడే. ప్రమాదాన్ని పసికట్టగలిగిన వాడే. వీటన్నిటినీ క్రోడీకరించు కుంటే ఈ ప్రమాదం సాంకేతిక వైఫల్యమనే నమ్మాలి. ఇదే విమానంలో 6నెలల నాడు సాంకేతిక లోపాలు తలెత్తాయని, వాటిని సజావుగాపూర్తి చేసినట్లు యాజమాన్యం చెబుతోంది. 13 ఏళ్లుగాఈ విమానం ఎన్నో ప్రయాణాలు చేసింది. ఎందరినో గమ్యస్థానాలకు చేర్చింది. మానవ మేధ, కృత్రిమ మేధ కలగలిపితే సాధించలేనిదేదీ లేదని రుజువవుతున్న తరుణంలో ఇలాంటి ప్రమాదాలు విస్మయమే. విమాన ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అవసరం. ఈ ప్రమాదం బోయింగ్ విమానాల భవితవ్యంపై నీలి నీడలు ఏర్పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. బోయింగ్ నిర్మాణంలో నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి ప్రక్రియల విషయమై మరోసారి ఆలోచించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. తమ విమానాలు బయలుదేరేముందే వాటి సమర్థతను నిర్ధారించే అంశాలన్నిటిలోనూ ఆధునిక మేళకువలు పాటించాలి.

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.



సిసిరో

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

# ప్రజావాక్కు



### ఎపి సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజనాంతరం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సేవలు తెలంగాణాకుమాత్రమేపరిమితమైపోయాయి. ఆంధ్రప్రదేశ్ లోనిఆ విశ్వవిద్యాలయ స్టడీసెంటర్లు కొనసాగటం లేదు. ఎంతో ముందుచూపుతో ఆనాటి ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి 1982లో వయోజనులు, అనేక కారణాలతో మధ్యలోనే చదువు ఆపేసినవారు దూరవిద్య ద్వారా డిగ్రీ స్థాయిలో చదువుకునే విధంగా "అందరికీ చదువు" నినాదంతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ఏర్పాటుచేశారు. ఆతరువాత ఆ విశ్వవిద్యాలయం పేరును డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. ఒకే పేరుతో రెండు రాష్ట్రాల్లో సార్వత్రిక విశ్వవిద్యాలయం కొనసాగలేదు కనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ప్రారంభించాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ఫీజులపై నియంత్రణ అవసరం

ఇటీవలప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులపెరుగుదల సామాన్య ప్రజలకు తీవ్రఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అనూహ్యంగా వేలల్లో ఫీజులు పెంచుతున్న స్కూళ్లు, కాలేజీలు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఒకవిద్యార్థికి ఒక్క సంవత్సరానికి వచ్చేమొత్తం ఖర్చులక్షలరూపాయలను దాటి పోతోంది. ఇంతటితో ఆగకుండా, కంప్యూటర్ కోర్సులు, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు కూడా తమ వద్దే కొనాలని బలవంతం చేస్తున్నారు. తక్షణమే ఫీజుల నియంత్రణ కోసం కఠినమైన నిబంధనలను రూపొందించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యోగాకు విస్తృత ప్రచారం

జూన్21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించే నిమిత్తం ఎపి ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసం ప్రకటించింది. నేడు యోగ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తిస్తున్నారు. ఆధునిక జీవనంలో ఒత్తిడినుంచి స్వాంతన చేకోరడానికి యోగ ఉత్తమ సాధనం. యోగాతో ఆరోగ్యం మానసిక ప్రశాంతత కూడా చేకూరుతాయి.

-సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

### జన భార(త) మ్

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. అది నలభై ఏళ్లలో 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది. అలా తక్కువగా కొనసాగడం ప్రపంచ వ్యాప్తంగాఉన్నసమస్య. కాబట్టి దాన్నిఅధిగమించాలా, లేదా ప్రపంచంతోనే నడుస్తూ, భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కర లేదా అన్నది ఒక కోణం. ఇప్పుడు దృష్టి పెట్టాల్సినవి రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి జనాభాలో 68శాతం పని చేయగల వయస్సు వారు. అరవై నాలుగుసంవత్సరాల లోపు వారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికలు, అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గాల్లో ప్రాణాలు

ఎయిర్ ఇండియా ప్లైన్ క్రేష్ విషాధాతంలో అశువులు బాసిన వారికి కండోలెసెన్స్ తెలియ జేస్తూ ముఖ్యంగా గమనించ విషయాలు ఏమిటంటే ముందుగా ఫిట్నెస్ అఫ్ ఫ్లైట్ ఏమిటి, దాని మైంటెనెన్స్ ఎలా ఉంది క్షుణ్ణంగా పరిశీలించి గాలిలోకి వెళ్ళాలి. చాలా సందర్భాలలో మనము విన్న మాట కొంచెం ఎయిర్ ఇండియా ఫ్లైట్స్ గురించి అసంతృప్తి మాటలే. ఫ్లైట్ కనీసపు ఎత్తుఎగరకుండా క్రేష్ అయ్యిందంటే ఇంజన్ టెక్నికల్ గా ఫాల్ట్ ఉందా అనేది తెలియవలిసిన విషయం. విషయాలు తరువాత తెలియవలిసినవి ఎన్నిఉన్నా అవి ఆక్సిడెంట్ అయిన తరువాత. మరి ముందుగా చేయవలసిన పనుల నిర్లక్ష్యం వల్లే కదా జరిగిందని అందరూ అనేమాట. ఎన్ని జరిగినా ఇదే పరిస్థితి పోస్ట్ మారటం హడావుడిలే..

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### పెరుగుతున్న కరోనా కేసులు

కరోనాతో మరణిస్తున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఇటీవల మొదలైన కరోనా పట్ల అంత భయం లేకున్నా ఇప్పటికీ స్వీయ రక్షణ చర్యలు అవసరం అని ఈ మరణాలు చాటుతున్నాయి. అయితే దీనికి ప్రధాన కారణం ప్రజలలో కరోనా పట్ల పెరిగిన అవగాహన. ఏది ఏమైనా కరోనా పట్ల తగు జాగ్రత్త అవసరం అని చాటుతున్న సందర్భం ఇది.

-భారత అవినాష్, జనగామ

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేవుళ్ల భూములకు శఠగోపం!

**ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మ కర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకులు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

భారతీయ సంస్కృతిలో మారుపేరుగా భక్తివిశ్వాసాలకు నిలయాలుగా ప్రజాదరణ పొంది ఒకనాడు దేదీప్యమానంగా వెలుగొందిన దేవాలయాలు రానురాను నేడు దీనావస్థకు చేరుకుంటున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు వేలాదికోట్ల రూపాయల ఆస్తిపాస్తులున్నా నిత్య పూజలకు కూడా నోచుకోలేక కనీసం దీపం పెట్టే దిక్కులేక కళావిహీనంగా ఎన్నో ఆలయాలు జీర్ణావస్థకు చేరుకుంటున్నాయి. రాజకీయ అవసరాల కోసం దేవుడిని, దేవాలయాలను, దైవభక్తిని దుర్వినియోగం చేసే దుష్టసంప్రదాయం ఆరంభమైనప్పటి నుంచి దేవాలయాల వ్యవస్థ పతనం ప్రారంభమైందనే చెప్పొచ్చు. పవిత్రమైన హిందూ దేవాలయ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరిగిపోతున్న కొద్దీ, దేవుళ్లకు, భక్తులకు కష్టాలు పెరిగిపోతున్నాయి. ఎన్నోసార్లు ఈ విషయంలో హిందూధర్మాచార్యుల సభ ఆందోళన వ్యక్తం చేసింది. దేవాలయాలపై వచ్చే ఆదాయం దైవప్రచారానికి, ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని కొందరు పీఠాధిపతులు, మఠాధిపతులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. అంతేకాక దేవాలయ ఆస్తులను కాపాడేందుకు ఒక ఉద్యమం చేపట్టే అవసరం వస్తుందని కూడా పెద్దలు వక్కాణించారు. కానీ ఎవరు ఎంత అరిచి గీ పెట్టినా, ఎన్ని హెచ్చరికలు చేసినా దేవుళ్ల ఆస్తులను దుర్వినియోగాన్ని నివారించలేకపోతున్నారు. ఒర్లి, ఒర్లి వారుపోతారు. వండుకతిని వీరు పోతారన్నట్లుగా ఉంది పరిస్థితి. గతంలో ఎన్నోవిదేశీ దాడులను ఎదుర్కొని, మరెన్నో ఆటుపోట్లను తట్టుకున్న దేవుళ్లు ఇప్పుడు స్వజనుల దోపిడీని, దుర్మార్గాలను నిర్మూలించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. జీతభత్యాలపై ఉన్న శ్రద్ధ దేవుళ్ల ఆస్తులపై ఉండడంలేదు. రెవెన్యూ చట్టాల్లో తరుచుగా వస్తున్న మార్పులు, చేర్పులు ఈ దేవాలయ భూములను ఆక్రమించేవారికి కల్పతరువుగా మారుతున్నాయి. అసలు దేవాలయాల భూములకు, భవనాలు ఎన్ని ఉన్నాయి? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటిపై రావాల్సిన ఆదాయం ఎంత? ఎంత వస్తున్నది? సబ్‌లీజ్‌ల పేరుతో మధ్యవర్తులు ఎంత భోంచేస్తున్నారు? తదితర వివరాలు దేవాదాయ శాఖ వద్ద స్పష్టంగా లేవనే చెప్పొచ్చు. కొన్ని తెలిసినా, రకరకాల కారణాలతో నోరు విప్పరు. అంతెందుకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర పరిధిలో దేవుళ్లకు ఉన్న ఆస్తులు ఎన్ని? వాటిపై వస్తున్న ఆదాయం గురించి తెలుసుకుంటే విస్తుపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం తెలుగురాష్ట్రాల్లో దాదాపు మూడులక్షల డెబ్బైవేల ఎకరాలకు పైగా దేవాలయ భూములున్నట్లు అనధికార అంచనా. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో ఎనభైవేల ఎకరాలకుపైగా భూములున్నాయి. గతంలో ఈ భూములకు రికార్డులు ఎంతో పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం, ఖర్చులు తదితర వివరాలు అన్నీ నమోదు చేయడమేకాక జమాబంది రూపంలో తనిఖీలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ రికార్డులు ఏమయ్యాయో? ఏ మేరకు రాస్తున్నారో? ప్రశ్నార్థకమే. దేవాలయ భూములకు సంబంధించి నిజాంకాలం నుండే కాదుఅంతకు ముందు నుంచి కూడా ఒక నిర్దిష్టపద్ధతిలో నమోదయ్యేవి. 1349 ఫసలీ నుంచి తెలంగాణలో మొత్తం దేవాలయ భూములు వాటిపై వస్తున్న ఆదాయం తదితర అంశాలు నమోదు చేసేవారు. ఆదాయం, ఖర్చులకు సంబంధించి ఆర్డీఓ స్థాయి అధికారితో జమాబందిలో లోతుగా పరిశీలించేవారు. దేవుని సొమ్ము ఏమాత్రం భోంచేసినట్లు తేలినా, భూములు ఆక్రమించినట్లు బయటపడినా తీవ్రంగా శిక్షలు ఉండేవి. అప్పటివరకు అమలులో ఉన్న మద్రాసు యాక్టును ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా కొంతకాలంకొనసాగించారు. పి.వి నర్సింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమ

ఒక్క మాట

యంలో తెలంగాణ, ఆంధ్ర దేవాలయ శాఖలనుకలిపివేశారు. అప్పటివరకు అంతో ఇంతో రెండురాష్ట్రాల్లో విరివిగా రికార్డులుండేవి. రానురాను భూములు అన్యాక్రాంతం కావడం, దీనికి సంక్షేమం పేరుతో వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇష్టానుసారంగా దేవుళ్ల భూములను కేటాయించడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీర్ఘకాలపు లీజుల పేరుతో కొన్ని, మరికొన్ని సాగు పేరుతో ఇలా రకరకాల దేవుని భూములు అన్యాక్రాంతమయ్యాయి. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకుని కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గట్టిగానే చెబుతున్నారు. కాని క్రియశూన్యం. గతంలోనూ ఆ శాఖమంత్రులు, ఇలాగే చెప్పారు. కానీ ఒక్క అడుగు ముందుకు కదిలిన పాపాన పోలేదు. ఎక్కడైనా దేవాలయ భూముల గతి ఇంతే. పర్యవేక్షించేవారు పరాకుగా ఉంటే, దేవుని మాన్యాలను భోంచేసేవారు హుషారుగానే ఉంటారన్నది విదితమే. ఇక్కడా, అక్కడా అనికాదు. తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాలకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు చెబుతున్నారు. ఇకపోతే భక్తులు సమర్పించుకునే కానుకలు కొన్ని చోట్ల పక్కదారిపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దేవుల హుండీలకు కూడా కన్నాలు పడుతున్నాయి. ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తిరుమల తిరుపతి వెంకన్న కూడా ఈ అవినీతిపరుల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఆ దేవదేవునికి సమర్పించుకుంటున్న ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూల్లో వాడే నెయ్యిలో కల్తీ జరిగినట్టు సాక్షాత్తు అధికారులే ప్రకటించడంతో భక్తులు విస్తుపోతున్నారు. భారీ ఎత్తున జరిగే ఈ కుంభకోణంలో దేశఅత్యున్నత న్యాయస్థానం జోక్యంతో ఉన్నతస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నది. నిన్నమొన్నటివరకు టిటిడీలో కీలకపాత్ర వహించిన అధికారగణంపై విమర్శలు చుట్టుముట్టుతున్నాయి. మరికొందరు ధర్మకర్తలపైకూడా ఈఆరోపణల పరంపర కొనసాగుతున్నది. వాస్తవంగా ధర్మనిష్టాపరులు, నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా ఉండేవారు పాలనామండలిలో ధర్మకర్తలుగాఉంటే ఇంత భారీ ఎత్తున అవకతవకలకు అవకాశం ఉండకపోవచ్చుననే అభిప్రాయాలను తోసిపుచ్చలేం. అధికారులతో ఇలాంటి ప్రమాదం ఉంటుందనే దేవుళ్ల ఆస్తులను కాపాడేందుకు భక్తులు సమర్పించుకునే ప్రతిపైసాను సద్వినియోగం చేసేందుకు ఎంతో ముందు చూపుతో మనపెద్దలు ధర్మకర్తల వ్యవస్థను ఏనాడో ఏర్పాటు చేశారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా లాభాపేక్షకు తావులేకుండా దేవుని సేవలో తరించిపోవాలనే ఆశయాలున్నవారిని భూ విరాళాలు సమర్పించుకున్నవారిని ధర్మకర్తలుగా నియమించేవారు. నీతి, నియమనిష్టలతో, భక్తి విశ్వాసాలతో, సత్ప్రవర్తనలతో ప్రజలకు ఎంతో ఆదర్శంగా, అనుకరణీయంగా ఉండేవారు. కానీ పంచాయతీరాజ్ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామ రాజకీయాలు చోటు చేసుకోవడంతో ఆ ప్రభావం దేవాదాయ వ్యవస్థపై పడింది. ధర్మకర్తల మండళ్లు, రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోతున్నాయి. వ్యక్తిగతగుణాలు, దైవచింతన వంటి ఉత్తమ గుణాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ అనుయాయులను, పార్టీ కార్యకర్తలను, ఎన్నికల్లో నిలబడలేని వారిని, నిలబడినా ప్రజలతో తిరస్కరించబడినవారిని పునరావాసంగా ధర్మకర్తల మండలిలో నింపడం ప్రారంభమైనప్పటి నుంచి దేవుళ్లకు కష్టాలు ప్రారంభమయ్యాయని చెప్పొచ్చు. ఈ పదవులను ఉపయోగించుకొని దేవుళ్ల సొమ్మును స్వాహా చేసిన పెద్దలు ఎందరోఉన్నారు. దేవుళ్లను ఉపయోగించుకొని తమ వ్యాపారాలను విస్తరించుకున్నవారు కూడా లేకపోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరి సహకారం, అధికారుల తోడ్పాటు లేకుండా దేవుడి సొమ్మును అక్రమమార్గాలవైపు మళ్లించడం అంత సులభం కాదు. ఏయే కార్యక్రమాల్లో పాల్గొనాలో దేవుడి సొమ్ము ఎంతెంత భోంచేశారో ఆయా ప్రాంతాల భక్తులకు కూడా తెలియందికాదు. ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మకర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకులు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ●

# ఆదాయ అసమానతలు తగ్గితేనే ఆర్థిక వృద్ధి సాధ్యం!

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

జిడిపి పరంగా 4.187 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచ దేశాలలో నాలుగవ స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత మన దేశం ఉన్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ మన దేశపు నీతి అయోగ్ తెలియజేయడం ఎంతో సంతోషం. ఐఎంఎఫ్ ప్రకారం మనదేశంలో తలసరి ఆదాయం 2013-14 లో 1438 యూఎస్ డాలర్లు ఉండగా 2025 నాటికి 2880 డాలర్లుగారెట్టింపు అయిందని తెలుస్తున్నది. ఇప్పుడు ఏ విధంగా మన ఆర్థిక వ్యవస్థ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్తున్నారు. బిలియనీర్ల సంఖ్య పెరిగితే దేశం ఆర్థిక అభివృద్ధి జరిగినట్లేనా?1990లలోఇద్దరే ఇద్దరు బిలియనీర్లు మనదేశంలో ఉండగా నేడు 332మంది ఉన్నారు. వీరి సంపద విలువ మన దేశస్థూల జాతీయోత్పత్తిలో సుమారు ఒకటి బై మూడు వంతు ఉన్నది. భారత్ లీబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుధైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో, వస్తు ఉత్పత్తులతో గణనీయంగా పెరిగిమానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగా వెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించినారు. అయితే ఈ విధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థిక విధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించలేకపోయారు. ప్రభుత్వం రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదని, నష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశంలో నిరుద్యోగిత, మానవ వనరుల విధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారులవశం చేయడానికి దేశంలోవృద్ధి ప్రక్రియ అంతా పెట్టుబడిదారుల కనసన్నల్లోకి పోయింది. మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యా, వైద్య జీవన ప్రమాణాలు రీత్యాఉన్నది. 193 దేశాలలో ఆయుష్ ప్రమాణం రీత్యా మనదేశం స్థానం134గా ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125 దేశాలలో111వ దేశం మనది. ఎల్పిజి ఫలితాల వలన ఏర్పడిన దుష్పరిణామం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అభివృద్ధి చెందుతున్నదనే పాలకులు ఎలా చెబుతున్నారో అర్థం కావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలినియర్లు ఉన్న దేశంలో నేడు 332 బిలినియర్లు పెరిగినందున దేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతున్నదా? ప్రజలఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణలోకి తీసుకొనే అవసరం లేదా? అపారమైన వ్యవసాయ సంపద ఉన్న మన దేశంలో తీవ్రమైన పోషక ఆహార లోపం ఉన్నది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 127 దేశాలలో మన దేశంస్థానం 105వది. మనదేశంలో 35.5శాతం పిల్లలు పోషక ఆహార లోపంతో, 45శాతం పిల్లలు ఈ లోపంతోనే మరణాలకు గురవుతున్నారని పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధిరీత్యా 130వది. ఆదాయ అసమానతల రీత్యా113వది. సామాజిక న్యాయం లేని ఆర్థికాభివృద్ధివలన ఎంత పెద్ద ఆర్థికవ్యవస్థ అయితే ఏమి ఎవరికి లాభం? నేడు మన దేశ జనాభా142 కోట్ల మందితో ప్రపంచంలో మొదటి స్థానంలోఉన్నాం. మన దేశ జనాభా ఎక్కువ శ్రామిక శక్తి కలిగి ఉన్నందువలన వారికి ఉపాధి అవకాశాలు కల్పించగలిగితే నిరుద్యోగిత, పేదరికం, ఆదాయ అసమానతలు ఉండవు. ●

# రక్తదానంపై అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగనభట్ల

అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టుమిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఎ, ఒ, బి, బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న 'ప్రపంచ రక్త దాతల దినోత్సవము' ను ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపు కుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం ఆవశ్యకతను తెలియ జేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచుకునేందుకు 2005 లో ఈ కార్యక్రమం ప్రారంభమయింది. ఈ సందర్భంగా రక్తదానం ఎలా చేయాలి, ఎవరు రక్తదానానికి అర్హులు, రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం. రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడుతుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్ గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించాలనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండు గడ్డిరంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని 'ప్లాస్మా' అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలాఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమేకాదు, ప్రతిఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని 'గ్రహీత' అని, ఇచ్చేవ్యక్తిని 'దాత' అని అంటారు. 'ఒ' గ్రూప్ రక్తం కలిగిన వారిని 'విశ్వదాత' అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగపడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చం



టే...ఎబి గ్రూప్ వారు ఎబి గ్రూప్ కి, ఎ గ్రూప్‌వారు, ఎబి గ్రూపుల వారికి, బి గ్రూప్ వారు బి, ఎబి గ్రూపుల వారికి, 'ఒ' గ్రూప్ వారు ఎ,బి, ఎబి, ఒ గ్రూప్‌ల వారందరికిదానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే ఎబి గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. బి గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఎ గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఒ గ్రూప్ వారు ఒ గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 34 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈమూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హానిచేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. దేశంలో ఏటాకొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్‌బాధి తులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూవారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రి య పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, ఒక యూనిట్ రక్తాన్నిదానం చేయవచ్చు. ●

# ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం

## దౌత్యమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించిన భారత్



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 13:** ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈ ఉద్రిక్తతలపై భారత్ స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేసింది. దౌత్యమార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఇరు దేశాలకు సూచించింది. భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేసింది. అణు కర్మాగారాలే లక్ష్యంగా జరిపిన దాడులతో సహా అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా చూసుకోవాలని ఇరు దేశాలను కోరింది. దౌత్యపరమైన మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఇరాన్-ఇజ్రాయెల్‌తో తమకు సన్నిహితమైన సంబంధాలు ఉన్నాయని, సమస్యను పరిష్కరించుకునేందుకు తాము మద్దతిస్తామని ఈ సందర్భంగా న్యూఢిల్లీ పేర్కొంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా దేశాల్లోని భారత కమ్యూనిటీలతో అక్కడి భారత రాయబార కార్యాలయాలు సంప్రదింపులు జరుపుతున్నాయని వెల్లడించింది. అక్కడి భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు చెప్పే భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరింది.

**దాడులను ఖండించిన సౌదీ:** కాగా.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడాన్ని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. 'ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇవి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను బలహీనపరుస్తాయి. టెల్‌అవీవ్ దాడులకు దిగి అంతర్జాతీయ చట్టాలు, నిబంధలను ఉల్లంఘించింది' అని సౌదీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి కూడా మరణించారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.

**ఇరాన్‌పై దాడుల గురించి ముందే తెలుసు: ట్రంప్**

ఇరాన్‌పై ఇజ్రా యెల్ చేస్తున్న దాడుల గురించి తమకు ముందే తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.



అయితే, ఈ దాడుల్లో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీనిపై మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆ దేశం చర్చలకు తిరిగి రావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక, ఇరాన్ ఏదైనా ప్రతీకార దాడులకు పాల్పడితే దాన్ని ఎదుర్కొనేందుకు తమ సెంట్రల్ కమాండ్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. దాని నుంచి అమెరికా తనను తాను రక్షించుకోవడంతోపాటు సిద్ధంగా ఉందన్నారు.

**ఇరాన్ గొప్ప దేశం కావొచ్చు కానీ..** ఇజ్రాయెల్ దాడులకు ముందు ట్రంప్ చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఇరాన్ అణు సమస్యను దౌత్యపరమైన మార్గాలతో పరిష్క రించుకునేందుకు మేం కట్టుబడి ఉన్నాం. దీనిపై చర్చలు జరపాలని నా అధికారులను ఆదేశించాను. అది గొప్ప దేశమే కావొచ్చు. కానీ, వారు ముందుగా అణ్వాయుధాలను కలిగి ఉండాలనే ఆశను వదులుకోవాలి' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ పూర్తిగా అప్రమత్తంగా ఉందని మిలిటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్ తెలిపారు. పదివేల మంది సైనికులను సరిహద్దు వద్ద సిద్ధంగాఉంచా మన్నారు. తమపై దాడులు చేయడానికి ప్రయ త్నించేవారు ఎవరైనా భారీ మూల్యం చెల్లించు కుంటారని ఆయన ఈసందర్భంగా హెచ్చరించారు.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెల కొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమా సియా మళ్లీ రణరంగంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులుచేసింది. ఈ దాడు ల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్‌మహమ్మద్ బాఘేరి కూడా మరణిం చారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామనిఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఆ దేశ అణు కార్యక్రమానికి గుండె లాంటి ప్రదేశాన్ని ధ్వంసం చేశామన్నారు.



# విమానం నేలను తాకగానే
## 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కుప్పకూలి ప్రమాదం జరిగిన తీరు, అనంతర పరిణామాలపై మరిన్నివివరాలు వెలుగులోకి వస్తున్నాయి. విమానం కూలిపోయిన ప్రదేశంలో దాదాపు 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు ఎగిసిపడ్డాయని, సహాయక చర్యలు చేపట్టడం అత్యంత క్లిష్టతరంగా మారిందని అధికారులు తెలిపారు. ఈ విమానంలో సుమారు 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, అది పేలి మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ఎవరినీ రక్షించే అవకాశం లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే వెల్లడించారు. ఘటనపై ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రమాద సమాచారం అందిన వెంటనే మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల సమయంలో మా బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అప్పటికే స్థానికులు కొందరు హాస్టల్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడారు. అయితే, మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పరిస్థితి అదుపు తప్పింది" అని వివరించారు. మరో అధికారి ప్రమాద స్థలంలోని భయానక వాతావరణాన్ని వివరిస్తూ, "మేము గతంలో అనేక సహాయక చర్యల్లో పాల్గొన్నాం, కానీ ఇంతటి విపత్తును ఎప్పుడూ చూడలేదు. విమాన ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో పెద్ద అగ్నిగోళంలా మారింది. క్షణాల్లోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో ఎవరూ బయటపడే మార్గం లేకుండా పోయింది. మేము పీపీఈ కిట్లు ధరించి ఘటనా స్థలానికి వెళ్లినా, వేడి తీవ్రత అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆ ప్రాంతంలోని పక్షులు, కుక్కలు కూడా తప్పించుకోలేనంత వేగంగా ఉష్ణోగ్రత పెరిగింది. ప్రమాద స్థలంలో అనేక పక్షులు, శునకాలు కాలి బూడిదయ్యాయి. ఎటు చూసినా శిథిలాలే కనిపించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికుల మృతదేహాలను గుర్తించడం సవాలుగా మారిందని ఆవేదన్యక్తం చేశారు.

# ఇరాన్ గగనతలం మూసివేత: ఎయిరిండియా సర్వీసుల దారిమళ్లింపు

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఇరాన్ తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమానయాన మార్గాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమానాలు తమ ప్రయాణాలను అర్ధాంతరంగా ముగించుకోవాల్సి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున ముంబయి నుంచి లండన్ హీత్రూకు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ129, గాలిలో సుమారు మూడు గంటల పాటు ప్రయాణించిన అనంతరం తిరిగి ముంబయి చేరుకుంది. ఫ్లైట్‌రాడార్24 వివరాల ప్రకారం ఏఐ129 విమానం ఉదయం 5:39 గంటలకు ముంబయి నుంచి టేకాఫ్ అయింది. అయితే, ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో ప్రయాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి విమానాన్ని వెనక్కి మళ్లించక తప్పలేదని తెలిసింది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌లో నెలకొన్న



పరిస్థితులు, అక్కడి గగనతలం మూసివేత కారణంగా మా పలు విమానాలు దారి మళ్లించబడుతున్నాయి లేదా బయలుదేరిన చోటుకే తిరిగి వస్తున్నాయని ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రయాణికులు మరియు సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని సంస్థ పేర్కొంది. ముంబయి-లండన్ సర్వీసుతో పాటు ఇతర అంతర్జాతీయ ఎయిర్ ఇండియా విమానాలపైనా ఈ ప్రభావం పడింది. లండన్ హీత్రూ నుంచి ముంబయి వస్తున్న ఏఐ130 విమానాన్ని వియన్నాకు, న్యూయార్క్ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ102 విమానాన్ని షార్జాకు, న్యూయార్క్ నుంచి ముంబై వస్తున్న ఏఐ116 విమానాన్ని జెడ్డాకు, లండన్ హీత్రూ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ2018 విమానాన్ని ముంబయికి దారి మళ్లించారు. ముంబయి నుంచి న్యూయార్క్‌కు వెళ్తున్న ఏఐ119, ఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్తున్న ఏఐ103 విమానాలు కూడా తాము బయలుదేరిన విమానాశ్రయాలకే వెనుదిరిగాయి. ఈ అంతరాయం వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాన్ని తగ్గించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎయిర్ ఇండియా హామీ ఇచ్చింది. ప్రయాణికులకు వసతి, టికెట్ డబ్బు వాపసు (రీఫండ్) లేదా ఎటువంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీ మార్పు (రీషెడ్యూలింగ్) వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు వీలైనంత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వివరించింది.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో విమానసర్వీసులకు బ్రేక్
### 3 గంటలు ప్రయాణించి వెనక్కు వచ్చేసిన ఎయిరిండియా విమానం

**ముంబయి,జూన్ 13:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన దాడి కారణంగా ఇరాన్ తమ గగనతలాన్ని శుక్రవారం మూసివేసింది. ఈ పరిణామంతో ముంబై నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ131ను అత్యవసరంగా దారి మళ్లించాల్సి వచ్చింది. అలాగే, మొత్తం 16 విమానాలను ఎయిరిండియా దారి మళ్లించడమో, వెనక్కి పిలిపించడమో చేసినట్టు సమాచారం. షెడ్యూల్ ప్రకారం నేడు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం సాధారణంగా ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణిస్తుంది. అయితే, ఇజ్రాయెల్ జరిపిన సైనిక చర్య నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా తమ దేశ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

## బోయింగ్ ప్రమాదంలో ఇద్దరు ఫ్లైట్ అటెండెంట్ల దుర్మరణం

**ఇంఫాల్, జూన్ 13:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం మణిపూర్‌లో తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన యువతులు, ఎయిర్ ఇండియాలో ఫ్లైట్ అటెండెంట్లుగా పనిచేస్తున్న నంగ్థోయ్ శర్మ కొంగ్‌బ్రైలత్‌పమ్ (21), లామ్నుంథెమ్ సింగ్‌సన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. ఇంఫాల్‌లోని డీఎం కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో నంగ్థోయ్ శర్మ ఎంపికయ్యారు. ముగ్గురు ఆడపిల్లల్లో రెండోదైన నంగ్థోయ్, టీనేజ్‌లోనే ఎయిర్ ఇండియాలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆమె తండ్రి నందేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ 12న ఉదయం 11:30 గంటలకు నంగ్థోయ్ తన సోదరికి చివరిసారిగా ఫోన్ చేసింది. తాను లండన్ వెళ్తున్నానని, కొన్ని రోజులు మాట్లాడలేనని చెప్పింది. జూన్ 15న తిరిగి రావాల్సి ఉంది. అదే మాకు ఆమె చివరి మాటలవుతాయని ఊహించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె కాల్ చేసిన మూడు గంటల తర్వాత విమాన ప్రమాదం గురించి ఓ బంధువు ఫోన్‌లో చెప్పడంతో నంగ్థోయ్ సోదరి తీవ్ర ఆందోళనకు గురైంది. గత వారం అరమ్‌బాయ్ టెంగ్‌గోల్ సభ్యుడి అరెస్ట్‌కు నిరసనగా కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో వారికి ఆన్‌లైన్ వార్తలు అందుబాటులో లేవు. నంగ్థోయ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన వెంటనే స్నేహితులతో కలిసి ఎయిర్ హోస్టెస్ ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం సాధించిందని,



ముంబైలో మణిపూర్‌కు చెందిన ఇతర ఎయిర్ ఇండియా ఉద్యోగినులతో కలిసి ఉండేదని ఆమె తండ్రి గుర్తుచేసుకున్నారు. ఎప్పటికైనా మణిపూర్‌లో స్థిరమైన ఉద్యోగం చేస్తుందని ఆశించామని తెలిపారు.

మరో మృతురాలు లామ్నుంథెమ్ సింగ్‌సన్ కుటుంబం 2023లో జరిగిన జాతి ఘర్షణల కారణంగా ఇంఫాల్‌లోని ఓల్డ్ లంబులేన్‌లో ఉన్న తమ సర్వస్వాన్నీ వదిలేసి వచ్చింది. ప్రస్తుతం వారు కాంగ్‌పోక్పి జిల్లాలో అంతర్గతంగా నిరాశ్రయులైన వ్యక్తులుగా (ఐడీపీలు) ఓ చిన్న అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. లామ్నుంథెమ్ తండ్రి కొన్నేళ్ల క్రితం మరణించగా, ఆమె తల్లి నెమ్నెయిల్‌హింగ్ సింగ్‌సన్ ముగ్గురు పిల్లలను ఒంటరిగా పెంచారు. లామ్నుంథెమ్ ఆమెకు ఏకైక కుమార్తె. ప్రమాద వార్త తెలిసినప్పటి నుంచి స్థానికులు వారి ఇంటికి చేరుకుని ధైర్యం చెబుతున్నారు. తన కుమార్తె క్షేమంగా ఉందని ఏదైనా అధికారిక సమాచారం వస్తుందేమోనని తల్లి నెమ్నెయిల్‌హింగ్ ఇంకా ఆశతో ఎదురు చూస్తున్నారు. చివరిసారిగా తన తల్లికి ఫోన్ చేసినప్పుడు, తాను డ్యూటీ మీద అహ్మదాబాద్ వెళ్తున్నట్టు లామ్నుంథెమ్ చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ఇండో-చైనాలమధ్య నిలిచిన విమానసర్వీసుల పునర్ధురణ



**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత్, చైనాల మధ్య నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులు త్వరలో తిరిగి ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన ఈ సేవలను పునరుద్ధరించడం ద్వారా ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను నెలకొల్పడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను తిరిగి గాడిలో పెట్టే దిశగా ఇది ఒక కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. ఇరు దేశాల విమానయాన, దౌత్య అధికారులు గత కొన్ని నెలలుగా చర్చలను ముమ్మరం చేశారు. ప్రత్యక్ష విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన కార్యాచరణ, నియంత్రణాపరమైన అంశాలపై సాంకేతిక బృందాలు కృషి చేస్తున్నాయి. 2020 ప్రారంభంలో కొవిడ్19 మహమ్మారి వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో తలెత్తిన సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, చైనాల మధ్య ప్రత్యక్ష విమాన సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అంతకుముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్‌మింగ్ వంటి చైనా నగరాల నుంచి న్యూఢిల్లీ, ముంబయి, కోల్‌కతా వంటి భారతీయ నగరాలకు పలు విమానయాన సంస్థలు వారానికి అనేక డజన్ల కొద్దీ విమానాలను నడిపేవి. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు ప్రధానంగా విమానాశ్రయాలలో స్లాట్ కేటాయింపులు, గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు, నవీకరించిన నియంత్రణ ప్రక్రియలు వంటి కీలక కార్యాచరణ అంశాలపై దృష్టి సారించాయి. భారత్‌లో చైనా రాయబారి జూ ఫీహాంగ్ ఇటీవల మాట్లాడుతూ, ప్రత్యక్ష విమానాల పునరుద్ధరణపై ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్‌లో నేను కలిసిన ప్రతి ఒక్కరూ ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాలను ఆశిస్తున్నారు. త్వరలోనే విమానాల పునరుద్ధరణ జరుగుతుందని నేను ఆశిస్తున్నాను" అని ఆయన తెలిపారు. విమాన కార్యకలాపాలను సూత్రప్రాయంగా తిరిగి ప్రారంభించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), దాని చైనా విభాగం సాంకేతిక ఏర్పాట్లను ఖరారు చేస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. విమానాల పునరుద్ధరణకు కచ్చితమైన కాలపరిమితిని ఇంకా ప్రకటించనప్పటికీ, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేశాయి. 2025 మొదటి నాలుగు నెలల్లోనే చైనా భారతీయ పౌరులకు 85,000 వీసాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో విమానాల పునరుద్ధరణ వాణిజ్యం, పర్యాటకం, విద్యా సంబంధాలను ప్రోత్సహిస్తుందని అంచనా వేస్తున్నారు. పౌర విమానయాన కార్యదర్శి ఉమ్లున్‌మాంగ్ ఉల్నామ్ మాట్లాడుతూ, చర్చలు ఇంకా ప్రాథ మిక దశలోనే ఉన్నాయని, అయితే కనెక్టివిటీని పునరుద్ధరించడంలో పరస్పర ఆసక్తి ఉందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఎదురైన అంతరాయాలను అధిగమించి, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడంలో విమాన సర్వీసుల పునరుద్ధరణ ఒక సానుకూల పరిణామంగా పరిగణించబడుతోంది. ఇది ఇరు దేశాలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందిస్తుందని భావిస్తున్నారు.

## పుకెట్ ఢిల్లీ ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్!

**పుకెట్(థాయిలాండ్),జూన్ 13:** థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో శుక్రవారం ఉదయం తీవ్ర కలకలం రేగింది. విమానంలో బాంబు ఉందన్న బెదిరింపు రావడంతో అప్రమత్తమైన పైలట్, విమానాన్ని వెనక్కి మళ్లించి పుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 156 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏరోనాటికల్ రేడియో ఆఫ్ థాయ్‌లాండ్ అధికారుల వివరాల ప్రకారం ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 379 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్‌కు బాంబు బెదిరింపు గురించి సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే పుకెట్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతి కోరారు. పుకెట్ విమానాశ్రయ అధికారులు తక్షణమే స్పందించి, ఎయిర్‌పోర్ట్ కంటింజెన్సీ ప్లాన్‌ను అమలులోకి తెచ్చారు. బాంబు బెదిరింపుల సమయంలో అనుసరించాల్సిన నిర్దేశిత అత్యవసర నిబంధనల ప్రకారం ప్రయాణికులందరినీ విమానం నుంచి దించివేసి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం అధికారులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక సోదాల్లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని తాజా సమాచారం ద్వారా తెలిసింది. అయితే, విమానంలో ఒక బాంబు బెదిరింపు నోటు దొరికిందని అధికారులు ధ్రువీకరించారు. ఆ నోటును ఎవరు రాశారు, దానిని ఎవరు గుర్తించారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ నోటును కనుగొన్న ప్రయాణికుడిని అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా భారతీయ విమానయాన సంస్థలు, విమానాశ్రయాలకు నకిలీ బాంబు బెదిరింపులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. గతేడాది తొలి పది నెలల్లోనే దాదాపు 1,000 వరకు ఇలాంటి తప్పుడు కాల్స్, సందేశాలు అందాయి.

## బోయింగ్ ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తి సహకారం
### అమెరికా రక్షణశాఖ, ఫెడరల్ ఏవియేషన్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 13:** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర ప్రమాదానికి గురై 265 మందికి పైగా మరణించినప్పటికీ, ప్రస్తుతానికి బోయింగ్ 787 విమానాల రాకపోకలను నిలిపివేయడానికి తక్షణ కారణాలు ఏవీ లేవని అమెరికా అధికారులు స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని వారు తెలిపారు. అమెరికా రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) తాత్కాలిక నిర్వాహకుడు క్రిస్ రోచెల్యూ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదా నికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్‌లను చూశామని, అయితే బోయింగ్ 787 విమాన నమూనాలో భద్రతా లోపాలు ఉన్నాయని చెప్పడానికి ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని వారు పేర్కొన్నారు. నిపుణులు ప్రమాద స్థలానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. కేవలం వీడియోలను చూసి అంచనాలకు రావడం తొందరపాటు అవుతుంది. అది సరైన పద్ధతి కాదని డఫీ అన్నారు. భారతీయ అధికారులతో పాటు విమాన తయారీ సంస్థ బోయింగ్, ఇంజన్ల తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్‌తో కలిసి ఎఫ్ఏఏ, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్టీఎస్బీ) బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని డఫీ తెలిపారు. దర్యాప్తునకు సహకరించేందుకు ఇప్పటికే ఒక అమెరికన్ బృందం భారత్‌కు బయల్దేరిందని, అవసరమైతే మరిన్ని వనరులను పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. దర్యాప్తులో భాగంగా విమాన ప్రయాణానికి సంబంధించి ఏదైనా ప్రమాద సంకేతం మా దృష్టికి వస్తే, దాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని రోచెల్యూ స్పష్టం చేశారు. భద్రతే మాకు అత్యంత ముఖ్యం. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తాం. దర్యాప్తులో వెల్లడయ్యే భద్రతా సిఫార్సులను అమలు చేయడానికి వెనుకాడబోమని డఫీ దృఢంగా చెప్పారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో భారత్‌కు అన్ని విధాలా సాయం అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని ప్రకటించారు. భారత్ ఒక పెద్ద, బల మైన దేశం వారు ఈ పరిస్థితిని అధిగమిం చగలరు. మా వైపు నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా తక్షణమే అందిస్తామని వారికి తెలియజేశానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి బోయింగ్ 787 విమాన సర్వీసులు యథావిధిగా కొనసాగుతాయని, దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను వెలికి తీయడంలో భారత్‌కు పూర్తిగా సహకరిస్తామని అమెరికా అధికారులు పునరుద్ఘాటించారు.

# మాజీ సిఎంకు కలిసిరాని లక్కీనంబర్..

**అహ్మదాబాద్,జూన్ 13:** అహ్మదాబాద్ నుంచి లండన్ బయలు దేరిన ఏఐ 171 బోయింగ్ విమానం ప్రమాదానికి గురైంది. గాల్లోకి లేచిన 30 సెకన్లకే కుప్పకూలిపోయిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోగా, చనిపోయిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఇక్కడ విషాదకరమైన విషయం ఏంటంటే విజయ్ రూపానీ జీవితంలో లక్కీ నెంబర్.. అన్ లక్కీ నెంబర్‌గా మారింది. లక్కీ నెంబర్ రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. అది కూడా దారుణమైన స్థితిలో మరణించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీకి 1206 నెంబర్ అంటే పిచ్చి. ఆ నెంబర్‌ను తన లక్కీ నెంబర్‌గా భావించేవారు. ఆ నెంబర్‌తో సంబంధం ఉన్న రోజే ముఖ్యమైన కార్యక్రమాలు మొదలుపెట్టేవారు. కార్లకు, బైకులకూ అదే నెంబర్ తీసుకున్నారు. అయితే, ఊహించని విధంగా 1206(12వ తేదీ, 6 నెల) రోజే విమాన ప్రమాదంలో చనిపోయారు. ఆయన లండన్‌లోని తన కుటుంబాన్ని కలుసుకోవడానికి విమానం ఎక్కారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన




విషయం ఏంటంటే రూపానీ విమానంలో కూర్చున్న సీటు నెంబర్ కూడా 12. విమానం ఎక్కిన సమయమూ 12.10. పాపం లక్కీ నెంబర్ ఆయన్ని ప్రమాదం నుంచి కాపాడలేకపోయింది. ఆయన విమానంలో కూర్చుని ఉండగా దిగిన చివరి ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ప్రమాదం జరిగిన ప్రదేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లారు. అక్కడ పర్యటించారు. అనంతరం ప్రమాదంలో గాయపడ్డ వారి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

# బోయింగ్‌ప్రమాదంపై పాక్ అగ్రనేతల సంతాపం

**కరాచి,జూన్ 13:** దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాల్లో ఒకటైనా అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కూలిన ఘటనపై ప్రపంచ దేశాలు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాయి. మన పొరుగున ఉన్న పాకిస్తాన్ కూడా ఈ విషాదకరమైన ఘటనపై స్పందించింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్, పీపీపీ పార్టీ అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపట్ల తాను ఎంతో బాధపడినట్లు వెల్లడించారు. ఈ ఘటనలో తమ వారిని కోల్పోయి దుఃఖిస్తున్న బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ హృదయ విదారక విషాదం వల్ల ప్రభావితం అయిన వారందరి కోసం పాకిస్తాన్ ప్రార్థనలు చేస్తోందని షెహబాజ్ షరీఫ్ తనపోస్టులో వెల్లడించారు. షెహబాజ్ షరీఫ్ సోదరుడు, పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా ఇదే రకమైన సందేశం ఇచ్చారు. ఈ ఘటన మానవత్వానికి అతీతమైనదని అని ట్వీట్ చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన హృదయ విదారక ఎయిరిండియా విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ వినాశకరమైన నష్టం సరిహద్దులను దాటి భారత్, పాకిస్తాన్ ఉమ్మడి మానవత్వాన్ని గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు, మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో జర్దారీ కూడా సానుభూతిని తెలియజేశారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఎయిరిండియా విమానం కూలిపోయిన విషాదకరమైన సంఘటన గురించి వినడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై అంతర్జాతీయంగా ప్రపంచ నాయకులు ప్రాణ నష్టంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటన దృశ్యాలు తమ హృదయాలు కలిచివేసాయని ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# ఎయిర్‌లైన్స్ ఉద్యోగినని నమ్మించి 120సార్లు ఉచిత ప్రయాణం

## చివరకు పోలీసులకు చిక్కిన ఎయిర్‌వేస్ చీటర్

**ఫ్లోరిడా, జూన్ 13:** ఫ్లోరిడాకు చెందిన ఒక వ్యక్తి విమానయాన సంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆరేళ్ల వ్యవధిలో 120సార్లకుపైగా విమాన ప్రయాణాలను ఉచితంగా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిరాన్ అలెగ్జాండర్ అనే ఈ వ్యక్తి, పైలట్ లేదా ఫ్లైట్ అటెండెంట్‌గా నమ్మించి వివిధ ఎయిర్‌లైన్స్‌ను మోసం చేసినట్టు అధికారులు గుర్తించారు. అలెగ్జాండర్ ఏకంగా ఏడు వేర్వేరు విమానయాన సంస్థలలో తాను ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకుని 'నాన్‌రెవ్' అంటే ఉద్యోగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం పద్ధతిలో ప్రయాణించాడు. ఇందుకోసం ఒక ఎయిర్‌లైన్‌కు చెందిన అంతర్గత టికెట్ పోర్టల్‌ను ఉపయోగించి ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకున్నాడు. ఈ మోసపూరిత చర్యలకు పాల్పడేందుకు అలెగ్జాండర్ అసలైన విమానయాన సంస్థల ఉద్యోగుల గుర్తింపు వివరాలను సంపాదించాడు. వారి బ్యాడ్జ్ నంబర్లను కూడా దొంగిలించి తాను ఆయా సంస్థల ఉద్యోగినని నిరూపించుకునే ప్రయత్నం చేశాడు. మొత్తం మీద ఉచిత ప్రయాణాల కోసం అతడు 30వేర్వేరు సెట్ల గుర్తింపు కోడ్స్‌ను ఉపయోగించినట్టు తేలింది. ఈ మోసపూరిత బుకింగ్‌లను అలెగ్జాండర్ ప్రధానంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల ట్రావెల్ పోర్టల్ ద్వారా చేసినట్టు అధికారులు గుర్తించారు. చాలా విమానయాన సంస్థలకు ఇతర సంస్థలతో పరస్పర ఒప్పందాలు ఉంటాయి. దీనివల్ల ఒక సంస్థ ఉద్యోగులు తమ అంతర్గత ట్రావెల్ బుకింగ్ సైట్ ద్వారా ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వారు ఉద్యోగంలో చేరిన తేదీ, బ్యాడ్జ్ నంబర్, వారు పనిచేస్తున్న సంస్థ పేరు వంటి వివరాలను నమోదు చేసి ఉచిత విమాన ప్రయాణాలను పొందాడు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వివరాల ప్రకారం అలెగ్జాండర్ 2018 నుంచి 2024 వరకు ఈ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డాడు. ఇతర క్యారియర్‌ల ఉద్యోగిగా నటిస్తూ అతను స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌లో 34 ట్రిప్పులు చేశాడు. అలెగ్జాండర్ ఫ్లైట్ అటెండెంట్‌గా అబద్ధం చెప్పి 120 కంటే ఎక్కువ ఉచిత విమాన ప్రయాణాలు బుక్ చేసుకున్నాడని కోర్టు పత్రాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు రుజువైతే అలెగ్జాండర్‌కు 20 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు భారీగా జరిమానా విధించే అవకాశం ఉంది.

# ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

## ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** బార్ల దరఖాస్తుదారుల సమక్షంలో ప్రశాంతంగా డ్రా ప్రక్రియ ముగిసిందని, ఈ కార్యక్రమానికి సహకరించిన దరఖాస్తుదారులకు, ఎక్సైజ్ అధికారులందరికీ ధన్యవాదాలు, డ్రాలో గెలుపొందిన లబ్ధిదారులకు కమిషనర్ హరికిరణ్ అభినందనలు తెలిపారు. శనివారం గోల్కొండ నార్సింగ్ ప్రాంతంలో ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో జిహెచ్ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు వచినట్లు చెప్పారు. దరఖాస్తుదారుల సమక్షంలో కమిషనర్ డ్రా తీశారు. డ్రా బాక్స్‌లోని కమిషనర్ కాయిన్స్ తీసి ఇవ్వగా జాయింట్ కమిషనర్ కే ఏ బి శాస్త్రి నెంబర్ దరఖాస్తుదారుల సమక్షంలో వెల్లడించారు. డ్రాలో బార్ షాప్ గెలుపొందిన లబ్ధిదారులు లబ్ధిదారులు అలాట్ మెంట్ లెటర్‌ని తీసుకొని వెళ్లాలన్నారు. 90 రోజుల్లోగా బార్ల ప్రక్రియను పూర్తి చేసుకుని నడిపించుకోవాల్సిందిగా కోరారు. హైదరాబాద్ రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్లు పి. దశరథ్, కే ఏ బి శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ అనిల్ కుమార్ ఒడ్డిలతోపాటు హైదరాబాద్ రంగారెడ్డిలోని అన్ని డివిజన్‌లలో అదికారులకు పేరుపేరునా కమిషనర్ అభినందనలు తెలిపారు. బాక్సులోకాయిన్స్ తీసిన జీవన్‌కిరణ్‌ను కమిషనర్ అభినందించారు. జిహెచ్ఎంసితోపాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్ జాల్‌పల్లి ప్రాంతాల్లో డ్రా ప్రశాంతంగా ముగిసిందని కమిషనర్ వెల్లడించారు. అంతకు ముందు అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళర్పించారు.

# పిసిసి చీఫ్ మహేష్‌తో గనుల శాఖ మంత్రి వివేక్ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ మైనింగ్, లేబర్ మంత్రి గడ్డం వివేక్ శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గడ్డం వివేక్ మంత్రిగా తొలిసారి గాంధీభవన్‌కు రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, ఆయన ఇతర అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ఆయనకు పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నరగంటలకు



ఆయన రాగా అభిమానులు ఆయనకు అభివాదం చేశారు. టిపిసిసిచీఫ్ మహేష్‌కుమార్ వద్దకు వెళ్ళి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుమారు అర్థగంటపాటు వారు ఏకాంతంగా చర్చలు జరిపారు.

# సిపిఐ నారాయణతో మందకృష్ణ మాదిగ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శుక్రవారం ఉదయం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణ .. పద్మశ్రీ అవార్డ్‌ను వరించినందుకు మంద కృష్ణ మాదిగను ప్రత్యేకంగా అభినందించారు. పద్మశ్రీ అవార్డు పట్ల గతంలో భిన్నమైన అభిప్రాయం ఉండేదని.. కానీ పద్మశ్రీ అవార్డును మందకృష్ణకు ఇవ్వడం వల్ల ఆ అవార్డుకే గౌరవం వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని గతంలో మీడియా ముందు కూడా మాట్లాడినట్లు గుర్తు చేశారు. నమ్మిన ఆశయం కోసం, ఎత్తుకున్న ఎజెండా కోసం మూడు దశాబ్దాలపాటు అలుపెరగని పోరాట ఫలితమే ఈ పద్మశ్రీ అవార్డ్ అని నారాయణ కొనియాడారు. సుమారు గంటసేపు ఎస్సీ వర్గీకరణ, చట్టసభల్లో బిసిల రిజర్వేషన్లు, కులగణన మొదలైన అంశాల గురించి ఇరువురు చర్చించారు. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక వాదులపై ఉన్నదని గుర్తు చేసుకున్నారు. చిన్నచిన్న అంశాలను పక్కన పెట్టి, భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూనే విశాల ప్రజా ఆకాంక్షల మేరకు కలిసి పనిచేయాల్సిన అవసరముందని నారాయణ మందకృష్ణ మాదిగతో అన్నారు.




సౌదీ నుంచి తన భర్తను రప్పించాలంటూ సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తున్న అలేఖ్య.

# సౌదీ నుంచి నా భర్తను ఇండియాకు రప్పించండి

## బాధితుడి భార్య సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** ఉపాధికోసం సౌదీ అరేబియాకు వెళ్లిన తన భర్త తో డ్రైవర్ ఉద్యోగానికి బదులు వ్యవసాయ పనులు చేయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని, వెంటనే తన భర్తను ఇండియాకు రప్పించాలంటూ అతని భార్య గుడిసె అలేఖ్య శుక్రవారం సీఎం ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో ఒక వినతి పత్రం అందజేసారు. భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు కు చెందిన గుడిసె యాకూబ్‌ను ఏజెంటు డ్రైవర్ పని ఇప్పిస్తానంటూ నమ్మించి సౌదీలోని దమ్మాంకు పంపించాడని, అయితే అక్కడ తన భర్తతో వ్యవసాయ పనులు చేయిస్తున్నాడని, వెంటనే తన భర్తను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలంటూ ఆమె ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది. తెలంగాణా ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్‌కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డిలకు ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. యాకూబ్‌ను ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని, సరైన తిండి పెట్టడంలేదని ఆమె వివరించారు. వారు ముందుగా చెప్పిన ప్రకారం డ్రైవర్ పని ఇప్పించాలని, లేకుంటే ఇండియాకు తిరిగి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరింది.

# సిజిఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి

## టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి : మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎండోమెంటు డిపార్టుమెంటు అధికారులు ప్రధానంగా ఈ అంశంపైనే దృష్టి పెట్టాల్సిన అనివార్యత ఉందని మంత్రి ఉద్ఘాటించారు. ఈ విషయంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇక ఆషాఢ బోనాలు ఈ దఫా వరంగల్ భద్రాకాళి టెంపుల్‌లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పండగను, సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మన రాష్ట్ర ప్రజలను ధార్మిక చింతన వైపు తీసుకెళ్లడంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీజీఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎండోమెంటు డిపార్టుమెంటు సిజిఎఫ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఈఓలు, ఆ శాఖ ఉన్నతాధికారుల కృషి అనివార్యమన్నారు.

సిజిఎఫ్‌లో భాగంగా, చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సురేఖకు అధికారులు వివరించారు. బడ్జెట్ అనుమతులు, సిజిఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. శుక్రవారం జరిగిన సిజిఎఫ్ సమావేశంలోరూ. 72.47 కోట్ల విలువైన, మొత్తం 297 పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఈఓ పాటించాలన్నారు. సిజిఎఫ్ పనులపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగ సరికాదన్నారు. సిజిఎఫ్ పనుల మీద రెండు రెండుసార్లు పనుల ప్రతిపాదనలు పంపవద్దన్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎస్టిమేషన్స్ ఎంత వేస్తే అంత తమకు పంపకూడదని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సరైన విధంగా అంచనాలు వేయాలన్నారు. జిల్లాలోని 3ప్రధాన ఆలయాలను కలిపి ఒక సర్క్యూట్‌గాప్రణాళికలను రూపొంది వెళ్తున్నామన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర ఉన్న తాధికారులు, ఇఓలు, సిజిఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని సర్వనాశనం చేసిన బిఆర్ఎస్

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆ పార్టీ అవసరం లేదని తేల్చడంతోపాటు తిరస్కరించారని, ప్రజలు తిరస్కరించిన పార్టీపైన వేధింపులకు దిగాల్సిన అవసరం తమకు లేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్‌పి మీడియా హాల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగం సర్వనాశనం అయిందని ఆవేదన చెందారు. బిఆర్ ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కొత్తగా విద్యా రంగం రుజాగ్రస్తం అయినట్లు కాకమ్మ కబుర్లు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరు అవుతారన్నట్లుగా, కెటిఆర్ వెంట తిరిగి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆబద్దాలు నేర్చుకున్నాడని దుయ్యబట్టారు. గురుకులాల కార్యదర్శిగా 8 యేళ్ల పాటు పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యారంగాన్ని ఏం ఉద్ధరించాడని సత్యం ప్రశ్నించారు. మా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోకుండానే విద్యారంగాన్ని ప్రక్షాళనకు ప్రయత్నం చేస్తున్నదని, నాణ్యమైన విద్య అందించే విషయంలో రేవంత్ సర్కార్ చేస్తున్న కృషిని చూసి ఆర్ఎస్ ప్రవీణ్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్తంగా గురుకులాలను ఏర్పాటు చేశారని గురుకులాలకు అద్దె కూడా చెల్లించనప్పుడు కేసీఆర్ ను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు నిలదీయలేదని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోయినా ఆర్ఎస్ మాట్లాడలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖ ను పర్యవేక్షిస్తున్నారు,

కొత్తగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం, బదలీలు, ప్రమోషన్లు ఇచ్చాం ఒక్క యేడాదిలో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది మా ప్రభుత్వం మాత్రమే అని ఆయన అన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచింది మా ప్రభుత్వమే అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ హయాంలో విద్యా రంగం సర్వనాశనం అయిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గానికి ఒక స్కూల్‌లో పథకం ప్రారంభించి చివరకు ఆ నిధులను కూడా పెండింగ్ లో పెట్టి పోయాడని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ను ప్రయోగాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించిందని, రూ. 200తో ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ ను దేశంలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి మా ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నాడని వివరించారు. విద్యారంగంపై గోబెల్స్ ప్రచారం చేయడం కోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను కేసీఆర్, కేటీఆర్ ముందు పెడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సిందే అని అన్నారు,. అమెరికా పర్యటన ను సాకుగా చూపించి గతంలో విచారణకు హాజరు కాలేదని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా దొరికిపోయాడని ప్రకటించారు.

# రేవంత్‌రెడ్డి కక్ష సాధించాలనుకుంటే జైలుకెళ్లేవారు

## బిఆర్ఎస్ నేతలపై పిసిసి ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు చేస్తే ఇప్పటికే కెటిఆర్, కెసిఆర్, హరీశ్‌రావు, కవితలు చర్లపల్లి జైల్లో ఊచలు లెక్కించేవారని, మీ అవినీతిపైపూర్తి విచారణ చేసి మిమ్మల్ని తీహార్ జైలుకు పంపుతారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఇంకోసారి సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మీ ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్‌పై నోరు పారేసుకొంటే ప్రజలు కెసిఆర్ కుటుంబాన్ని తెలంగాణ నుండి తరిమికొడతారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే కెసిఆర్ ను విచారణ కు పిలిచారు. అవినీతి జరిగితే ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా విచారిస్తారు. ప్రాజెక్టుల పేరు మీద మీరు అవినీతి చేసింది నిజం కాదా? ఇప్పుడు మీ ఆస్తులు మూడు లక్షల కోట్లు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో అవినీతి జరిగిందనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారు. ప్రాజెక్టులో చీఫ్ ఇంజనీర్లు, అధికారులను కూడా విచారణ చేశారని గుర్తుచేశారు. తర్వాత ఈటెల రాజేందర్, హరీష్ రావు, కెసిఆర్ ను విచారిస్తే కెటిఆర్ కు ఎందుకు అంత ఇబ్బంది అని ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ తప్పించుకోవాలని చూడొద్దు, తప్పు చేస్తే జైలుకు పోవడం ఖాయం అని ఆయన అన్నారు. అవినీతి చేసి రాష్ట్రం ఆగం అయినా విచారణ చేయొద్దా? ప్రాజెక్టు ఏమైనా మీ అబ్బ సొత్తా కెటిఆర్ అనిఆయన నిలదీశారు. హైదరాబాద్ చుట్టూ 30 వేల ఎకరాలు మీకు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన ప్రశ్నించారు. కేటిఆర్ తాగుబోతోడు, తెలంగాణ ను దోచుకున్నోడు కేసీఆర్ జాతిపిత ఎట్లా అయితడు జాతిపిత కేవలం మహాత్మాగాంధీ మాత్రమే అని ఆయన అన్నారు. టిపిసిసి జనరల్ సెక్రటరీ అవకాశం కల్పించిన మల్లి ఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి లకు నాయకులందరికి అధిష్టానానికి రుణపడి ఉంటా అని గజ్జెల కాంతం అన్నారు.

# 18 నుంచి సిపిజెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

## జూలై 17 తుది గడువు.. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలు

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 దరఖాస్తులను ఈ నెల 18 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి(విసి) ప్రొఫెసర్ ఎం కుమార్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు శాతవాహన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, సిపిజిఈటి-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. పిజి కోర్సులైన ఎంఎ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతోపాటు 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజెట్ పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వ విద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యా లయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. జులై 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో జులై 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మొత్తం 51 సబ్జెక్టులలో 108 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష ఫీజు జనరల్ వారికి రూ. 800 కాగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ. 600గా నిర్ణయించారు. అదనపు సబ్జెక్టుకి రూ. 450 చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది 46,742 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 21,560 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 4వేల సీట్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సుమారు 50వేల సీట్లలో ప్రవేశాలను చేపట్టనున్నారు. త్వరలోనే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి అనుమతి వస్తే అందులో కూడా అడ్మిషన్లను చేపట్టనున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

# బిసి అభ్యర్థులకు సివిల్ సర్వీస్ లాంగ్‌టర్మ్ తరగతులు

## జూలై 25 నుంచి ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సివిల్స్-2026కి ప్రిపేర్ అవుతున్న బిసి అభ్యర్థులకు తెలంగాణ బిసి స్టడి సర్కిల్ అధ్వర్యంలో ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన తరగతులను జులై 25 నుంచి ప్రారంభించనున్నట్టు బిసి స్టడి సర్కిల్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యం సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ తరగతులను ఇవ్వనున్నట్టు డైరక్టర్ తెలిపారు. సివిల్స్-2026 కోసం కోచింగ్ తరగతులు జులై 25 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు టిజి బిసిఐఎస్‌డిటిసి (టిజి బిసి స్టడీ సర్కిల్), లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్‌లో నిర్వహించబడుతుందని సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 150 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని.. వారిలో 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను జులై 12న నిర్వహించే ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరో 50 మంది అభ్యర్థులను, గతంలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వారు సంబందిత పత్రాలతో నేరుగా సైదాబాద్‌లో ఉన్న బిసి స్టడీ సర్కిల్ ఆఫీసులో ఈ నెల 16 నుంచి జులై 8 లోపల దరఖాస్తు చేయాల్సి ఉంటుందని సూచించారు. దరఖాస్తు చేసిన వారిని మాత్రమే ఎంపిక చేయబడుతుందని డైరక్టర్ స్పష్టం చేశారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ. 5000/ స్టయిఫండ్, రూ. 5000/ బుక్ ఫండ్‌ను ఒక్కసారి అందించబడుతుందని.. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరులో సంప్రదించాలని సూచించారు.

# గంధపు చెక్కను తరలిస్తున్న నలుగురు నిందితులు అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా గంధపుచెక్కల అక్రమ రవాణా చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన నల్గురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో పందొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిందని, త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలాన్‌బై పర్ధి (26), షానాజ్ (35), ఇద్దరు మహిళలు నిమత్ (43), మాధురి ఆదివాసి (25)లతో పాటు పరారీలో ఉన్న పలువురు నిందితులు నగరానికి వచ్చి ఇరవై రోజుల క్రితం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ పరిధిలోని గంధపుచెక్కలను అక్రమంగా నరికేసిట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సీసీకెమెరాల ఆధారంగా ఇరవైమూడు మందిని గుర్తించారు. అయితే వీరంతా ఇరవైకుటుంబాలకు చెందిన స్మగ్లర్లు అని, ప్రజలను ఎలాంటి అనుమానాలు రాకుండా కుటుంబంగా ఉంటూ గంధపు చెక్కలను పోలీసుల కంటపడకుండా రాష్ట్రాన్ని దాటి వేయించారని పేర్కొన్నారు.





కమిటీ నియామకాలను రిలీజ్ చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, గాలి వినోద్‌కుమార్, రాజేశ్‌కుమార్ తదితరులు

# నియోజకవర్గాల పునర్విభనను రద్దు చేయాలి

## దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్‌ను చేయాలి

## ఎపిని విభజించిన పార్టీలు యుపిని ఎందుకు విభజించలేవు? గాలి వినోద్‌కుమార్

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజనను రద్దు చేయాలని సౌత్ ఇండియా పొలిటికల్ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక అని కేంద్రం అంటున్నదని, కాని కేంద్రం 5 కోట్లు జనాభా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పార్టీ, బిజెపి విభజించాయని, 25 కోట్ల జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌ను ఎందుకు విభజించలేదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నార్త్ ప్రాంతాలు సౌత్ ప్రాంతాలపై వివక్ష చూపిస్తున్నాయని, శాసిస్తున్నాయని, నార్త్‌లో తెల్లవారు, సౌత్‌లో నల్లవారు అన్న వివక్ష కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. 2028లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సౌత్ ఇండియానే నంబర్-1గా ఉండాలని, నార్త్ ఇండియాను ఓడించి సౌత్ ఇండియాకు చెందిన దళితుడుగాని, బిసిగాని ప్రధానమంత్రి కావాలని ఆయన చెప్పారు. జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా ఆధర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపెద్ద పార్టీలు చిన్నిచిన్న రాజకీయ పార్టీలను దోపిడీ చేస్తున్నాయని, భారతదేశం ఒక్క నార్త్ ఇండియన్స్‌దే కాదని, దేశంలోని 146 కోట్లమంది భారతీయులదని ఆయన స్పష్టం చేశారు. దేశానికి రెండోవ రాజధానిగా హైదరాబాద్‌ను, సుప్రీంకోర్టు బెంచ్ హైదరాబాద్‌లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతూ దేశం ఐక్యంగా ఉండాలని, రాజ్యాంగం ప్రకారం సౌత్ ఇండియన్ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా కన్వీనర్ కరణం రాజేశ్‌కుమార్, ఆమ్‌ఆద్మీపార్టీ డాక్టర్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ లక్ష్మానాయుడు తదితరులు ప్రసంగించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా. చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 185

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 185 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 24 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా. జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# సంస్థాగత నిర్మాణంలోనూ సామాజిక సమతుల్యత

## జూమ్ మీటింగ్‌లో ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్

## గ్రామస్థాయి నుంచి పటిష్టంగా సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో సామాజిక సమతుల్యత పాటిస్తూ పార్టీ కోసం పాటుపడే కార్యకర్తలను గుర్తించి పదవులు ఇస్తామని ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. శుక్రవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన డిసిసి అధ్యక్షులతో, రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని హామి ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని కాపాడుతూ పార్టీ లో ప్రభుత్వంలో పదవుల పంపిణీ చేస్తుందని ఆమె వివరించారు. రాహుల్ గాంధీ గారు సమాజంలో ఎవరి వాటా వారికి ఇవ్వాలన్న సిద్ధాంతంతో పని చేస్తున్నారని ఈ విషయం ప్రజాక్షేత్రంలో బహుళ ప్రచారం చేసి ప్రజాభిప్రాయం ఆయన సిద్ధాంతంకు అనుగుణంగా కూడగట్టాలని ఇదే అణగారిన వర్గాలకు వనరులపై ఆదిపత్యం పొందేందుకు దోహదం చేస్తుందని అప్పుడే దేశంలో పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని ఆమె అన్నారు.

సమాజంలోని అన్ని వర్గాలు, దేశంలోని వివిధ ప్రాంతాలు సంతులిత అభివృద్ధి చేయాలంటే సామాజిక న్యాయం, దేశంలోని ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, శాస్త్రీయచింతన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమసమాజరీతి ప్రజాస్వామికన దేశాన్ని నిర్మించాలనే సిద్ధాంతం ప్రాతిపదికనే పనిచేస్తుందని అందరి కోసం ఒక్కరం ఒక్కరి కోసం అందరం అనే సహకారస్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించేదిశగా పార్టీ సిద్దాంతాలు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల మధ్య విభజన, విద్వేషాలు లేని అఖండ భారత దేశం నిర్మాణంకోసం గ్రామీణ ప్రాంతం నుంచి కాంగ్రెస్ పార్టీ పటిష్ఠంగా సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆవిధంగానే నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని పదవులలో సామాజిక న్యాయాన్ని పాటించాము. పార్టీ కోసం పని చేసిన అందరికి పదవులు వస్తాయని మీనాక్షి హామి ఇచ్చారు.

టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణ లో పెద్దఎత్తున నిర్వహించామని వివరించారు. మనమే అన్ని రాష్ట్రాల కంటే బాగా చేసామని కితాబు ఇచ్చుకున్నారు.

ఎఐసిసి అగ్రనేతలు కూడా తెలంగాణ ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పడం మనకు గర్వకారణం అని చెప్పారు. సంస్థాగత నిర్మాణం కూడా మన రాష్ట్రంలోనే బాగా జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర పరిశీలకులు, కోఆర్డినేటర్లు బాగా పని చేస్తున్నారు. మండల జిల్లా స్థాయి కమిటీల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వస్తున్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పకడ్బందీగా చేయాలని ఆయన సూచించారు. పార్టీ లో చిత్తశుద్ధితో పని చేసిన వారికి అందరిని పార్టీ వారి వారి స్థాయిలలో తప్పకుండా గుర్తిస్తుందని ఆయన తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథం కూడా పాల్గొని సంస్థాగత నిర్మాణంకు సూచనలు అందించారు.




## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి దేశంలో 5వ స్థానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ .జూన్ 13:** దేశంలోని విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠను అంచనా వేసే ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఐఐఆర్ఎఫ్) 2025 సంవత్సరానికి గాను విడుదల చేసిన ర్యాంకుల్లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) మరోసారి తన సత్తా చాటింది. జాతీయ స్థాయిలో ఐదో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా నిలవడమే కాకుండా, దక్షిణాది రాష్ట్రాల పరిధిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ మేరకు ఐఐఆర్ఎఫ్ నివేదిక శుక్రవారం వెల్లడైంది. విద్యా బోధనలో ప్రమాణాలు, విద్యార్థులకు లభిస్తున్న ప్లేస్ మెంట్లు, బోధనా సిబ్బంది నైపుణ్యం, పరిశోధనల నాణ్యత, ఆవిష్కరణలు వంటి కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఐఐఆర్ఎఫ్ ఏటా ఈ ర్యాంకులను ప్రకటిస్తుంటుంది. గత సంవత్సరం కూడా హెచ్‌సీయూ దేశంలోని టాప్ 10 విద్యాసంస్థల జాబితాలో స్థానం దక్కించుకోవడం గమనార్హం. తాజా జాబితాలో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ) దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) మొత్తం ఇండెక్స్ స్కోరు (ఓఐఎస్) 988.93 సాధించింది. అగ్రస్థానంలో నిలిచిన జేఎన్‌యూ 994.89 స్కోరును దక్కించుకుంది. దేశవ్యాప్తంగా 2,500కు పైగా విశ్వవిద్యాలయాల విద్యా ప్రమాణాలను, పనితీరును క్షుణ్ణంగా పరిశీలించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ఈ ర్యాంకులను ఖరారు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## దోస్త్-2025 రెండో విడతలో 43,568 మందికి సీట్ల కేటాయింపు

### 18 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 రెండో విడతలో 43,568 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. దోస్త్-2025లో మూడో విడతలో రూ. 400తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 19 వరకు అవకాశం కల్పించారు. దోస్త్ రెండో విడత సీట్ల కేటాయింపును శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన దోస్త్ రెండో విడత సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటించారు. దోస్త్ రెండో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 35,952 మంది రిజిస్టర్ చేసుకున్నారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు రెండో విడతలో వారు 46,883 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఆప్షన్లు ఇచ్చిన వారిలో 43,568 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 3315 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు. మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 30,973 మందికి.. ద్వితీయ ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 12,595 మందికి సీట్ల కేటాయింపు చేసినట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు. రెండో విడత సీట్ల కేటాయింపులో కామర్స్ విద్యార్థులు 13,900 మందికి కేటాయించారు. తరువాత స్థానంలో లైఫ్ సైన్సెస్ 8821 మందికి, ఫిజికల్ సైన్స్‌లో 11,277 మంది ఉన్నారు. రెండో విడతలో సీటు పొందిన వారు రూ. 500 ..రూ. 1000 ఫీజు చెల్లించి ఈ నెల 18 లోగా సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది.

## డిప్యూటీ సిఎంను కలిసిన నవీన్‌మిట్టల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్13:** విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియామకమైన నవీన్ మిట్టల్ శుక్రవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖామంత్రి భట్టి విక్రమార్క మల్లును మర్యాద పూర్వకంగా కలిశారు.

## థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించిన మహారాష్ట్ర బృందం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** జైపూర్ లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను (ఎస్టీపీపీ) మహారాష్ట్ర బృందం సందర్శించింది. మహారాష్ట్ర న్యాచురల్ గ్యాస్ లిమిటెడ్ (ఎంఎన్‌జీఎల్) బృందం సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్యటించినట్లు ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. జీఎం (ఓ పీ ఎస్) డీఏఎస్ఎన్ రాజు ఆ ధ్వర్యంలో బృందం అధికారులు ఎస్టీపీపీలోని మైన్స్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. థర్మల్ ప్లాంట్‌లో లిక్విడ్ న్యాచురల్ గ్యాస్ వినియోగానికి అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాచురల్ గ్యాస్ వినియోగం ద్వారా కర్బన ఉద్గారాలు తగ్గిపోతో పాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని సభ్యులు పేర్కొన్నారు.

## హైదరాబాద్ మహిళల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

### నగరంలో కూడా స్వయంసహాయక సంఘాలు

### నాలుగు నెలల్లో ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్లకు ఆదేశాలు

**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** నగర మహిళలకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. గ్రేటర్ హైదరాబాద్, శివారు మున్సిపాలిటీల్లో మరిన్ని మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని ద్వారా మహిళలు తక్కువ వడ్డీకే రుణాలు పొంది ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. దీని గురించి స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఇందిరా మహిళా శక్తి భవన్ ద్వారా కొత్త సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ మహిళల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.ఇది ఒకరకంగా వారికి గొప్ప శుభవార్తగానిదేనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గ్రేటర్ హైదరాబాద్, అలాగే నగర శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో మరిన్ని మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు భారీగా సంఖ్యలో ఉన్నాయి. వీటి ద్వారా బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో తక్కువ వడ్డీకే లోన్లు తీసుకుని.. ఎలాంటి ఇబ్బంది లేకుండా నెలవారీగా చెల్లించే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం వడ్డీ మొత్తాన్ని కూడా మాఫీ చేస్తుంటుంది. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా కాపాడటంలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే హైదరాబాద్ నగరంలో మాత్రం ఇవి పెద్దగా లేవు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్, నగర శివారు మున్సిపాలిటీల్లో వీటిని పెద్ద సంఖ్యలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. హైదరాబాద్ నగరంలో కూడా మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు రంగారెడ్డి, మేడ్చల్,హైదరాబాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ సంఘాల్లో చేరేందుకు 18 ఏళ్లు నిండిన యువతుల నుంచి వయసుమీరిన మహిళల వరకూ అందరికి అవకాశం కల్పించాలని తెలిపారు. అంతేకాక సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. కొత్త సంఘాలను స్థాపించాలని తెలిపారు. మరో నాలుగు నెలల్లోనే ఈ సంఘాలు ఏర్పాటు కావాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలు, యువతులు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# హైదరాబాద్‌లో పలుమార్లు జనావాసాల మధ్య కూలిన విమానాలు

## పైలట్లు మరణించినా అధికారుల అప్రమత్తతతో తప్పిన ముప్పు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** అహ్మదాబాద్‌లో బోయింగ్ 787 విమానం జనావాసాల మధ్య కుప్పకూలిన ఘటన దేశ వ్యాప్తంగా పెను విషాదాన్ని నింపగా దేశంలోని పలు నగరాలలో గతంలో పలుసార్లు అనేక విమానాలు అదుపుతప్పి భవనాల మీద కూలడం జరిగాయి. ఇతర నగరాల విషయం అలా వుంచితే హైదరాబాద్‌లో నాలుగుసార్లు ఇటువంటి ఘటనలు జరిగాయి. అయితే నాలుగుసార్లు భవనాలపైన కూలిన విమానాలు ఎయిర్ ఫోర్స్‌కు చెందిన శిక్షణ వి మానాలు కావడం, ఈ దుర్ఘటనల్లో అందులోని పైలట్లు మరణించగా దీనిపై వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక విభాగం విమానంలోని పెట్రోల్ వల్ల మంటలు చెలరేగకుండా ఫోంను చల్లి ముప్పును తప్పించింది. అయితే ఈ నాలుగు ఘటనల్లో ఒకటి బోయిన్‌పల్లిలో మరో మూడు సనత్‌నగర్‌లో జరిగాయి. ఇవే కాకుండా నాగార్జునసాగర్‌లో మరో ప్రైవేటు శిక్షణ విమానం పొలాల్లో కూలగా అందులోని మహిళా పైలట్ మరణించింది. దీంతోపాటు ఎయిర్ ఫోర్స్ శిక్షణ విమానాలు అనేకమార్లు మెదక్, నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలలో పొలాల మధ్య కూలిన ఉదంతాలూ వున్నాయి.

ఇప్పుడంటే శంషాబాద్ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది కానీ 2008కి ముందు తెలంగాణలో ఏకైక విమానాశ్రయం బేగంపేట్ మాత్రమే అనేది ఈ తరం వారికి పెద్దగా తెలియదు. అప్పట్లో విదేశీ, స్వదేశీ విమానాలన్నీ బేగంపేట్ నుంచే రాకపోకలు సాగించేవి. నగరం నడిబొడ్డున అత్యంత రద్దీ ప్రాంతంలో వున్న బేగంపేట్ విమానాశ్రయంలో టేకాఫ్, ల్యాండింగ్‌కు కేవలం ఒకే రన్ వే మాత్రమే అందుబాటులో వుండేది. ఒకవైపు ఫతేనగర్, ఇంకోవైపున బోయిన్‌పల్లి బస్తీలు వున్నాయి. ఫతేనగర్ ప్రాంతంలో గల సనత్‌నగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బేగంపేట్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు ఇబ్బందులు కలిగే వీలుండడం తో వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికీ ఈ ఫ్లై ఓవర్‌పై వీధి దీపాలు లేవు. అప్పట్లో ఈ విమానాశ్రయం దేశంలో రద్దీ విమానాశ్రయాల్లో ఒకటిగా పేరు గడించింది.

ప్రయాణికుల విమానాలతో పాటు త్రివిధ దళాల శిక్షణా విమానాలు ఇక్కడే వుండేవి. ఈ సమయంలోనే వైమానిక దళ అవసరాల కోసం హాకీంపేట్ వద్ద చిన్నపాటి విమానాశ్రయాన్ని నిర్మించారు. ఈ విమానాశ్రయం ఇప్పటికీ వైమానిక దళ అవసరాలను తీరుస్తోంది. ఈ విమానాశ్రయంలో ఒకవైపు హాకీంపేట్ వుండగా ఇంకోవైపు మెదక్‌లోని జిన్నారం వుంది. అయితే బేగంపేట్ విమానాశ్రయంలో విమాన ప్రమాదాలు జరిగిన ఉదంతాలు లేవని చెప్పాలి. కొన్నిసార్లు టే కాఫ్, ల్యాండింగ్ సమస్యలు ఎదురైనా, లైటింగ్ సమస్యలు తలెత్తినా ప్రమాదాలు మాత్రం జరగలేదు. అయితే బేగంపేట్, హాకీంపేట్ విమానాశ్రయాల నుంచి ఎగిరే వైమానిక దళ శిక్షణ విమానాలు కొన్నిసార్లు అదుపుతప్పి సమీపంలోని పంటపొలాల్లో కూలిన ఘటనలు వున్నాయి. ఈ ఘటనల్లో కొన్నిసార్లు పైలట్లు సురక్షితంగా బయటపడగా ఇంకొన్నిసార్లు మరణించారు. అయితే నగరంలోని 2005లో బోయిన్‌పల్లిలో ఒక శిక్షణ విమానం భవనంలోకి దూసుకువచ్చింది.

ఈ విమానం చిన్నది కావడం, అందులో ఇంధనం పెద్దగా లేకపోవడం, అగ్నిమాపక విభాగం వెంటనే స్పందించి ఫోంను చిమ్మడంతో ముప్పు తప్పింది. భవనంలో వున్న వారిని, చుట్టుపక్కన వారిని వెంటనే ఖాళీ చేయించడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఇటువంటి ఘటనలు సనత్‌నగర్ ప్రాంతంలో మూడు జరిగాయి. ఇక్కడ కూడా శిక్షణ విమానాలే భవనాల్లో దూసుకుపోయాయి. ఈ ఘటనల్లో పైలట్లు మరణించగా స్థానికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు. అ గ్నిమాపక శాఖ అప్రమత్తతతో పెద్ద ప్రమాదాలు నివారించబడ్డాయి. అయితే 2008లో శంషాబాద్ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక బేగంపేట్ విమానాశ్రయానికి తాకిడి పూర్తిగా తగ్గింది. ఈ విమానాశ్రయంలో ప్రస్తుతం రక్షణ దళాల విమానాలతో పాటు వివిఐపిల విమానాలు, ప్రైవేటు చార్టెడ్ విమానాలు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి.

12 యేళ్లుగా బేగంపేట్ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగిస్తున్న రక్షణ దళాల విమానాలు సమీపంలోని బస్తీలలో ప్ర మాదాలకు గురికాలేదు. అయితే పంట పొలాల్లో కూలిన ఘటనలు వున్నాయి. ఇక వీటన్నింటికి భిన్నంగా నాగార్జునసాగర్ సమీపంలో పంట పొలాల్లో 2022 ఫిబ్రవరి నెలలో ఓ ప్రై వేటు శిక్షణ విమానం కూలిన ఘటనలో చైనై నగరానికి చెందిన మహిమా గజరాజ్ అనే మహిళా పైలట్ మరణించింది. దీనిపై మృతు రాలి భర్త ప్రైవేటు ఏవియేషన్ అకాడమిపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో శంషాబాద్ విమానాశ్రయం మాత్రమే సాధారణ ప్రయాణీకుల అవసనాలను తీరుస్తోంది. 17 ఏళ్లుగా ఈ విమానాశ్రయం భద్రతకు సంబంధించి అనేకసార్లు అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులను అందుకోవడం గమనార్హం.

# ఇప్పటికీ మించిపోలేదు.. నేను చెప్పినట్లు చేయండి!

## ఇరాన్‌కు ట్రంప్ సీరియస్ వార్నింగ్

**వాషింగ్టన్,జూన్ 13:** ఇరాన్‌తో అణు సమస్యను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఇప్పటికే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా అణు ఒప్పందంపై ఇరాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. దాడులతో విపరీత పరిణామాలే తప్ప సాధించేదేమీ లేదని.. ఇకనైనా అమెరికాతో అణు ఒప్పందంకుదుర్చుకోవాలని హెచ్చరించారు. పరిస్థితి చేయి దాటకముందే తమతో చర్చలు జరపాలని ఇరాన్‌కు ట్రంప్ సూచించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల అనంతరం ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు అవకాశం తర్వాత అవకాశం ఇస్తూ వస్తున్నామని గుర్తుచేశారు. తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని ఎన్నిసార్లు సూచించినా టెహ్రాన్ అంగీకరించలేదని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని అత్యుత్తమ, అత్యంత ప్రాణాంతకమైన సైనిక పరికరాలను అమెరికా తయారు చేస్తోందని, వాటిలో చాలావరకూ ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. వాటిని ఎలా ఉపయోగించాలో కూడా ఇజ్రాయెల్‌కు తెలుసని, ఆ తర్వాత పరిస్థితి తాను ఊహించిన దానికంటే దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌లో ఇప్పటికే చాలామంది ప్రాణాలు కోల్పోయారని, భారీ విధ్వంసం జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మారణహోమం మరింత దారుణంగా మారడానికి కొంత సమయం పడుతుందని, పరిస్థితులు చేయి దాటకముందే ఇరాన్ తమతో అణు ఒప్పందం చేసుకోవాలని సూచించారు.

తాను చెప్పినట్లు చేస్తే ఇక మరణాలు, విధ్వంసాలు ఉండవని తెలిపారు. ఎన్నిసార్లు చెపుతున్నా ఇరాన్‌నేతలు పట్టించుకోకుండా ధైర్యంగా ఉన్నారని, భవిష్య త్తులో ఏంజరుగుతుందో వారికి కూడా తెలియదని తన ట్రూత్‌సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇరాన్‌లో ఇప్పటికే అనేకమంది ప్రాణాలు కెల్పోయారని, భారీ విధ్వంసం జరిగిందన్నారు. ఈ మారణహోమం మరింత దారుణంగా మారేందుకు కొంత వ్యవధి ఉంటుందని, పరిస్థితులు చేయిదాటకముందే ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనిసూచించారు. తాను చెప్పినట్లుచేస్తే మరణాలు, విధ్వంసాలు ఉండబోవని చెప్పారు.

కాగా ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య నెలకొన్న తాజా ఉద్రిక్తతలవల్ల పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది.

ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హుస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బఘేరి కూడా మరణించారు. ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం వెల్లడించారు.



## రాష్ట్రంలో భారీ వర్షాలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో తదుపరి ఐదు రోజులపాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఇప్పటికే దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఆకాశం మబ్బులు కమ్ముకువటంతో అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజా మాబాద్, మెదక్, నల్గొండతో పాటు వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని తెలిపింది.

## కెటిఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే: మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు శుక్రవారం ఎక్స్ వేదికగా ఆరోపించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టుబడులు కూడా వచ్చాయని తెలిపారు.

# హోల్డ్‌లో యువ వికాసం దరఖాస్తులు

### 6.6 లక్షలు తిరస్కరణ

### మరికొంత జాప్యం జరిగే అవకాశం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో యువ వికాసం స్కీమ్‌ను అమలు చేసే ప్రక్రియ మరింత జాప్యం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ యూనిట్లకు వచ్చిన దరఖాస్తులను అధికారులు హోల్డ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. మరోపక్క ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే, అందులో 15.53 లక్షల దరఖాస్తులు వెరిఫై అయ్యాయి.

అయితే, వీటిలో 6.6 లక్షల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని సంక్షేమ శాఖల అధికారులు చెబుతున్నారు. ఈ స్కీమ్‌ను ఈ నెల 2నే తొలి దశ కింద రూ.లక్షలోపు యూనిట్లను మంజూరు చేయాలనుకున్నప్పటికీ అది వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ స్కీమ్‌కు భారీగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అనర్హులను గుర్తించాలని, అప్లికేషన్లను పునఃపరిశీలించాలని సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అప్లికేషన్లను హోల్డ్‌లో పెట్టాలని కలెక్టర్లకు సర్కారు చెప్పినట్లు సమాచారం. దీంతో ఈ స్కీమ్ అమలులో జాప్యం తప్పదని తెలుస్తోంది. యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక బాధ్యత అధికారులదే అని నిబంధన ఉంది. దీని ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికారుల అధీనంలో ఉండాల్సి ఉంది. అయితే, తుది జాబితాకు మంత్రుల ఆమోదం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంతో దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేలు సూచించిన వారినే ఎంపిక చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

స్థానిక ప్రజాప్రతినిధులు సూచించిన అభ్యర్థులే ఎంపిక కావడం వల్ల పథకం అమలుకు సంబంధించిన పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక యువ వికాసానికి రాష్ట్ర వ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయి. బీసీలకు సంబంధించి లక్ష్యం 1.55 లక్షల యూనిట్లు కాగా, దరఖాస్తులు మాత్రం 8.01 లక్షలు వచ్చాయి.

అలాగే ఎస్సీలకు సంబంధించిన లక్ష్యం 1.44 లక్షల యూనిట్లు కాగా, దరఖాస్తులు 3.92 లక్షలు, ఎస్టీల లక్ష్యం 91 వేల యూనిట్లుకు గాను దరఖాస్తులు 1.83 లక్షలు, ఈబీసీల లక్ష్యం 51 వేల యూనిట్లకు దరఖాస్తులు 37 వేలు, క్రైస్తవులకు సంబంధించిన లక్ష్యం 5 వేల యూనిట్లకు గాను దరఖాస్తులు 4,604 వచ్చాయి. మొత్తం 5 లక్షల లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యంతో పాటు, యూనిట్ విలువ తగ్గించుకోవాలని చెప్పినా స్పందన రాలేదు. ఇప్పటికే వ్యాపారంలో ఉన్నవారు విస్తరణ కోసం దరఖాస్తు చేయగా, నిబంధనలు వర్తించక పోవడంతో తిరస్కరణలు

## పోషకాహార లోపంతో రాష్ట్రంలో బలహీనంగా బాల్యం


**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బాల్యం పిల్లలు బలహీనమవుతున్నారు. పిల్లలకు సరైన పోషకాహారం అందకపోవడం శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఇవి సరిగ్గా లేక చాలా మంది చిన్నారులు బక్కచిక్కిపోతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తాజాగా ఒక సర్వే నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా వయసుకు తగిన ఎత్తులేని చిన్నారులు 17.04 శాతం ఉన్నట్లు వెల్లడైంది. రాష్ట్రంలో 35,700 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, వీటి ఆధారంగా 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 10.15 లక్షల మంది ఉన్నారు. వీరికి రోజూ పోషకాహారం కోసం రూ.9.68 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. టేక్ హోం రేషన్ కింద నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం ప్యాకెట్లు అందిస్తోంది. 36 ఏళ్లలోపు చిన్నారులు 8,69,089 మంది ఉన్నారు. వీరికి రోజుకు రూ.11.50 చొప్పున ఖర్చు చేస్తోంది. ఒకపూట పూర్తి భోజనంతో పాటు స్నాక్స్ ఇస్తోంది. దీనితో పాటు రోజుకో గుడ్డు చొప్పున నెలకు 30 ఉడకబెట్టిన కోడి గుడ్లను ఇస్తోంది. ఈ నెల 2వ తేదీ వరకు నమోదైన గణాంకాల ప్రకారం మొత్తం 35,700 అంగన్వాడీల్లో 12,466లో మాత్రమే చిన్నారులు తగిన ఎత్తు, బరువు ఉన్నారు. మిగిలిన 23,234 కేంద్రాల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలున్నట్టు తేలింది.

# భౌరంపేటలో హైడ్రా కూల్చివేతలు

### అడ్డుకునేందుకు యత్నం..

### స్వల్ప ఉద్రిక్తత

**హైదరాబాద్ (దుండిగల్), జూన్ 13, ప్రభాతవార్త:** రోడ్డు ఆక్రమణను తొలగించేందుకు వచ్చిన హైడ్రా అధికారులను కొందరూ స్థానికులు అడ్డుకునేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇది మా స్థలం మీరు ఏలా కూల్చివేతలు చేపడుతారంటూ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు వారిని చెదరగొట్టడంతో కూల్చివేతలు జరిపారు. వివరాల్లోకి వెళితే..భౌరంపేటలోని ఓ రియల్ వ్యాపారి డాలర్‌డ్రీమ్ పేరుతో వెంచర్ చేశారు. లేవుట్‌లోని ఎమ్యూనిటీస్‌ను కల్పిస్తూ ప్లాట్‌నంబర్ 10ఏ ను మున్సిపల్‌కు గిఫ్ట్‌డీడ్ చేశారు. అయితే ఆస్థలం మాది అంటూ కొందరూ గ్రామస్థులు ఇక్కడి నుండి రోడ్డు లేదంటూ అడ్డంగా గోడను నిర్మించారు. రోడ్డు ఆక్రమణ తగాదా గత కొంతకాలంగా నడుస్తున్న పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో కాలనీవాసి హైడ్రాను ఆశ్రయించి రోడ్డు ఆక్రమణను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలంటూ ఫిర్యాదు చేశారు. దీంతో సదరు స్థలాన్ని సందర్శించిన హైడ్రా బృందం కాలనీ లేఅవుట్, గిఫ్ట్‌డీడ్‌లు అన్ని పరిశీలించి సదరు స్థలం మున్సిపాలిటీదే అని నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం హైడ్రా అధికారులు తమ బృందంతో కలిసి కాలనీకి చేరుకొని జెసిబి సహాయంతో అడ్డుగోడను తొలగించడం ప్రారంభించారు. ఇంతలో అక్కడి చేరుకున్న గ్రామస్థులు ఇది మాస్థలం మీరు ఏలా కూల్చివేతలు చేపడుతారంటూ అధికారులతో వాగ్వి వాదానికి దిగి అడ్డుకునేందుకు యత్నించడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో దుండిగల్ పోలీసులు వారిని చెదరగొట్టడంతో కూల్చివేతలు పూర్తి చేశారు. రోడ్డు ఆక్రమణను తొలగించి తమ ఇబ్బందులను పరిష్కరించిన హైడ్రా అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.




జెసిబితో అడ్డుగోడను తొలగిస్తున్న హైడ్రా బృందం

**మల్లంపేటలో వరదనీరు వెళ్లేలా చర్యలు..**

వరద నీరు ఇండ్లలోకి చేరి ఇబ్బందులు పడుతున్నామని మల్లంపేటకు చెందిన పలువురు నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సదరు ప్రాంతాన్ని సందర్శించి సమస్యను గుర్తించారు. ఇరిగేషన్ అధికారుల నుండి వివరాలు తీసుకోగా చెన్నచెరువు నుండి రేళ్ళ చెరువులోకి వెళ్లే గొలుసుకట్టు నాలా కనుమరుగైనట్లు ప్రాథమిక నిర్ధారణ వచ్చారు. పూర్తి స్థాయిలో నాలాను పునరుద్ధరించేందుకు ప్రస్తుతం పరిస్థితులు అనుకూలించే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నయ చర్యలకు పూనుకున్నారు. వరద నీరు ఇండ్లలోకి వెళ్ళకుండా ఒక కాలువను తవ్వారు. దాని గుండా వరద నీరు కిందికి వెళ్లేలా చేయడంతో సుమారు 15 కుటుంబాలకు వరద నీటి సమస్య తొలగింది. త్వరలోనే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులను పేర్కొన్నారు.

## మాకూ మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇచ్చారు

### సిఎం రేవంత్‌రెడ్డికి మాదిగ ఎమ్మెల్యేల థ్యాంక్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** మంత్రివర్గంలో తమ సామాజిక వర్గానికి చోటు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ మాదిగ ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ ఎమ్మెల్యేలు సిఎంతో భేటి అయ్యారు.. ఈ సందర్భంగా రేవంత్‌ను దుశ్శాలువతో సత్కరించారు..కాగా. ఇటీవల జరిగిన కేబినెట్ విస్తరణలో మాదిగ సామాజికి వర్గానికి చెందిన అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం దక్కింది. ఆయనకు ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనార్టీ సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ లు, ట్రాన్స్ జెండర్స్ శాఖలను అప్పగించారు దీంతో అడ్లూరి లక్ష్మణ్ సహా పలువురు మాదిగ సామాజిక ఎమ్మెల్యేలు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్యతో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పెండిపాకల రిజర్వాయర్‌కు రూ.20 కోట్లు విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్(ఎఎమ్మార్ఎస్ఎల్‌బిసి) ప్రాజెక్టులో భాగంగా పెండిపాకల రిజర్వాయర్ పనులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2007.43లక్షల మంజూరు చేసింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జ ఉత్తర్వులు జారీచేశారు. నల్లగొండ జిల్లా పరిధిలోని అక్కంపల్లి గ్రామం పంచాయతీ పరిధిలో పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయి. పనులు ఆగకుండా కొనసాగేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

# గోపీచంద్ బర్త్ డే గ్లింప్స్ రిలీజ్

**మాచో స్టార్** గోపీచంద్ ప్రస్తుతం తన కొత్త చిత్రం గోపీచంద్33లో నటిస్తున్నారు. విజనరీ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ హిస్టారికల్ ఎపిక్ షూటింగ్ జరుగుతోంది.గోపీచంద్ పుట్టినరోజును పురస్కరించుకుని, మేకర్స్ అద్భుతమైన పోస్టర్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. గోపీచంద్ లుక్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఒక యోధుడిగా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. పొడవాటి జుట్టు, యుద్ధగాయాలు, నుదిటిపై వీర తిలకంతో కనిపించిన ఇంటెన్స్ లుక్ ఫ్యాన్స్‌ను సర్ ప్రైజ్ చేసింది. చేతిలో ఖడ్గంతో యుద్ధరంగంలో కనిపించిన ఈ పోస్టర్ శక్తి, శౌర్యాన్ని ప్రజెంట్ చేస్తోంది. మంచుతో కప్పబడిన అద్భుతమైన పర్వత శ్రేణుల నడుమ గ్లింప్స్ ప్రారంభమవుతుంది. ఓ యోధుడు తన టెంట్ నుంచి బయటకు వస్తాడు. తాను ప్రేమగా పెంచిన గుర్రంతో మమేకమయ్యే విజువల్ లో తన తలను గుర్రం తలపై ఆనిస్తూ, మౌనంగా ఓ వాగ్దానాన్ని చేస్తాడు. దీనికి బ్యాక్గ్రౌండ్‌లో"ధీర ధీర" సంగీతం మ్యాజికల్ అనుభూతిని కలిగిస్తుంది. ఈ విజువల్స్ మనసును తాకుతూనే పవర్‌ఫుల్‌గా, పీస్ మెడిటేటివ్ ఫీల్‌ను ఇస్తున్నాయి. ఐబి 71 (ఆకాశంలో), ఘాజి (నీటిలో), అంతరిక్షం (అంతరిక్షంలో) వంటి విభిన్న కథనాల చిత్రాలతో తన ప్రత్యేక కథనశైలి, సాంకేతిక నైపుణ్యంతో గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి, ఇప్పుడు మరో డిఫరెంట్ జానర్‌లోకి అడుగు పెట్టారు. సంకల్ప్ రెడ్డి ఈ సినిమాలో భారతదేశ చరిత్రలో మరిచిపోయిన ఒక కీలక ఘట్టాన్ని అద్భుతంగా మలిచారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, మరిచిపోయిన అధ్యాయానికి మళ్లీ జీవంపోస్తోంది. గోపిచంద్ ఈ సినిమాలో ఇప్పటివరకు ఎప్పుడూ చూడనివంటి విభిన్న పాత్రలో కనిపించనున్నారు. ఈ ఏప్రిల్‌లో కాశ్మీర్ అందమైన లొకేషన్లలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయ్యింది. ఆ అద్భుత దృశ్యాలు బిగ్ స్క్రీన్‌పై గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రూపొందించిన సెట్లో నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించి ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



తారాగణం: గోపీచంద్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి నిర్మాత: శ్రీనివాసా చిట్టూరి, బ్యానర్: శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్, సమర్పణ: పవన్ కుమార్ పీఆర్వో: వంశీశేఖర్ మార్కెటింగ్: విష్ణు తేజ్ పుట్ట.

# 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను విజయవంతం చేయాలి: దిల్‌రాజు

కొంత విరామం తరువాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సాహించే సంప్రదాయ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు వాటిలో నటించి ఉత్తమ ప్రతిభను చూపిన నటీనటులకు, సాంకేతిక నిపుణులతో పాటు 2014 జూన్ నుండి 2024 డిసెంబర్ 31 వరకు సెన్సారు జరుపుకున్న చిత్రాల్లో కూడా ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ఇందులో భాగంగా అవార్డ్స్ ఇవ్వనున్నారు. ఇటీవల విజేతల జాబితాను కూడా ప్రటించారు. కాగా అపూర్వ వేడుక కోసం హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. జూన్ 14న అంగరంగ వైభవంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. దాదాపు కొంత విరామం తరువాత ప్రభుత్వ అందిస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డులు అందుకోవడం పట్ల అవార్డుల విజేతలు, తెలుగు సినిమా ప్రముఖులు, తెలుగు సినిమా ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రతిభను గుర్తించి తగు రీతిలో సత్కరించబోతున్న తెలంగాణ ప్రభుత్వం మీద ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ఈ వేడుకను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, అత్యంత ఘనంగా జరిపించడానికి తగు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు తెలుగు తారాలోకమంతా తరలి రాబోతున్నారు. తప్పకుండా జూన్ 14న హైటెక్స్ వేదిక తారళ తళుకులతో ప్రకాశవంతం కాబోతుంది. కాగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఈ నెల 14న హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దరు అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది. 14 సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలసిన బాధ్యత సినీ పరిశ్రమపై కూడా ఉంది. ఆ రోజు కార్యక్రమానికి ఐ అండ్ పీఆర్ ద్వారా లైవ్ ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఈవెంట్ అందరికి రీచ్ అవ్వాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సాయంత్రం ఆరు గంటలకు ఈ వేడుక ప్రారంభం కానుంది. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాల్లో ప్రతి ఏడాది నుంచి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి వాటికి ఈ వేడుకలో అవార్డులు అందిస్తున్నాం. ప్రతి సంవత్సరానికి సంబంధించి ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలకు పనిచేసిన హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు అందిస్తున్నాం. ఇలాంటి ఓ మంచి సాంప్రదాయాన్ని గద్దర్ ఫిల్మ్ అవార్డులతో ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ సాంకేతిక నిపుణులకు కూడా అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే. 14 సంవత్సరాల తరువాత జరుగుతున్న ఈ వేడుకను తెలుగు సినీ పరిశ్రమలోని అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.



# 'డ్యూడ్' 80శాతం షూటింగ్ పూర్తి

మల్టీ టాలెంటెడ్ తేజ్ నటిస్తూ కన్నడ తెలుగు మలయాళ భాషల్లో దర్శకత్వం వహిస్తున్న త్రిభాషా చిత్రం డ్యూడ్. ఫుట్ బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే ఈ చిత్రాన్ని ఫుట్ బాల్ ప్రేమికుడైన స్వర్గీయ కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ కు అంకితం చేస్తున్నారు. 80శాతం షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న డ్యూడ్ చిత్రం టీజర్ త్వరలో విడుదల చేయనున్నారు. హీరో కమ్ డైరెక్టర్ తేజ్ మాట్లాడుతూ, హీరోగా, డైరెక్టర్‌గా డ్యూడ్ చిత్రం ఔట్ ఫుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. రష్ చూసుకుంటుంటేనే చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. ఎప్పుడెప్పుడు ఆడియన్స్‌తో కలిసి థియేటర్స్‌లో సినిమా చూసుకుంటామా అని చాలా ఆత్రంగా ఉంది. సినిమా ఇంత బాగా రావడానికి కారకులైన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. త్వరలో టీజర్ రిలీజ్ చేసి, అప్పటి నుంచి ప్రచార కార్యమాలు ముమ్మరం చేస్తాం అని అన్నారు. రంగాయన రఘు ఫుట్ బాల్ కోచ్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఇదే ఏడాదిలో విడుదల చేసేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఏక కాలంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న రాఘవేంద్ర రాజ్ కుమార్, ఈ చిత్రానికి స్క్రిప్ట్ కన్సల్టెంట్‌గా కూడా వ్యవహరించడం విశేషం.



# 'హార్ట్ బీట్'తో యోగలక్ష్మి పాపులర్

అందానికి మరింత అందాన్ని తెచ్చేవి.. ఆకర్షణకి మరింత ఆకర్షణ పెంచేవి కళ్లే.. అందమైన కళ్లు మాట్లాడతాయి.. పాటలు పాడతాయి.. పాఠాలు కూడా చెబుతాయి. ఆ మాటకొస్తే మాటల్లో చెప్పలేని భావాలను ఆవిష్కరించే అందమైన వాకిళ్లు కళ్లు. తళుక్కుమని మెరిసే కనుల నుంచి కరెంటు పుడుతుందనే విషయం కుర్రాళ్లందరికీ తెలుసు. అలాంటి కళ్లున్న అమ్మాయి కనిపిస్తే, కలలు కనని కళ్లు ఉండవు. అలా ఇప్పుడు కలల్లో తేలిపోతున్న కుర్రాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. ఎప్పటి నుంచి అంటే, టూరిస్ట్ ఫ్యామిలీ సినిమాలో యోగలక్ష్మిని చూసినప్పటి నుంచి అనే చెప్పాలి. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ రాఘవన్ కూతురు కురల్ పాత్రలో ఆమె కనిపిస్తుంది. కథానాయకుడు ధర్మదాస్ పెద్ద కొడుకుతో ప్రేమలో పడుతుంది. ఈ పాత్రలో యోగలక్ష్మి కనిపించింది అక్కడక్కడే అయినా, ఆకర్షణీయమైన కళ్లతో.. పదునైనచూపులతో విన్యాసాలు చేసింది. దాంతో అసలు ఈ అమ్మాయి ఎవరూ అనేది తెలుసుకోవడానికి కుర్రాళ్లంతా సెర్చ్ చేయడంలో పడ్డారు. తమిళనాడుకు చెందిన యోగలక్ష్మి ఇంతకుముందు షార్ట్ ఫిలిమ్స్ చేసింది.. వెబ్ సిరీస్‌లు చేసింది. అయితే ఇటీవల హాట్ స్టార్‌కి వచ్చిన హార్ట్ బీట్‌తో ఆమె చాలామంది కళ్లలో పడింది. ఈ సిరీస్‌లో ఆమె నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను చేసినప్పటికి, మంచి మార్కులు కొట్టేసింది. అందుకు కారణం నేరేడుపండ్ల లాంటి ఆమె కళ్లు.. అవి సంధించిన చురుకైన చూపులే అని చెప్పాలి. టూరిస్ట్ ఫ్యామిలీతో ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్న ఈ బ్యూటీ, ఇకపై సినిమాలలో మరింత బిజీ అయ్యే ఛాన్స్ లేకపోలేదు.



# 'మార్గన్' మూవీ తెలుగులో విడుదల

హీరోగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, పాటల రచయితగా, ఎడిటర్‌గా ఇలా మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోని ఎప్పుడూ ఆడియెన్స్‌ను కొత్త పాయింట్‌తో ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. ఆయన నటిస్తూ, నిర్మించిన నూతన చిత్రం మార్గన్. లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. మర్డర్ మిస్టరీక్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీని జూన్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. మళ్లీ విజయ్ ఆంటోని ఓ డిఫరెంట్ కాన్సెప్ట్, కొత్త పాయింట్‌ను టచ్ చేశారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. ఇక ఇలాంటి కొత్త కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాల్ని అందించడంలో సురేష్ ప్రొడక్షన్స్ ముందుంటుందన్న సంగతి తెలిసిందే. మార్గన్ మీదున్న నమ్మకంతో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ సురేష్‌బాబు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. జూన్ 27న ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు హీరో, నిర్మాత విజయ్ ఆంటోని సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# 'గేదెలరాజు కాకినాడ తాలూకా' ఫస్ట్‌లుక్

చూస్తే ఒకటే నిజం చూడకపోతే వంద అనుమానాలు అనే ఒక నిజాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు చిత్రయూనిట్. శుక్రవారం రఘు జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదలచేశారు. ఫస్ట్‌లుక్‌లో ఎంతో ఫెరోసియస్‌గా కనిపిస్తున్నారాయన. మోటూరి టాకీస్ పతా కంపై రఘుకుంచే సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. రవిఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మోనిక తదితరులు నటించారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు- రవిఆనంద్ చిన్నిబిల్లి, తాడాల వీరభద్రరావు, గీతార్థ్ కుంచే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- కిరణ్ తాతపూడి , దివ్య మోటూరి పబ్లిసిటి డిజైనర్- ఏజే ఆర్ట్స్ అజయ్, వీఎఫ్ఎక్స్- కొత్తపల్లి సునీల్, లిరిక్స్- గిరిధర్ రాగోలు, లలిత కాంతారావు ఎడిటర్- సుధీర్ ఎడ్ల, కాస్ట్యూమ్ డిజైనర్- సింధూ ధిలీషా, పిఆర్ఓ- శివ మల్లాల, మూర్తి మల్లాల ఆర్ట్- అమర్ తలారి, చీఫ్ అసోసియేట్ గౌరి శంకర్ కో డైరెక్టర్- శేఖర్ కుంపట్ల, సంగీతం- రఘు కుంచే, నిర్మాత- వాణి రవికుమార్ మోటూరి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం-చైతన్య మోటూరి.



# లేటెస్ట్ ఫొటో షూట్‌లో 'మాళవిక మోహనన్'

ఇటీవల కాలంలో సెలబ్రిటీలు సోషల్ మీడియాను ఓ సాధనంగా వాడుతున్నారనే విషయం తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఈజీగా రీచ్ కావొచ్చనే అభిప్రాయం చాలామంది సెలబ్రిటీల్లో నెలకొంది. అయితే కొంతమంది సెలబ్రిటీలు ఈ సోషల్ మీడియా ద్వారా తమ టాలెంట్‌ను బయటపెడుతున్నారు. స్టార్ హీరోయిన్లు సైతం సోషల్ మీడియా గట్టిగానే వాడుతున్నారు. సరిగ్గా ఇప్పుడు ఇదే పని చేస్తోంది హీరోయిన్ మాళవిక మోహనన్. తమిళ ఇండస్ట్రీలో మాళవిక మోహనన్ ఇప్పుడు స్టార్ హీరోయిన్. ఆమె ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహనన్ కుమార్తె. ఆమె 1993 ఆగస్టు 4న కేరళలోని పయ్యనూరులో జన్మించింది.మాళవిక మోహనన్ 2013లో మలయాళ చిత్రం పట్టం పోల్ ద్వారా సినీ ఎంట్రీ ఇచ్చింది. తమిళంతో పాటు, మలయాళం, తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఆ తర్వాత ఆమె ది గ్రేట్ ఫాదర్,పేట్ట, మాస్టర్ వంటి విజయ వంతమైన చిత్రాలలో నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆమె తన నటనకు గాను అనేక అవార్డులను అందుకుంది. మాళవిక మోహనన్ తెలుగులో హీరో అనే చిత్రంలో నటించింది. ఆమె ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాడీలక్స్ సినిమాలో కూడా నటిస్తోంది. మాళవిక మోహనన్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది.



# సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో 'వైల్డ్ బ్రీత్'

కంటెంట్ బాగుంటే చిన్న చిత్రాలు కూడా మంచి సక్సెస్ అందుకుంటాయని, హీరోలు అవసరం లేదని అన్నారు ప్రముఖ నటుడు శివాజీ రాజా. రేవు వంటి మంచి మూవీని నిర్మించిన ప్రొడక్షన్ హౌస్ సంహిత్ ఎంటర్ టైన్ మెంట్స్ లో మరో ఇంట్రెస్టింగ్ మూవీ వైల్డ్ బ్రీత్‌ను యంగ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. డా.మురళీ చంద్ గింజుపల్లితో కలిసి పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలించాంబర్‌లో జరిగినకార్యక్రమంలో ప్రముఖ నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలుతుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ అతిథులుగా హాజర య్యారు. పలువురు పాత్రికేయ మిత్రుల సమక్షంలో వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ, నాకు ఎంతో సన్నిహితులైన మీడియా మిత్రులు ఉన్నారు. నేను కెరీర్ ప్రారంభం నుంచీ వారితో స్నేహం చేస్తున్నా. అలాంటి మీడియా మిత్రుల్లో ఒకరైన పర్వతనేని రాంబాబు నిర్మాతగా వైల్డ్ బ్రీత్ సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ మధ్య కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలెన్నో విజయాలు సాధిస్తున్నాయి. వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా బాగున్నాయి. పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఆయన నిర్మాతగా ఎన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా. అలాగే దర్శకుడు హరినాథ్ పులి మంచి పేరు తెచ్చుకోవాలి. స్టార్స్ వెంట పడటం కాదు కథ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు అన్నారు. నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన పుట్టినరోజున ఈ వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మన మీడియా ఫ్రెండ్స్‌లో బీఏ రాజు నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నారు.





# సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక దుస్తులు



ఓ చిన్న ఆలోచన మన గమనాన్నీ, గమ్యాన్నీ మార్చేస్తుందంటారు. అలా... అమ్మ పడే ఇబ్బందిలోంచి పుట్టిన ఓ ఆలోచనే కాంచన్ గుప్తాను వ్యాపారం వైపు అడుగులు వేసేలా చేసింది. సీనియర్ సిటిలు, కదల్లేని స్థితిలో ఉన్నవారి కోసం ప్రత్యేక దుస్తులజన్ బ్రాండ్ తీసుకొచ్చింది. 'ఫ్యాషన్ దుస్తులంటే అందం మాత్రమే కాదు. ప్రత్యేక అవసరాలున్న వారికి అవి సౌకర్యాలు, స్వేచ్ఛనీ అందించా లని ఢిల్లీకి చెందిన కాంచన్. అదే ఫ్యాషన్ రంగంలో వారికి ప్రత్యేకించింది. అప్పుడు మా అమ్మకి క్యాన్సర్ నాలుగో దశ. ఇంజెక్షన్ల వల్ల చేతులు వాచెవి. అసలు పట్టు కోనిచ్చేదికాదు. దాంతో దుస్తులు మార్చుకోలేని పరిస్థితి. తన అవసరాలకు తగినట్లు దుస్తులు ఉంటాయేమోనని బయట స్టోర్లలో, ఆన్‌లైన్‌లో ఎక్కడ వెతికినా దొరికింది. విదేశాల నుంచి ఆర్డర్ చేసినా, రావడానికి నెలలకొద్దీ సమయం పడుతుంది. కానీ, అమ్మ అన్ని రోజులు బతకదు. దాంతో సొంతంగా నేనే తయారుచేద్దామని, కావాల్సిన మెటీరియల్లు సిద్ధం చేసుకున్నా. కానీ, పూర్తయ్యేలోపే అమ్మ మరణించింది. చివరిదశలో అమ్మకు దుస్తులు అందించలేకపోయానన్న బాధ నాలో ఉండిపోయింది. అదే కదల్లేని స్థితిలో ఉన్న వారికోసం ఆలోచించేలా చేసింది అంటారు కాంచన్.

అభిప్రాయాలు, సూచనలు అందాయి. వాళ్ల అవసరాలకు తగినట్లు మార్పుల చేర్పులూ చేసింది. ఇదే కాంచన్ విజయంలో కీలకమైంది. 'వయసు పెరగడమంటే..ఓ వ్యాధి కాదు. అది కాలంతోపాటు శరీరంలో వచ్చే మార్పు. అప్పుడు వారి అవసరాలకు తగిన దుస్తులు ఏంచుకునే అవకాశం ఉండాలి' అనే కాంచన్... ఎస్సీఎఫ్ఐ ఏజ్ ఫ్రెండ్లీ భారత్ ఫౌండేషన్ స్థాపించి, సీనియర్ సిటిజన్లకు వారి ఆరోగ్యం, హక్కులపై అవగాహన కల్పిస్తోంది. ఇవేకాకుండా అనేక ఇతర విషయాలపైనా వెబినార్లు కొనసాగు తున్నాయి. ప్రారంభించిన కొద్దినెలల్లోనే రూ.50 లక్షల అమ్మకాలు సాధించింది. ప్రేమ, బాధ... ఈ రెండింటి నుంచి పుట్టుకొచ్చిన పరిష్కారం విజయవంతం కాకుండా ఉంటుందా మరి!

# దివ్యాంగులకు మెరుగైన చికిత్స..

**కాంట్రాక్ట్ ఉద్యోగాలు... అయితేనేం ఉద్యోగానికి వందశాతం న్యాయం చేయాలనుకున్నారు... బాసాన ఉమాదేవి, గొట్టిముక్కల అనుపమ రాజకుమారి. ఆ ఆలోచనే అభంశుభం తెలియని దివ్యాంగులకు మెరుగైన చికిత్స అందేలా చేసింది. వీళ్లెవరు? ఏం చేస్తున్నారంటే?**


ఉమ, అనుపమ

ఆటిజం, సెరిబ్రల్‌పాల్సీ ఉన్న పిల్లల్ని సరైన దశలో గుర్తించి... చికిత్స ఇస్తే సమస్య నుంచి కొంత బయటపడొచ్చు. కనీసం వాళ్ల నిత్యకృత్యాలు చేసుకునేలానైనా శిక్షణ ఇవ్వొచ్చు. ఇందుకు దేశవ్యాప్తంగా చాలా కేంద్రాలు ఉన్నాయి. అవన్నీ ఖర్చుతో కూడుకున్నవి. ప్రభుత్వం 'సమగ్ర శిక్ష' కార్యక్రమం ఆధ్వర్యంలో భవిత కేంద్రాలను నిర్వహిస్తోంది. కానీ తల్లిదండ్రుల్లో అవగాహన కొరవడి... పిల్లల్ని ఇంటికే పరిమితం చేస్తున్నారు. అలాంటి వారందరికి మా కేంద్రం గురించి అవగాహన కల్పించాలనుకున్నాం. గాజువాకలోని వడ్లపూడిలో ఉంది. రోజూ 32 మంది పిల్లలు చికిత్స కోసం ఇక్కడికి వచ్చేవాళ్లు. వారందరికీ కావాల్సిన సౌకర్యాలు ఇక్కడ లేవు. అందుకే ముందు ఈ సమస్యను పరిష్కరించా లనుకున్నాం. అంటారు. ఉమాదేవి. పదేళ్లుగా ఇదే కేంద్రం ఐఆర్పి(ఇనూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)గా పనిచేస్తున్నారు:



**అక్కడే తెలుసుకున్నా....**

అక్కడే తెలుసుకున్నా... 'మేం ముగ్గురం అక్క చెల్లెళ్లం. పెద్ద అక్క కూడా ఇదే రంగంలో ఉన్నారు. దాంతో ఇంటర్‌ప్పటి నుంచి నుంచీ నేనూ ఇలాంటి ఎన్జీఓలతో కలిసి పని చేయడం మొదలుపెట్టా. ఈ సబ్జెక్టులోనే ఏ బీడీ పూర్తిచేశా. విశాఖలోని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే ఇదే తరహా స్కూల్లో 20ఏళ్లు పనిచేశా. అక్కడకు విదేశాల నుంచి నిపుణులు వచ్చేవారు. వారు అనుసరించే పలు చికిత్సల గురించి చెప్పేవారు. శాండ్, హైడ్రో థెరపీలు అక్కడ నేర్చుకున్నవే. వీటివల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. తరువాత 'సమగ్ర శిక్షలో అవకాశం ఉందని తెలుసుకుని గాజువాక వచ్చాను. ఇక్కడ కూడా ఈ చికిత్సలను ప్రారంభించాలను కున్నా. ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆఫీసర్‌కి అదే విషయాన్ని చెప్పా. నిధుల కొరత వల్ల సమయం పడుతుందన్నారు. దాతల సహాయంతో ముందుకెళ్లాలనుకున్నాం. స్పందన చేయూత ఫౌండేషన్ సహాయం కోరాం. వీళ్లు అప్పుడప్పుడూ వచ్చి, సేవాకార్య క్రమాలు చేసి వెళుతుండేవారు. పరిస్థితిని అర్థం చేసుకుని, వాళ్లే కొన్ని ఫౌండేషన్లు, దాతల సహాయం తీసుకుని... రూ.18 లక్షలతో అదనపు భవనం, థెరపీకి అవసరమైన నిర్మాణాలను కట్టించి ఇచ్చారనే ఉమాదేవి ఇంతటితో ఆగిపోలేదు. తోటి ఉద్యోగిని అనుపమా రాజకుమారితో కలిసి... చుట్టుపక్కల కంపెనీల సాయంతో కేంద్రానికి కావాల్సిన సౌకర్యాలన్నీ సమకూరుస్తున్నారు. అంతేకాదు, ఇక్కడికి వచ్చే తల్లులు ఖాళీగా ఉండకూడదని... కుట్టుమెషీన్లు ఏర్పాటుచేసి టైలరింగ్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రస్తుతం వడ్లపూడి భవిత వైద్య చికిత్సకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. వీళ్లిస్తోన్న థెరపీల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. □

## మొక్కలకు బేకింగ్ సోడా!

ఇంటి బాల్కనీల్లోనూ, వరండాల్లోనూ మొక్కలను పెంచేటప్పుడు సేంద్రియ మందులూ, కీటకనాశినిలకోసం చూస్తుంటాం కదా! ఇది మీ వంటింట్లోనే దొరుకుతుంది. అదేనండీ వంటసోడా దీన్ని నీటిలో కలిపి అందిస్తే... సోడియం, కార్బన్ వంటి సూక్ష్మ పోషకాలను మొక్కలకు అందిస్తుంది. అంతేకాదు, ఆకులపై శిలీంద్రాలు ఏర్పడినా మట్టిలో పంగస్ చేరినా సమస్య తగ్గుతుంది.



## తెలుసుకుందాం..

ప్రతిమా పూరి.. ఇండియన్ టెలివిజన్ చరిత్రలో న్యూస్ రీడర్‌గా పనిచేసిన తొలి మహిళ. 1965లో దూర్‌దర్శన్ లో ఐదు నిమిషాల న్యూస్ బెలిటెన్‌ను చదివి తన కెరియర్‌ను ప్రారంభించారీమె.




# అందమైన ఆర్గాంజా ఫ్యాషన్



పట్టు పరికిణీలో ఆడపడుచులు బుట్ట బొమ్మలా ఉన్నా.. లెహంగాలు తెచ్చే అందమే వేరు. అందులోనూ రంగు రంగుల పూల డిజైన్లతో, తక్కువ బరువుతో ఉండే ఆర్గాంజా లెహంగాలు భలే లుక్ ఇస్తాయి. అందుకే ఆ తరం, ఈ తరం అనే తేడా లేకుండా కాలేజీ అమ్మాయిల నుంచి నడివయసు వాళ్లవరకూ వీటిని వేసుకుని మురిసిపోతున్నారు. ఎంబ్రాయిడరీ, క్రిస్టల్, మిర్రర్, క్రష్డ్, శాటిన్.. అంటూ రకరకాల లెహంగాలు అతివల మనసు దోచేస్తున్నాయిప్పుడు. అల్లంత దూరాన ఉన్నా కూడా.. ఆకాశంలో తారల్లా మెరిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లూ, వేడుకలంటేబ్రైట్, బోల్డ్ రంగులే. కానీ, ప్రస్తుతం మ్యూటెడ్, పేస్టల్ షేడ్స్ ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ పూల ఆర్గాంజా లెహంగా ఒక్కటున్నా ఉండాల్సిందే అనుకుంటున్నారంతా. ఇక ఫ్యాషన్ ప్రియుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ల వార్డ్‌రోబ్‌లో అయితే, ఆర్గాంజా లెహంగా తప్పక ఉండాల్సిందే. అందుకే హల్దీ, మెహందీ, సంగీత్‌లకు మోడ్రన్‌గా కనిపించాలనుకుంటే ఫ్లోరల్ డిజైన్‌లను ఎంచుకుంటున్నారు ముద్దుగుమ్మలు. ఏ రిసెప్షనో, స్నేహితురాలి పెళ్లికో అయితే, కొంచెం గ్రాండ్‌గా బ్లౌజ్‌కూ, స్కర్ట్ బోర్డర్‌కూ జరీ, సీక్విన్స్ ఎంబ్రాయిడరీ లాంటివి చేయించి.. పెళ్లి కళ అంతా మాదే అనేస్తున్నారు. పైగా సందర్భమేదైనా ఫ్యాషనబుల్‌గా, హుందాగా ఉండడంతోపాటు సౌకర్యంగానూ ఉంటాయివి. వీటి మీదకు మరీ హెవీ జ్యుయెలరీ అవసరం కూడా ఉండదు. కాబట్టి, మెడలో ఓ చిన్న చోకర్ వేసుకుని జుట్టు వదిలేస్తే చాలు. సింపుల్ లుక్‌లో మెరిసిపోతారంతే. పైగా వేసవి, వర్షాకాలాల్లో ఎలాంటి చిరాకు లేకుండా హాయిగా, తేలిగ్గా ఉండి గాల్లో తేలుతున్న ఫీలింగ్‌నీ కలిగిస్తాయి మీరూ ప్రయత్నిస్తారా మరి!









# ఇడ్లీ ఏటీఎమ్ !

వేడివేడి ఇడ్లీలు తిన్నప్పుడు ఉండే మజానే వేరు. ఇంట్లో చేసుకుంటే తప్ప బయట వేడివేడిగా తినడం కొద్దిగా కష్టమే. అందులోనూ ఏ రానరతిపూటో తినాలనుకుంటే మరీ కష్టం. ఆ ఇబ్బంది లేకుండా ఇక నుంచి అర్ధరాత్రి కూడా వేడివేడి పొగలు కక్కే ఇడ్లీలను తినొచ్చు. అదెలా అంటారా? ఇడ్లీ ఏటిఎమ్‌కెళ్లి బటన్ నొక్కితే చాలు. మీరెన్ని కోరుకుంటే అన్ని అప్పటికప్పుడు వండిన రుచికరమైన వేడి ఇడ్లీలు.. చట్నీతో కలిసి అందుతాయి. బాగుంది కదా! ఈ ఏర్పాటు బెంగళూరుకు చెందిన ఫ్రెష్‌హాట్ రోబోటిక్స్ అనే స్టార్టప్ సంస్థ ఈ ఇడ్లీ ఎటిఎమ్‌ని లేదా ఇడ్లీ బాట్‌ని. ప్రారంభించింది. 2016లో శరణ్‌హితమత్ అనే ఆయన ఆరోగ్యం బాగోలేని తన కూతురుకి తినిపించడం కోసం ఇడ్లీలు కొందామని ఊరంతా తిరిగినా ఎక్కడా దొరకలేదట. మరోసారి స్నేహితుడు సరేష్ చంద్రశేఖర్‌తో కలిసి బయటకు వెళ్లినప్పుడు చల్లారి పోయి గట్టిగా రాళ్లలా మారిన ఇడ్లీలు పలకరించాయట. దీనికి అప్పటికప్పుడు తయారు చేసే మెషీన్ ఇడ్లీలే మార్గమని చెప్పి ఇద్దరూ కలిసి ఈ ఇడ్లీ బాట్‌ని తయారుచేశారు. మెనూలో ఆర్డర్ ఇస్తే ఒక నిమిషంలో ఇడ్లీలని ఇచ్చేస్తుంది. ఒకేసారి 72 ఇడ్లీలను పన్నెండు నిమిషాల్లో తయారుచేయగలదు. త్వరలో దోసబాట్, రైస్ బాట్ కూడా చేయాలనుకుంటున్నారు వీళ్లు. □



**చెలి చిట్కా**

బూడిద గుమ్మడి కాయగాని లేదా కొబ్బరికాయగాని పసుపురాసి బొట్టు పెట్టి వీధిగుమ్మం ముందు వేలాడగట్టిన ఆ ఇంటి వారికి నరఘోష దృష్టి దోషం తగలదు.

# పొగాకు జీవితాన్ని హరిస్తుంది-2

**ఆరోగ్య భాగ్యం**




**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

ప్రతి 10 మందిలో 8 మంది వివిధ కేన్సర్స్‌తో మరణిస్తున్నారు. కేన్సర్‌తో మరణించేవారిలో 30శాతం మేరకు ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నారు. దీంతోపాటు గర్భాశయ కేన్సర్, మూత్రాశయం, కిడ్నీ, కాలేయం, పాంక్రియాటిక్ కేన్సర్లు, లింఫోమా, మల, ప్రేగు కేన్సర్, అన్నవాహిక, స్వంపేటిక, నోరు గొంతు, కడుపు కేన్సర్స్ 48.3% కేసుల్లో కన్పిస్తాయి. ఇవేగాకుండా శ్వాసకోశ వ్యాధులైన ఆస్త్మా నబ్రాంకైటిస్, సిఒపిడి, ఎంఫెసీమా, న్యూమోనియా, సంతానోత్పత్తి సమస్యలు ఇన్సులిన్ నిరోధకత, చిగుళ్ళ వ్యాధి, ఎముకల సాంద్రతని కోల్పోవడం, దృష్టి సమస్యలు, గ్లకోమా, మాక్యులాల్ డిజినరేషన్ వంటి కంటి సమస్యలు, టైప్-2 డయాబెటిస్ వ్యాధులు 41.1% మందిలో కన్పించడం విశేషం. పొగ తాగే అలవాటు లేని వారికంటే పొగతాగేవారికి గుండెపోటు వచ్చే అవకాశాలు 70% ఎక్కువగా ఉంటాయి. 50 సంవత్సరాల లోపు గుండెపోటుతో మరణించేవారిలో ఎక్కువ శాతం ధూమపానం అలవాటున్నవారే. రోజూ తాగే సిగరెట్ మోతాదుకు, వివిధ వ్యాధులకు సంబంధం ఉందని తేటతెల్లం అవుతుంది. అంతే గాకుండా పొగత్రాగడం వల్ల కాళ్ళు చేతులలో రక్తనాళాలు మూసుకుపోయి రక్త ప్రసరణ లేకపోవడం వల్ల మానని గాయాలు ఏర్పడి, గాయాలు మానక గాంగ్రీన్ వచ్చి కాళ్ళు చేతుల్లో కొంత భాగాన్ని తీసివేసే బర్జర్స్ వ్యాధి వస్తుంది. ఇవే గాకుండా గ్యాస్ట్రిక్ అల్సర్స్, జీర్ణశయ వ్యాధులు, ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్, గ్యాస్ట్రయిటిస్ వంటి అనేక జీర్ణాశయ వ్యాధులు వస్తాయి. దీనికి పొగత్రాగడం మానివేయడమే సరైన మార్గమని చెప్పవచ్చు. కేవలం పొగ త్రాగే వారికీ వ్యాధులు వస్తాయనుకోవడం పొరపాటు. మన పరిసరాలలో పొగ తాగేవారుండే మనం కూడా పొగ త్రాగుతున్నట్లే లెక్క. బహిరంగ ప్రదేశాలు, ఇళ్ళు, హోటళ్ళు, సినిమా హాళ్ళు మొదలైన ప్రాంతాల్లో ధూమపాన ప్రియులు వదిలే పొగ కారణంగా పర్యావరణ కాలుష్యానికి భంగం వాటిల్లడంతో బహిరంగ ప్రదేశాల్లో పొగ త్రాగడం నిషేదింపబడింది. దీని వల్ల పొగ తాగనివారికి కూడా వివిధ వ్యాధులు రావడాన్ని 'పాసివ్ స్మోకింగ్' అంటారు. ఇంట్లో పొగ త్రాగడం వల్ల ముఖ్యంగా పిల్లలు, కుటుంబ సభ్యులు తరుచు శ్వాసకోశ సమస్యలతో బాధపడడమే కాకుండా ఊపిరితిత్తుల కేన్సర్‌తో 1-3% మంది బాధపడే అవకాశముందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2020 లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలో 22.3% పొగత్రాగే వారుంటే, అందులో 36.7% పురుషులు 7.8%స్త్రీలున్నారు. 32 దేశాల్లో పొగాకు వినియోగదారులు మానడానికి కృషి చేస్తున్నారు. ప్రతి సిగరెట్ జీవితానికి దాదాపు 10-15 సార్లు కాల్చేయడంతో 20 నిమిషాలు పడుతుంది. అది శరీరంలోకి ప్రవేశించిన 10 సెకన్లలో మెదడుకి చేరి అడ్రినలిన్‌ని విడుదల చేయడంతో ఆనందం, శక్తి వచ్చినట్లు, ఒత్తిడి నుండి రిలీఫ్ వచ్చినట్లుంటుంది. మరికొందరు స్టేటస్ కోసం, ఫ్యాషన్ కోసం అలవాటు చేసుకుంటే 80-90 నికోటిన్‌కి బానిసలవుతారు. అలసటగా, ఉత్సాహంగా లేనట్లుండ డం, హృదయ స్పందన రేటు తగ్గడం ఆకలి లేకపోవడం, బరువు పెరగడం, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్స్ ఏర్పడడం, బావోద్వేగాల్లో మార్పులు ఏర్పడతాయి. పొగ తాగే అలవాటు ఉండి, వెంటనే మానివేయడం వల్ల కొద్ది నెలలకే మరణించిన వారి సంఖ్య అధికంగా ఉంది. కనుక పొగ తాగేవారు వెంటనే మానివేయక, క్రమేణా సిగరెట్ల సంఖ్య తగ్గిస్తూ, పీల్చిన పొగని లోపలికి పోకుండా బైటికి వదిలేస్తూ మానివేయాలి. పొగ త్రాగే వారిలో 10-12 సంవత్సరాల ఆయుస్సు తగ్గుతుంది. నికోటిన్ వ్యసనం నుండి విముక్తి అనేది మీరు మీకు ఇవ్వగల గొప్ప బహుమతి. ధూమపానం మానేయడానికి మీకు సంకల్పశక్తి అవసరం లేదు. మీకు కొంచెం అవగాహన అవసరం అంతే. అందుకే పొగాకు నిషేదించిన మొదటి రాష్ట్రం కేరళ ముందుంటే, పొగాకు రహిత రాష్ట్రంగా హిమచలప్రదేశ్ ఉండడం గమనర్హం. ఇది 35 వేల కోట్ల పరిశ్రమతో 36 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఎక్సైజ్ ఆదాయంలో చాల సిగరెట్స్ ద్వారానే లభిస్తోంది. (10% వాటాకల్గి ఉంది) అందుకే పొగాకుని పూర్తిగా ప్రభుత్వం నిషేదించలేదు. □

# రోజంతా ఐలైనర్ ఉండాలంటే..

కంటిని ఇంపుగా తీర్చిదిద్దుకోవడానికి ఎంతో కష్టపడి ఐలైనర్ పెట్టుకుంటాం. అయితే రోజంతా ఐ లైనర్ అలాగే నిలిచి ఉంటుందా అంటే.. కష్టమే అని చెప్పాలి. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఇది సాధ్యమేనంటున్నారు నిపుణులు. అవేంటంటే..!



✦ .ముఖానికి మాయిశ్చరైజర్ రాసుకునే దృష్టి, కనురెప్పల చుట్టూ కూడా అప్లై చేసుకొని.. ఆపై ఐలైనర్ పెట్టుకుంటారు చాలామంది. అయితే దీనివల్ల ఐలైనర్ త్వరగా చెదిరిపోయే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. కాబట్టి కళ్లకు ఐలైనర్ పెట్టుకోవాలనుకుంటే ఆ ప్రదేశంలో మాయిశ్చరైజర్ రాసుకోకపోవడమే మంచిది. ✦ పదే పదే ముఖం కడుక్కోవడం, చెమట పట్టడం వల్ల కూడా ఐ లైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండదు. అలాంటప్పుడు వాటర్ ప్రూఫ్ లేదా జెల్ తరహా ఐలైనర్ ఫీచర్ మేలు.

✦. అద్దీ అద్దనట్లుగా కొద్దిపాటి పౌడర్‌ని ఉపయోగిస్తే ఐ-లైనర్ మెరుపు తగ్గకుండా చూసుకోవచ్చు. అలాగే ముందు పౌడర్ రాసుకొని ఆపై ఐలైనర్ అప్లై చేసుకున్న ఫలితం ఉంటుంది. ✦ ముఖానికి మేకప్ వేసుకునే ముందు ప్రైమర్ ఎలాగైతే రాసుకుంటామో.. ఐ-లైనర్ పెట్టుకోవడానికి ముందు కూడా ఐ ప్రైమర్ అప్లై చేయడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే అది కూడా తక్కువ మొత్తంలో రాసుకుంటే ఐలైనర్ ఎక్కువ సేపు నిలిచి ఉంటుంది.

5. ఐషాడో కూడా ఐలైనర్ ఎక్కువ సమయం నిలిచి ఉండేందుకు సహకరిస్తుంది. ఈ క్రమం ఐలైనర్ వేసుకోవడం పూర్తయ్యాక.. బ్రష్ సహాయంతో కనురెప్పలపై షాడోని పైపైన అమర్చి సరిపోతుంది.

6. ఐలైనర్ అప్లై చేసుకున్న తర్వాత ఫైనల్‌గా కన్సీలర్‌తో టచప్ ఇచ్చినా చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. □

# విగ్రహాల విశిష్టత

**ఆధ్యాత్మికం**



**శిల, లోహ విగ్రహాలకు** భిన్నంగా పూరీ దేవాలయంలో దేవతామూర్తులు కర్రతో రూపుదిద్దుకోవటం విశేషం. దారువుతో (కొయ్య) తయారైనందువల్ల ఇక్కడి మూలమూర్తిని దారుబ్రహ్మం అంటారు. అలాగే ఒకే దారువు సుదర్శనమూర్తితో కలిపి నాలుగు విగ్రహాలుగా అయ్యిందని పురాణోక్తి. ఈ విగ్రహాల శిల్పరీతి అపురూపం. ఇక్కడి దేవతలు వదన ప్రధాన దేవతలు. అంటే భావ ప్రకటనకు స్థానమైన ముఖాలే ప్రధానంగా ఉన్న విగ్రహాలు. ఈ ప్రతిమల్లో జ్ఞానేంద్రియాలే ప్రముఖంగా కనిపించటం విశేషం. వీటిని తొలుత చతుర్ముఖ బ్రహ్మ ప్రతిష్ఠించాడన్నది పురాణ వచనం. ఆయన విధించిన నియమాల ప్రకారం-పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే ప్రతి అధిక ఆషాఢంలో పూజారులకు కలలో కనిపించే విశేష దారువులు సేకరించి కొత్త విగ్రహాలను మలుస్తారు. పాత ప్రతిమల స్థానంలో కొత్త విగ్రహాలను ప్రతిష్ఠించటం ఆనవాయితీ. ప్రధానమూర్తి నయనాలు గుండ్రంగా, రెప్పలు లేకుండా ఉంటాయి. పరమాత్ముడు రెప్ప వేయకుండా అనుక్షణం కాపాడుతాడు అనటానికిది సాక్ష్యం. పూరీ జగన్నాథుడికి చక్ర నయనుడు అని కూడా పేరు. నల్లని జగన్నాథుడు తెల్లని బలభద్రుడు, పసుపుపచ్చని సుభద్రమ్మలతో పాటు స్తంభాకృతిలో ఉన్న మరో దారువుపై చక్రాయుధ దైవమైన సుదర్శనస్వామి ఈ ఆలయంలో దర్శనమిస్తాడు. □

# ఈ పండులో పోషకాలు మెండు!

డ్రాగన్ ఫ్రూట్.. ఈ మధ్య ఎక్కడ చూసినా ఈ విదేశీ పండు చర్చే. ఇప్పుడు మన దగ్గరా వీటిని విస్తారంగా పండిస్తుండటంతో అందరికీ అందుబాటులోకి వచ్చేసింది. మరి ఇంతకీ ఇది చేసే మేలెంటో తెలుసుకుందాం..

✦ ఇందులో పీచు, మాంస కృతులు, ఇనుము, జింక్, మెగ్నీసియం, ఫాస్పరస్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. నిస్సత్తువ నుంచి బయటపడాలంటే ఈ పండు ముక్కలు కాసిన్ని తింటే చాలు. అలానే రక్తహీనతను అధిగమించాలన్నా ఐరన్ అధికంగా ఉండే వీటిని తీసుకోవచ్చు.

✦ డ్రాగన్ పండులో ఉండే పిటయా అనే పోషకం రోగనిరోధకతను పెంచుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి హాని చేసే ఫ్రీరాడికల్స్‌ని నాశనం చేసి క్యాన్సర్ ముప్పుని అడ్డుకుంటాయట. ఇక, ఇందులోని ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్, ఫైబర్ వంటివి చక్కెర స్థాయుల్ని అదుపు చేస్తాయి. ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ని మెరుగుపరుస్తాయి.



✦ ఇక దీని గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మేలు చేసే కొలెస్ట్రాల్‌ని పెంచితే, మెగ్నీసియం గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నీరు, పీచు సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండటమే కాదు.. బరువూ అదుపులో ఉంటుంది. □

# తీవ్ర ఒత్తిడిలోనూ అద్భుత ఇన్నింగ్స్


సచిన్ టెండుల్కర్


విరాట్ కోహ్లీ


స్టీవ్ స్మిత్


జాక్వెస్ కల్లిస్

## నాకౌట్లలోనూ హాఫ్ సెంచరీలు

### కీలక విజయాలు అందించిన హీరోలు

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో ఐసిసి టోర్నమెంట్లు అంటేనే ఆటగాళ్లకి అగ్నిపరీక్ష. అందులోనూ నాకౌట్‌మ్యాచ్‌లుఅంటే ఒత్తిడి తారాస్థాయిలో ఉంటుంది. అలాంటి కీలక సమయాల్లో నిలకడగా రాణించడం ఏ బ్యాట్స్‌మెన్‌కైనా పెద్ద సవాలు. అయితే ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ ఈ సవాలును ఛేదించి, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక 50+ స్కోర్లు సాధించిన ఆటగాళ్ల ఎలైట్ జాబితాలో చేరి అరుదైన రికార్డును నెలకొల్పాడు. ఈ ఎలైట్ జాబితాలో అగ్రస్థానంలో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఉన్నాడు. అతను ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో పది 50+ స్కోర్లతో అసమానంగా నిలిచాడు. తన కెరీర్‌లో 22 ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, కోహ్లీ 51.20 సగటుతో 1000 పైగా పరుగులు సాధించాడు. ఇందులో తొమ్మిది హాఫ్ సెంచరీలు, 2023 ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై వచ్చిన సెంచరీ ఉన్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ టెస్ట్ క్రికెట్‌లో, ఈ తరంలో అతిపెద్ద క్లచ్ ప్లేయర్‌గా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ఇక ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, 36 ఏళ్ల అనుభవజ్ఞుడు కేవలం 13 మ్యాచ్‌లలో ఏడు 50+ స్కోర్‌లను నమోదుచేశాడు. 59.09 సగటుతో 5 హాఫ్ సెంచరీలు, రెండు మ్యాచ్ డిఫైనింగ్ సెంచరీలు ఉన్నాయి. ఈ రెండూ 2015 ఐసిసి ప్రపంచ కప్, 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియాకు టైటిల్స్ సాధించడంలో కీలకంగామారాయి. ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచిన టీమిండియా దిగ్గజం సచిన్, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో ఆరు 50+ స్కోర్లు సాధించాడు.

అలాగే, టెండూల్కర్ మొత్తం 682 పరుగులు సాధించాడు. వాటిలో ఐదు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీఉన్నాయి. అలాగే సౌరవ్ గంగూలీ, జాక్వెస్ కల్లిస్, కుమార్ సంగక్కర, కేన్ విలియమ్సన్‌లు ఐసిసి నాకౌట్‌లలో ఐదుసార్లు 50+ స్కోర్లు సాధించారు. తీవ్రమైన ఒత్తిడిలోనూ వీరు అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుని, తమ జట్టుకు కీలక విజయాలను అందించారు.



## టి20 ముంబై లీగ్‌లో.. విజేతగా

# మరాఠా రాయల్స్

### 5 వికెట్ల తేడాతో ముంబై ఫాల్కన్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** టి20 ముంబై లీగ్-2025, ఫైనల్ మ్యాచ్‌లో సోబో ముంబై ఫాల్కన్స్‌ను ఓడించి మరాఠా రాయల్స్ ట్రోఫీని ఎత్తేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే పరిమితం చేసి, ఆపై టి20 ముంబై లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను గెలుచుకోవడానికి నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. రాజేష్ సుతార్ అర్ధ సెంచరీ, అవాయిస్ నౌషాద్ ఉపయోగకరమైన సహకారం ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్‌ను విజేతగా నిలిపింది. తొలుత బౌలింగ్ ఎంచుకున్న మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే కట్టడి చేసింది. ఆతర్వాత సుతార్ 49 బంతుల్లో 53 పరుగులు చేసి, రెండు బౌండరీలు, సిక్సర్లతో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. నౌషాద్ 38 (24 బంతులు) పరుగులు చేసి, సుతార్‌తో కలిసి నాల్గవ వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు, ఈ జంట మరాఠా రాయల్స్‌ను విజయ ద్వారం వద్దకు తీసుకెళ్లింది. అంతకుముందు, మయూరేష్ టాండెల్ (50 నాటౌట్), హర్ష్ అఘవ్ (45 నాటౌట్) 49 బంతుల్లో 85 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ముంబై ఫాల్కన్స్ 157/4 స్కోరు చేయగలిగింది. 12వ ఓవర్లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అవుట్ కావడంతో జట్టు స్కోరు 72/4కి తగ్గే వరకు ఆటలో సగం సమయానికి 60/3తో కష్టాల్లో పడింది. నాలుగు సిక్సర్లు బాదిన అఘవ్, టాండెల్ తో కలిసి స్కోరింగ్ ను వేగవంతం చేసాడు, అయినప్పటికీ జట్టు తక్కువ స్కోరుతో ముగిసింది. సోబో ముంబై ఫాల్కన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 (మయూరేష్ టాండెల్ 50 నాటౌట్, హర్ష్ అఘవ్ 45 నాటౌట్; వైభవ్ మాలి 2/32) ఎమ్మెసి మరాఠా రాయల్స్ చేతిలో 19.2 ఓవర్లలో 158/5 (చిన్మయ్ సుతార్ 53, అవాయిస్ ఖాన్ 38) ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది.



## యూరోపియన్ టూర్‌లో..

# భారత్ మూడో విజయం

### బెల్జియం 3-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల యూరప్‌టూర్‌లో భారత్ వరుసగా మూడో విజయాన్ని సాధించింది. ఆంట్వెర్ప్‌లోని విల్రిజ్క్ ప్లీన్‌లోని హాకీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం బెల్జియంపై 3-2 తేడాతో విజయంసాధించి భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు యూరప్‌లో తన విజయాల పరుగును కొనసాగించింది. భారత్‌తరపున సోనమ్ (4వనిముషం), లాల్తాంట్లుంగి (32వ నిముషం), మరియు కనికా సివాచ్ (51వ నిముషం) గోల్స్ సాధించగా, బెల్జియం మేరీ గోయెన్స్ (37వ నిముషం) మరియు మార్టే మేరీ (40వ నిముషం) ద్వారా ప్రతిస్పందించింది. నాల్గవనిమిషంలోనే సోనమ్ ఫీల్డ్‌గోల్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ప్రారంభంలోనేగోల్‌చేసింది. మూడవక్వార్టర్ ప్రారంభంలో లాల్తాంట్లువాంగి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడం ద్వారా, మొదటి అర్ధభాగం వరకు 1-0 ఆధిక్యాన్ని కొనసాగించిన ఆతిథ్య జట్టు మూడవ క్వార్టర్ ప్రారంభంలో ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. అయితే బెల్జియం పుంజుకుని మూడు నిమిషాల వ్యవధిలో రెండుసార్లు గోల్స్‌చేసింది. 37వనిమిషంలో గోయెన్స్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచింది. 40వ నిమిషంలో మార్టే మేరీ ఫీల్డ్ గోల్ చేసి మ్యాచ్‌ను 2-2తో సమం చేసింది. అయితే, నాల్గవ క్వార్టర్ చివరిలో భారత్ తిరిగి నియంత్రణ సాధించింది. 51వ నిమిషంలో కనికా పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని పునరుద్ధరించింది, దీనితో జట్టు గట్టి పోరాటంతో విజయం సాధించింది.

## టేబుల్ టెన్నిస్‌లో.. సెమీఫైనల్స్‌కు

# యు ముంబా, దబాంగ్ ఢిల్లీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్, సీజన్ 6లో యు ముంబా టిటి 10-5 తేడాతో దబాంగ్ ఢిల్లీ టిటిసిపై విజయం సాధించి నాల్గవ మరియు చివరి సెమీఫైనల్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఓటమితో ఢిల్లీ జట్టు నాలుగు టైటిల్‌తో గెలిచిన విజయ పరంపరకు తెరపడింది. అయితే సీజన్ 2 ఛాంపియన్స్ ఇప్పటికీ 44 పాయింట్లతో లీగ్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

శుక్రవారం జరిగిన ఈ గేమ్‌లో తొలి సింగిల్స్‌లో లిలియన్ బార్డెట్ యు ముంబా టిటికి సరైన ఆరంభాన్ని ఇచ్చి సత్యన్ జ్ఞానశేఖరన్‌ను 2-1 తేడాతో ఓడించాడు. మొదటి గేమ్‌ను 11-10 తేడాతో ముగించిన తర్వాత, బార్డెట్ రెండవ గేమ్‌ను 4-11 తేడాతో కోల్పోయాడు, కానీ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 11-4 తేడాతో విజయం సాధించి బలంగా స్పందించాడు. ఆ తర్వాత బెర్నాడెట్ సోక్స్ దియా చిటాలేపై 2-1 తేడాతో విజయం సాధించింది. చిటాలే మొదటి గేమ్‌ను 11-3 తేడాతో గెలుచుకున్నాడు, కానీ సోక్స్ 11-10 గోల్డెన్ పాయింట్ విజయంతో సమంచేసి మ్యాచ్‌ను 11-8 తేడాతో ముగించాడు. ఈ జోరు మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా కొనసాగింది, ఆకాష్ పాల్‌తో కలిసి స్జోక్స్ తొలిగేమ్‌లో ఇజాక్‌క్వ్యాక్ మరియు దియా చిటాలేలను ఓడించి యు ముంబా సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించింది. ఢిల్లీ తిరిగి పుంజుకుని, మిగిలిన రెండు గేమ్‌లను గెలుచుకుంది మరియు ఆ తర్వాత మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. సింగపూర్‌కు చెందిన ఇజాక్ క్వ్యాక్‌పై 2-1 తేడాతో విజయం సాధించి అభినందన్ పిబి యు ముంబాకు మరోరెండు పాయింట్లు జోడించాడు. ఈ సీజన్‌లో తొలిసారి ఆడిన అభినందన్ మొదటి రెండు గేమ్‌లను బలంగా ప్రారంభించాడు, ఆ తర్వాత ఇజాక్ 11-7 తేడాతో ఒక విజయం సాధించి దబాంగ్ ఢిల్లీని పట్టికలో అగ్రస్థానానికి చేర్చాడు. చివరి రబ్బర్‌లో, యశస్విని ఘోర్పడే తన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్స్ 2023 సహచరురాలు సుహానా సైనిని 3-0 తేడాతో ఓడించి, గోల్డెన్ పాయింట్‌పై రెండు గట్టి గేమ్‌లను గెలిచి 11-3 తేడాతో మ్యాచ్‌ను ముగించింది. స్జోక్స్ విదేశీ ఆటగాడు మరియు షాట్ ఆఫ్ ది టైె అనే డబుల్ గౌరవాలను గెలుచుకోగా, యశస్విని ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ది టైగా ఎంపికైంది.

## క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో

# క్వార్టర్ ఫైనల్స్‌కు జెంగ్ క్విన్వెన్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్ కార్ట్నీ కెస్లర్‌కు ఓటమి ఎదురైంది. లండన్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్‌కార్ట్నీ కెస్లర్‌ను 6-3, 4-6, 7-5 తేడాతో ఓడించడంతో జెంగ్ క్విన్వెన్ క్వీన్స్ క్లబ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ 42వ ర్యాంక్ ప్లేయర్ జెంగ్‌తో జరిగిన చివరి 16వ ర్యాంక్ మ్యాచ్‌లో చివరి సెట్‌లో 42తో వెనుకబడి ఉంది. కానీ పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ పశ్చిమ లండన్‌లో జరిగిన వింబుల్డన్ వార్మప్ ఈవెంట్‌లో ఓటమిని నివారించడానికి ప్రయత్నించింది. గత సంవత్సరం రోలాండ్ గారోస్‌లో జరిగిన క్లే కోర్టులో డోనా వెకిక్‌ను ఓడించి జెంగ్ సింగిల్స్ ఈవెంట్‌లో ఒలింపిక్ స్వర్ణం గెలిచిన తొలి ఆసియా క్రీడాకారిణిగా నిలిచింది. ప్రస్తుతం డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో ఐదవ స్థానంలో ఉన్న 22 ఏళ్ల ఆమె ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది. 52 సంవత్సరాల తర్వాత క్వీన్స్‌లో జరిగిన తొలి మహిళల ఈవెంట్‌లో, 2022 వింబుల్డన్ ఛాంపియన్ మరియు నాల్గవ సీడ్ ఎలెనా రైబాకినా బ్రిటన్‌కు చెందిన హీథర్ వాట్సన్‌పై 6-4, 6-2 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. కాగా చివరి ఎనిమిది మ్యాచ్‌లో రైబాకినా జర్మనీకి చెందిన టాట్జానా మరియాతో తలపడనుంది, ఆస్ట్రేలియన్ ఓపెన్ హోల్డర్ మాడిసన్ కీస్ ష్నైడర్‌తో తలపడనుంది.

# మొబైల్ వినియోగదారులకు టెలికాం కొత్త రూల్స్

**ముంబై, జూన్ 13:** మొబైల్ వినియోగదారులకు కేంద్ర టెలికాం శాఖ (డాట్) ఒక శుభవార్త అందించింది. ప్రీపెయిడ్ కనెక్షన్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు లేదా పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మారాలనుకునే కస్టమర్ల కోసం నిబంధనలను సరళతరం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమకు నచ్చిన ప్లాన్‌కు మారేందుకు పట్టే సమయం గణనీయంగా తగ్గనుంది. ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) ఆధారిత కేవైసీ ప్రక్రియ ద్వారా ఈ మార్పులను సులభతరం చేసినట్లు టెలికాం శాఖ వెల్లడించింది. ఇంతకుముందు, ఒక వినియోగదారుడు తన మొబైల్ సర్వీస్‌ను ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు మార్చుకున్న తర్వాత, మళ్లీ మరోసారి ప్లాన్ మార్చుకోవాలంటే కనీసం 90 రోజుల పాటు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ వ్యవధిని కూలింగ్ ఆఫ్ పీరియడ్‌గా పరిగణించేవారు. అయితే, జూన్ 10న టెలికాం శాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం, ఈ నిరీక్షణ కాలాన్ని 30 రోజులకు కుదించారు. అంటే, ఒకసారి ప్లాన్ మార్చుకున్న తర్వాత, కేవలం 30 రోజుల వ్యవధిలోనే మరోసారి తమకు అనుకూలమైన ప్లాన్‌కు మారేందుకు అవకాశం కల్పించారు. ఈ కొత్త సదుపాయాన్ని పొందాలనుకునే వినియోగదారులు తమ సమీపంలోని టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల యొక్క కస్టమర్ సర్వీస్ కేంద్రాలను లేదా అధీకృత ఔట్‌లెట్‌లను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడ ఓటీపీ ఆధారిత కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ఈ మార్పును చేసుకోవచ్చు. ఈ విషయాన్ని డాట్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తెలియజేసింది. అయితే, ఈ 30 రోజుల నిరీక్షణ కాలపు తగ్గింపు సౌకర్యం కేవలం మొదటిసారి తమ ప్లాన్‌ను మార్చుకునే వారికి మాత్రమే వర్తిస్తుందని టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఒక వినియోగదారుడు ఈ వెసులుబాటును ఒకసారి ఉపయోగించుకున్న తర్వాత, భవిష్యత్తులో మళ్లీ ప్లాన్ మార్చుకోవాలనుకుంటే, అప్పుడు పాత పద్ధతిలోనే 90 రోజుల నిరీక్షణ కాలాన్ని పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కొత్త నిబంధన వల్ల వినియోగదారుల సమయం ఆదా అవ్వడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన సర్వీసులను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది.



## భారత్ నుంచే అమెరికాకు 97% ఐఫోన్ల ఎగుమతి..

**వాషింగ్టన్, జూన్ 13:** చైనాపై అమెరికా విధించిన సుంకాలను ఎదుర్కొనే ప్రక్రియలో భాగంగా ఆపిల్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది మార్చి-మే మధ్య కాలంలో కరించింది. చైనా నుంచి ఎగుమతి చేసే ఐఫోన్‌లపై అధిక సుంకాలు ఉండటంతో యాపిల్ భారత్‌లో ఉత్పత్తిని వేగవంతం చేసింది. మార్చి-మే మధ్య కాలంలో భారత్ నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను అమెరికాకు ఎగుమతి చేసింది. మార్చిలో రికార్డు స్థాయిలో 1.3 బిలియన్ డాలర్లు, మేలో 1 బిలి యన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అమెరికాకు పంపింది. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లోనే 4.4 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను ఎగుమతి చేసింది. ఇది గతేడాదిలో ఎగుమతైన 3.7 బిలియన్ డాలర్ల ఐఫోన్ల విలువ కంటే ఎక్కువ.



అమెరికా.. భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో అదనపు సుంకాన్ని నివారించేందుకు భారత్ చర్చలు కొనసాగిస్తోంది. ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా కొనసాగుతుంది. మరోవైపు చైనా, అమెరికా దేశాలు సుంకాలను తగ్గించే ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి. భారత్ నుంచి ఎగుమతి చేసిన ఐఫోన్‌ల లో 97శాతం అమెరికాకు చేరాయి. గతంలో భారత్ నుంచి నెదర్లాండ్, బ్రిటన్ వంటిదేశాలకు ఐఫోన్లు ఎక్కువగా ఎగుమతయ్యేవి. కానీ ఇప్పుడు పూర్తిగా అమెరికాపై యాపిల్ దృష్టి కేంద్రీ

## వరల్డ్ టాప్ 20 ధనవంతుల్లో అంబానీ, అదానీ

**ముంబై, జూన్ 13:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ మరోసారి బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో తన సత్తా చాటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత



ధనవంతుల జాబితా ఉన్న ఈ సూచీలో ముఖేష్ అంబానీ 17వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ 20 స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే ఈ ఇండెక్స్‌లో టాప్‌లో టెస్లా సిఇఓ ఎలాన్ మస్క్, తర్వాత స్థానాల్లో మెటా సిఇఓ మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ అధినేత జెఫ్‌బెజోస్ నిలిచారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో ఇండియా నుంచి ముఖేష్ అంబానీ 17వ స్థానం, గౌతమ్ అదానీ 20వ స్థానంలో, శివ్‌నాడార్ 41వ స్థానంలో, షాపూర్ మిస్త్రీ 52వ స్థానంలో, సావిత్రి జిందాల్ 59వ స్థానంలో, అజిమ్ ప్రేమ్‌జీ 69వ స్థానంలో, సునీల్ మిట్టల్ 73వ స్థానంలో, దిలీప్ సంఘ్వీ 79వ స్థానంలో, లక్ష్మీ మిట్టల్ 86వ స్థానంలలో నిలిచారు.

# వాణిజ్యం

## స్టాక్ సూచీలను దెబ్బతీసిన ఇన్వెస్టర్ సెంటిమెంట్

**ముంబై, జూన్ 13:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపై పడింది. దీంతో ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,600 దిగువకు చేరింది. చివరకు రెండు ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,427.81 పాయింట్ల (క్రితం ముగింపు 81,691.98) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,354.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 573 పాయింట్ల నష్టంతో 81,118 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,473.00 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 169 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీశాయి. ముఖ్యంగా చమురు రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎటర్నల్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.39 డాలర్ల వద్ద ట్రేడవగా.. బంగారం ఔన్సు 3,445 డాలర్ల వద్ద కొనసాగింది. ఇజ్రాయెల్-ఇరాన్ సంక్షోభం అంతర్జాతీయ మార్కెట్లను మాత్రమే కాకుండా, దేశీయ మార్కెట్లపై కూడా భారీ ప్రభావాన్ని చూపుతోంది. చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయిమారకం విలువ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యూహాలు అమలు చేయాలి.



## చమురు ధరలపై ఇరాన్-ఇజ్రాయెల్ వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 13:** ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతం పైగా పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం చమురు ధరలపై ప్రభావం చూపుతోంది. ఈ దాడులతో హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే గ్లోబల్ ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడొచ్చనే ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చమురు రంగ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి రూ.299.20 వద్ద ట్రేడవుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి. దాదాపు 40 కి.మీ. మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీ.లు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1 కోట్ల (21 మిలియన్) బ్యారెళ్ల చమురుఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజు వారీ వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది.



## పెట్టుబడులకు మద్దతుగా పిఎల్ఐ స్కీమ్

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎలక్ట్రిక్, ఇతరత్రా ప్రత్యామ్నాయ ఇంధనాలతో పని చేసే హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ తయారీ కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి ప్రోత్సాహక పథకాన్ని (పిఎల్ఐ) ప్రవేశపెట్టితే మరిన్ని కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుందని ఓ నివేదిక తెలిపింది. ప్రస్తుతం దేశీయంగా ఇలాంటి వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడంతో భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ విభాగంపై తయారీ సంస్థలు, సరఫరాదారులు పెద్ద స్థాయిలో ఇన్వెస్ట్ చేయకపోవచ్చని పేర్కొంది. పిఎల్ఐ స్కీమును ప్రకటిస్తే కొత్త పెట్టుబడులు వస్తాయి. తయారీ, ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌డి విభాగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఎలక్ట్రిక్, ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే హెచ్ఇఎంఎంలను దేశీయంగా ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాలు పెరుగుతాయి అని భారతీయ ఖనిజ పరిశ్రమ సమాఖ్య (ఎఫ్ఐఎంఐ) రూపొందించిన నివేదిక తెలిపింది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌తో కలిసి ఎఫ్ఐఎంఐ దీన్ని రూపొందించింది. మైనింగ్ కార్యకలాపాల్లో కీలకమైన హెచ్ఇఎంఎంలు, కర్బన ఉద్గారాలకు కారణంగా ఉంటున్నందున పర్యావరణహితమైన మెషినరీపై ఆసక్తి ఏర్పడుతోంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.